# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204365
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T82/R16U Accession No. T1008

Author వేమం శ్రీ రామయ్య

Title ఉత్తరరామచరిత్రము

This book should be returned on or before the date last marked below.

---

శ్రీరస్తు.

# ఉత్తరరామచరితము.

ఇది

భవభూతి మహాకవికృత సంస్కృత నాటకమునకు

జయంతి రామయ్య బి. యె; బి. యల్

రచించిన యాంధ్రానువాదము.

సరస్వతీ పవర్ ముద్రాక్షరశాల

రాజమహేంద్రవరము

౧౯౩౧

[ వెల రు ౧-౦-౦

# ఉపోద్ఘాతము

సంస్కృతనాటకములం దెల్ల నుత్తమమని పేరు పొందిన యీ నాటకమింతకుఁబూర్వము పలువురు తెనిఁగించియున్నను దీనియందు నాకుఁ గలయభిరుచి చేతను గుణమే మాత్రమున్నను సహృదయులగు పాఠకులు గణింపకుండరను నమ్మకముచేతను నేనుగూడ దీనిం దెలిఁగింపఁబూనుకొంటిని. మూలములోని భావములకును రసములకును భంగము కలుగకుండ నాంధ్రభాషాసంప్రదాయములఁ బాటింప శక్తికొలఁది యత్నించినాఁడను. ఆ యత్నమెంతవఱకుఁ గొనసాగినదో రసజ్ఞులు నిర్ణయింతురుగాక.

ప్రజానురంజనమే రాజునకుత్తమధర్మమని నిరూపించుటయే యీ నాటకముముఖ్యోద్దేశమని నా యభిప్రాయము. సీతాపరిత్యాగ మిందలి యితివృత్తములోఁ బ్రధానభాగము. ఈ పరిత్యాగ మకార్యమనియు, రాముని చరిత్రమునందుఁ గళంకముగా నున్నదనియుఁ గొందఱు భావించుచున్నారు. ఇది కళంకము కాకపోవుటయే గాక రాముని చరిత్రమునకు వన్నె పెట్టుచున్నదని యీ నాటకము చదువువారికిఁ దోఁచకమానదు.

నాటకమం దెక్కడఁ జూచినను రామునికి సీతయందుఁ గలప్రేమ యుత్కటమని స్ఫురించుచున్నది. "ఈమె పెద్ద ప్రియము గాదొక్క విరహంబు వెగటు గాక" (౧—౩౮) యను నొక్కమాటలో నిదియంతయు నిమిడియున్నది. రాముని యనంతరవర్తనముగూడ దీనిని స్థిరపఱుచుచున్నది. అట్టి ప్రియురాలిని, నిర్దోషను, కఠోరగర్భభిన్నను, వంశాంకురోత్పత్తికాధార మయినదానిని, రాముఁడేల విడిచిపెట్టెను? జనానురంజనార్థమే. కులగురువగు వసిష్ఠు నుపదేశమును, నిజవంశాచారమును, పితృచరిత్రమును బురస్కరించుకొని లోకారాధనమే పరమధర్మమని రాముఁడు నిశ్చయించెను. పరిత్యాగకాలమందు "రాముఁడు జీవించియుండుటకుఁ బ్రయోజనము నేటితోఁ దీఱినది. జగత్తు జీర్ణశూన్యారణ్యమయినది. సంసార మసారము." అని రాముఁ డన్నమాటల నాతని యుత్తరవృత్తము స్థిరపఱుచుచున్నది. ఇట్టి దుష్కరకార్య మొనర్చుట కెంత దృఢమయిన ధర్మనిష్ఠ కావలయునో యూహింపుఁడు.

ఈ నాటకమందలి ప్రధానరసము విప్రలంభశృంగారమని కొందఱును, కరుణమని కొందఱును వాదించుచున్నారు. కరుణమే యిందలి ప్రధానరసమని నా మతము. గ్రంథము కరుణరసభూయిష్ఠమనుట నిర్వివాదాంశము. కాని, నాటకాంతమందు సీతారాములకుఁ బునస్సమాగమము కలిగినది కావున శృంగారమే ప్రధానరసమనియుఁ గరుణము దాని కంగమనియు, నంతయుఁ జేరి విప్రలంభశృంగార మయినదనియు శృంగారవాదుల వాదము. ఇది సరికాదు.

చిట్టచివర సమాగమము కలిగినను. అట్టి సమాగమము ప్రత్యాశావిషయ మయినప్పుడే విప్రలంభశృంగార మగునుగాని. ప్రత్యాశ లేనిది విప్రలంభ ముండదు. ఇదియే లాక్షణికసిద్ధాంతము. దీనికిఁ గొన్ని ప్రమాణముల నిక్రింద నుదాహరించెద.

(1) "ఇష్టవియోగమువలనఁ బుట్టినదియు, రతితోఁ గూడుకొననిదియుఁ, పరిమితమునగు మనోవికారము శోకము. అట్లయిన నిష్టవియోగమువలనఁ గలిగిన విప్రలంభముకూడఁ గరుణము కావలెనని యెచ్చునేయున్న విప్రలంభమందు శోకము రతితోఁ గూడియుండును, గావున నది శోకము కాదు. రతి యనఁ బ్రీతిమాత్రము కాదు. ప్రీతిలేక శోకమును బుట్టదుగదా! ఈపట్టున రతి యనఁగా నిష్టసమాగమాభిలాషయే గాని కేవల ప్రీతి కాదు. కుమారసంభవమునందు రతియొక్కయు, కాదంబరియందు మహాశ్వేతయొక్కయు రఘువంశమునం దజునియొక్కయుఁ బ్రలాపమందు బాధనిశ్చయమూలమున నిష్టసమాగమాభిలాష జనింపలేదు. కావున నా స్థలములందలి రసము కరుణమే. మృతుని విషయములోఁగూడ జీవితాశ యెచ్చటం గలుగునో యచ్చట నిష్టసమాగమాభిలాష కలుగును గావున రసము విప్రలంభశృంగారమే ఇచ్చట బాధ సందేహము. గ్రాహ్యాసందేహమునందుఁ బర్యవసిత మగుచున్నది. గాన సమీహకుఁ బ్రతిబంధము లేదు—" అని రసతరంగిణి! (1)

మఱియు నా గ్రంథమునందే—

"శోకముయొక్క పరిపోషణము కరుణమగును. ఆశావిచ్ఛేదమైనచో సర్వేంద్రియములు క్లాంతము లగును విప్రలంభమం దిష్టాశయుండునుగాన నీ కరుణ

(1) ఇష్టవిశ్లేషజనితో రత్యనాలింగితః పరిమితో మనోవికారశ్శోకః న చేష్టవిశ్లేషజనిత విప్రలంభశృంగారస్య కరుణరసత్వాపత్తి స్తస్యరత్యాలింగితత్వాత్-నచరతిః ప్రీతిస్తయావినాశోకోపినోత్పద్యతే తథాచానంభవ ఇతివాచ్యమ్ । ఇష్టసమీహాజనిత మనోవికృతేరత్రేరుక్తత్వాత్ । కుమారసంభవేరత్యాః కాదంబర్యాం మహాశ్వేతాయాః రఘువంశే అజస్య ప్రలాపే కరుణ ఏవరసః తత్రతత్రబాధ నిశ్చయే నేష్టజనవస్తుసమీహాయా అభావాత్ । యత్రచమృతఏవ జీవితాశా తత్రశృంగార ఏవరసః । బాధ సందేహస్య గ్రాహ్యాసందేహపర్యవసితతయా సమీహాయా అప్రతిబంధకత్వాత్.

లక్షణమునకు విప్రలంభమం దతివ్యాప్తి కలిగినదని చెప్పఁగూడదు. ఆశావిచ్ఛేద మైనప్పుడు కరుణమేగాని విప్రలంభము కాదు'' అని యున్నది. (1)

(2) రసార్ణవసుధాకరకారుఁడు—

"నాయికా నాయకులలో నొకరు మరణింపఁగా వారు తిరిగి వచ్చువఱకు రెండవవారుపొందుదుఃఖము కరుణమునఁజెల్లదు. ఏలన :—పునస్సంగమాశ దుఃఖముతోఁ గూడియున్నది గావున'' అని చెప్పి—

"అనమదనవధూరుపప్లవాంతం వ్యసనకృశా పరిపాలయాం బభూవ
శశిన ఇవదివాతనస్య రేఖా కిరణపరిక్షయధూసరా ప్రదోషమ్''

అను కుమారసంభవశ్లోకము నుదాహరించి దానికి—

"ఇచ్చట నాకాశవాణి పలుకునందలి నమ్మకముచేత రతికిఁ గృశత్వాదులచే ననుమితములైన గ్లాన్యాది వ్యభిచారిభావములచేత వృద్ధినొందిన సమయపరిపాలనాది రూపములైన యనుభావములచేత విప్రలంభము వ్యక్తమగుచున్నది'' అని వ్యాఖ్యానము చేసెను. (2)

హరకోపానలముచే భస్మమైన మన్మథునిగూర్చి రతి విలపించుచుండఁ బ్రియునితోఁ దనకుఁ బునస్సమాగమ మగునని యాకాశవాణి పలికిన పలుకును నమ్మి యా సమాగమము ప్రతీక్షించియున్న కాలములో రతి పొందిన శోకము విప్రలంభ మని దీని తాత్పర్యము. దీనినిబట్టికూడఁ బ్రత్యాశతోఁ గూడినప్పుడే శోకము విప్రలంభ మగునని సిద్ధించుచున్నది

(3) రసగంగాధరకారుఁడు—

కరుణవిప్రలంభముల స్వరూపములును వానికిఁ గలభేదమును జర్చించి "నాయికానాయకులలో నొకరు మృతినొంది రనుజ్ఞానము కలిగినప్పుడు రతిపోషిత మైనశోకము కరుణమే యగును. మరణజ్ఞాన మున్నను దేవతాప్రసాదాదులవలనఁ బునరుజ్జీవనము కలుగు ననుజ్ఞానము కలిగినచో నాలంబనమున కత్యంత నిరాసము లేమ

(1) శోకస్య పరిపోషః కరుణః। ఆశావిచ్ఛేదే సతి సర్వేంద్రియక్లమో వా। న చ విప్రలంభే౽తివ్యాప్తిః। తత్రేష్టాశాయాః సత్వాత్ తద్విచ్ఛేదే తు న విప్రలంభః కరుణ ఏవ॥

(2) ద్వయోరేకస్య మరణే పునస్సంజీవనావధౌ। విరహః కరుణో౽న్యస్స్యాత్సంగమాశానువర్తనాత్। అత్రాకాశ సరస్వతీప్రత్యయేన రతేర్విప్రలంభః కృశత్వాద్యనుమితైః గ్లాన్యాదిభిర్వ్యభిచారిభావైః పోషితస్సమయపరిపాలనాదిరూపైరనుభావైర్వ్యజ్యతే॥

గానఁ జిరప్రవాసమందువలె రసము విప్రలంభమే కాని కరుణము కాదని చెప్పెను. (1)

ఇదియు విప్రలంభమందు శోకానుభవకాలమునఁ బ్రత్యాశ యుండవలయు ననువాదమును బలపఱుచుచున్నది.

(4) సాహిత్యదర్పణమునందు—

“నాయికానాయకులలో నొకరు లోకాంతరగతులై తిరిగి లభింపఁదగినవా రగుచుండ వారికై రెండవవారు దుఃఖించినచో నది కరుణవిప్రలంభ మనిపించు కొనును. కాదంబరిలోఁ బుండరీకమహాశ్వేతావృత్తాంత మిందునకు దృష్టాంతము. మృతినొందినవాఁడు తిరిగి లభ్యుఁడు కాక పోయినను శరీరాంతరముచేత లభ్యుఁడైనను గరుణరసమే.” అని గ్రంథకర్త స్వమతమును దెలిపి (2)

“ఆకాశవాణి పలికినపిదప సంగమప్రత్యాశచేత రతి పుట్టినందున నా యాకాశవాణీభాషణాంతరమును శృంగారమనియుఁ దత్పూర్వానుభూతరసము కరుణ మనియుఁ గోవిదులు తలంతురు.” అని మతాంతరమును సూచించెను. (3)

(5) రసచంద్రికాకారుఁడు—

“సప్రత్యాశో విప్రలంభో నిష్ప్రత్యాశః కరుణః” అనుకారిక నుదాహరించి జీవననిశ్చయము కలిగినపుడు దానివలన భావిసంభోగరూపమైన యిష్టసాధనతాజ్ఞానమును దదధీనమైన యిష్టసంగమసమీహయుఁ గలుగును గావున నది విప్రలంభమగుననియు, జీవనాభావనిశ్చయము కలిగినప్పుడట్టి సమీహ కలుగుట కవకాశ ముండదు. కావున, నది కరుణరసమగుననియు, వివరించి నిశ్చయజ్ఞానము లేక జీవితసందేహమున్నచో రతిశోకములు రెండింటికిఁ బ్రాధాన్యముండును. గావున నా

---

(1) మృతత్వజ్ఞానదశాయాం తు రతిపోషితస్య వైక్లబ్యస్యేతి కరుణ ఏవ। యదా తు సత్యపి మృతత్వజ్ఞానే దేవతాప్రసాదాదినా పునరుజ్జీవనజ్ఞానం కథంచిత్స్యాత్। తదాలంబనస్యాత్యంతిక నిరాసాభావాచ్చిరప్రవాస ఇవ విప్రలంభ ఏవ న కరుణః॥

(2) యూనోరేకతరస్మిన్ గతవతి లోకాంతరం పునర్లభ్యే। విమనాయతే యదేకస్తదా భవేత్కరుణ విప్రలంభాఖ్యః। యదా కాదంబర్యాం పుండరీక మహాశ్వేతావృత్తాంతే। పునరలభ్యే శరీరాంతరేణ వా లభ్యే తు కరుణాఖ్య ఏవ రసః॥

(3) కిందాత్రాకాశసరస్వతీభాషణాంతరమేవ శృంగారః। సంగమప్రత్యాశయా రతేరుద్భవాత్ ప్రథమం తు కరుణ ఏవ ఇత్యభియుక్తా మన్యన్తే॥

రసము కరుణముకంటెను విప్రలంభముకంటెను విలక్షణమైనకరుణవిప్రలంభమగు” నని నిర్ణయించెను. (1)

ఈకరుణవిప్రలంభలక్షణమునకును పూర్వోదాహృత తద్రసలక్షణములకును గొంత భేద మగపడుచున్నది. ఈలక్షణముచేతనైనను ప్రత్యాశారూపకమైన రతి లేనిదే కరుణవిప్రలంభము పుట్టనేరదు. ఈ ప్రమాణములంబట్టి చూడఁ బ్రత్యాశా సహితమైన శోకము విప్రలంభమనియుఁ బ్రత్యాశారహితమైన శోకము కేవల కరుణ మనియుఁ దేలుచున్నది. ప్రియుఁడు లోకాంతరగతుఁడగుటచేఁ గలిగిన విప్రలంభ మందుఁ బ్రవాసాదిజన్య విప్రలంభముకంటె శోకమధికముగా నుండును గావున దానికిఁ గరుణ విప్రలంభమని పేరు పెట్టిరి. దీనియందును రతియే స్థాయి యని పూర్వాలాక్షణికమతము. రసచంద్రికనుబట్టిమాత్రము కరుణమును రతియు రెండును స్థాయులే. ఎట్లయినను రతి యుండకతప్పదు.

ఇచ్చట రతియనఁగాఁ బునస్సమాగమాభిలాషా రూపకము. విశిష్టవస్తుప్రీతి కేవల కరుణమందును గలదు గావున నా ప్రీతియే విప్రలంభమందు స్థాయియైన రతి యనఁగూడదు. ఒక్కశోకమే యనుభూతమైనచోఁ గరుణమగును. ఒక్కరతియే యనుభూతమైనచో సంభోగశృంగార మగును. ఉభయస్థాయిసమ్మేళనముచే నీ రసములు రెండింటికంటెను విలక్షణమైన శోకరసము పుట్టును.

బెల్లముపెట్టి వండిన చేఁదుపొట్లకాయకూర కేవలము చేఁదును గాక కేవలము తీపియుగాక యీ రెండురుచులకంటె విలక్షణమైన యింకొకరుచి కలిగియుండును. బెల్లముపెట్టక వండిన చేఁదుపొట్లకాయ కూర తిని, పిదప బెల్లము తిన్నచోఁగూడ కేవలము చేఁదును, బెల్లము కేవలము మధురము నగును. దేనిరుచి దానిదే, రెండును ప్రధానములే, కాని, యొకదాని కొకటి యంగము కానేరదు.

స్వప్నములో నేదో గొప్పవిపత్తు తటస్థించినట్లు తోఁచి యుత్కటమైన దుఃఖము కలుగును. మేల్కొనిన పిదప నదియంతయు మిథ్యయని తెలిసి సంతోషము కలుగును. అయినను స్వప్నకాలమం దనుభవించినది కేవలము శోకమే. తరువాతఁ గలిగిన సంతోషమువలన దానికి మార్పేమియుఁ గలుగదు.

అట్లే దూరదేశమున కేగిన ప్రియుఁడు మృతినొందినట్లు మిథ్యావృత్తాంతము తెలిసి ప్రేయసి విలపించుచుండఁగా నా ప్రియుఁడు వచ్చి ప్రేయసినిగూడినను బూ

---

(1) విప్రలంభే జీవననిశ్చయేన భావిసంభోగ రూపేష్ట సాధనతాజ్ఞానసత్త్వా దధీనా తత్సమీహాను వర్తతే। కరుణేతు జీవనాభావనిశ్చయేన భావిసంభోగరూపేష్ట సాధనతాజ్ఞానా భావాత్తదధీనా తత్సమీహాని వర్తతే...యత్రతయోరన్యతరస్మిన్ జీవతి మృతేవా జీవితసందేహస్తత్రతదనినిగమనాపరశాణరతిశోకయోరు భయోరపిప్రాధాన్యా దుభయస్థాయికః కరుణవిప్రలంభాఖ్యోఽతిరిక్త ఏవరసః॥

ర్యానుభూతమైన శోకము శోకమేయగునుగదా. శోకానుభవకాలమందుఁ బ్రత్యాశయున్నచో శోకతీవ్రత తగ్గును. ప్రత్యాశలేనిచో శోక మతితీవ్రమగును. ఇదియే కరుణవిప్రలంభ శృంగారములకుఁ గలభేదము.

గ్రంథము సమగ్రముగాఁ జదివినచో రామునకు సీతాపునస్సమాగమ ప్రత్యాశ యెంతమాత్రము లేదని చెప్పకతప్పదు. సీత మృతినొందినదని నిశ్చయజ్ఞానము లేకపోయినను దృఢప్రత్యయముమాత్రము రామునకుఁ గలదని స్థాలీపులాకన్యాయముగా నీ క్రింద సూచింపఁబడు భాగములచే స్పష్టమగుచున్నది.

ప్రథమాంకమందు ౪౫. ౪౯ పద్యములు.

ద్వితీయాంకమందు ౨౯ వ పద్యము.

తృతీయాంకమందు ౨౬, ౩౩, ౪౪, ౪౫, ౪౬ పద్యములు.

షష్ఠాంకమందు ౩౫వ పద్యము.

రామునకేకాక సుమంత్రుఁడు, జనకుఁడు, కౌసల్య మొదలగువారికిఁగూడ నీ దృఢప్రత్యయమున్నట్లు గ్రంథమం దచ్చటచ్చటఁ గానవచ్చుచున్నది. ఇట్టి స్థితిలో రామునకుఁ బ్రత్యాశయుండుట కవకాశములేదుగదా.

సీత జీవించియున్నదను నమ్మకము రామునకున్నదని మాటవరుస కొప్పుకొన్నను, నిర్దోషియని యెఱిఁగియుండియు, నామె తనకుఁ బ్రాణసమానయయినను, జనాపవాదము కలిగినదను కారణముచే జనానురంజనమే ప్రధానముచేసికొని విడిచిపెట్టిన రాముఁడు, తిరిగి యామెను దెచ్చుకొనఁ దలంపఁడుగదా. అట్టి తలంపేమాత్రమున్న నతఁడు రాముఁడే కాకపోవలసి వచ్చును. ఉన్నదని చెప్పుట నిరాధారము.

నాటకము శుభాంతముగా నుండవలయునని చిట్టచివర నాయికానాయక పునస్సమాగమము కవి కల్పించెను. ఈ సమాగమము వాల్మీకిమహర్షి తన లోకోత్తరతపః ప్రభావముచే మర్త్యామర్త్యభూతగ్రామమునంత నొక్కచోఁగూర్చ నా భూతగ్రామము సీత పవిత్రురాలని యేకగ్రీవముగా నంగీకరించుటచే, సీతను తిరిగి పరిగ్రహింపుమని యరుంధతి యాజ్ఞాపింపఁగా రాముఁడు గురువచనమును శిరసావహించుటచేత నయినది. అట్లు జరుగునని కలలోనయిన రాముఁ డనుకొని యుండఁడు. కావున నిది ప్రత్యాశావిషయము కానేరదు. పునస్సమాగమ జనితరసము కేవలశృంగారమే. తత్పూర్వరసము కేవల కరుణమే. రెండును జేరి విప్రలంభ శృంగార మయినదనరాదు. నాటకమునకు శృంగార, వీరరసములు రెంటిలో నేదో

యొకటి యంగిగా నుండవలయునని నాటకలక్షణము కావున ఏ నాటకమందుఁ గరుణ మంగియగుట పొసఁగదని యింకొకవాదము. „శృంగారము గాని వీరము గాని యొకటే అంగిగా నుండవలయును. తక్కిన రసములన్నియు నంగములుగా నుండవచ్చును. నిర్వహణమం దద్భుతముండవలయు” నని సాహిత్యదర్పణము. (1) దీనికి టీక యిట్లున్నది—

ఉత్కర్షాధానము నిమిత్త మొక్కరసమునే యంగిని చేయువలయునని (దీని) యర్థము. శృంగారముగాని వీరముగాని యని యీ రసములఁ జేర్కొనుట సముచితరససూచకము. దీనివలన నుత్తరరామ చరితమందు కరుణమునకును, ప్రబోధ చంద్రోదయమందు శాంతమునకు నంగిత్వ మవ్యాహతము కావుననే ధ్వనికారుడు.

ప్రబంధమున కుత్కర్షము కలిగించుటకై ప్రసిద్ధమగు నానారసనిబంధనములో నేదోయొకరసము నంగిగాఁ జేయవలయు” నని చెప్పెను. (1)

ఈ టీకావాక్యముచేత నీయాక్షేపము ప్రతిహతమైనది. భవభూతి వీరరస ప్రధానముగా మహావీరచరిత్రము, శృంగారరసప్రధానముగా మాలతీమాధవమును రచించి కరుణరసప్రధానముగా నీయుత్తరరామచరిత నాటకము రచించిన ట్లగపడుచున్నది. నాటకము సుఖాంతముగా నుండవలయు నను నూహతోఁ జివర సీతారాముల పునస్సమాగమ మమర్చెను. ఆ యతుకు కతుకుగానే యున్నది గాని యేకాన్వయమగునట్లు పూర్వకథతోఁ గలిసిపోలేదు. మృతినొందిన భార్యకుఁ బ్రతికృతి చేయించి యదియే సహధర్మచారిణిగా యజ్ఞ మొనరించుట ధర్మశాస్త్రవిరుద్ధము కావున సువర్ణవికారమగు సీతాప్రతికృతితో నశ్వమేధము చేయఁ బూనిన రామునకు సీతాజీవితత్వనిశ్చయ మున్నదనక తప్పదని వేఱొకవాదము. దీనికిఁ బ్రమాణముగా—„యస్యభార్యా విదూరస్థా, పతితా దూషితాపివా అనిచ్ఛా ప్రతికూలావా, తస్య ప్రతికృతౌ క్రియా” అను శ్లోక ముదాహరింపఁబడినది. సీత జీవించి యున్నదనుకొన్నను, ఈ ధర్మశాస్త్రవాక్యమున కిచ్చటఁ బ్రవృత్తి యెట్లో విప్రలంభవాదులు చెప్పవలసియున్నది. „విదూరస్థా” యను పదములోఁ బతివల

(1) ఏకఏవభవేదంగీ శృంగారో వీర ఏవవా । అంగమన్యే రసాః సర్వేకార్యో నిర్వహణేద్భుతః॥

(1) ఉత్కర్షాధానాయ ఏకఏవరసోంగిత్వేన నివేశయితవ్య ఇత్యర్థః । శృంగారోవీరో వేతికథనం సముచిత రససూచకం । తేనోత్తరరామచరితే కరుణస్య ప్రబోధచంద్రోదయే శాంతస్య చాంగిత్వ మవ్యాహతం॥

అతఏవోక్తం ధ్వనికృతా—

ప్రసిద్ధేపి ప్రబంధానాం నానారసనిబంధనే । ఏకోరసోంగీకర్తవ్య స్తేషా ముత్కర్ష మిచ్ఛతా ఇతి—

యనుగాని సీత మఱియొకపద్దులోఁ జేరుట కవకాశము లేదుగదా! ఈపట్టున విదూరగ స్సనఁగా యజ్ఞకాలమునకు వచ్చుటకు సాధ్యముకానంత దూరమందున్నదని చెప్పఁబడియును. సీత యంతదూరములో నున్నదా? లేదు. వాల్మీకి తపోవనసమీపమందుఁగదా లక్ష్మణుఁ డామెను విడిచినది అది యయోధ్య కత్యంతదూరము కాదు. ఏమాత్రము ప్రయత్నముచేసినను యజ్ఞమున కామెను రప్పించుట కవకాశమున్నది. అట్టి ప్రయత్నమే జరుగలేదు. ఇదియుఁగాక, నాటకమునుబట్టి యజ్ఞసంకల్పకాలమందు సీత రసాతలమం దున్నది. రసాతలమందున్నను విదూరగయే యందురా? అట్లయిన మృతినొందిన దానినిగూడ విదూరగగా నేలయెంచరాదు? సీతా జీవితత్త్వమందు రామునకు నిశ్చయజ్ఞాన మారోపించుట కాధారము లేమియు లేవు. బంగారు సీతతో నశ్వమేధముచేయుట వాల్మీకి రామాయణమందే యున్నది. రామాయణమం దున్నదానినే గ్రహించి భవభూతి దానికి మెఱుఁగు పెట్టెను. సీత నష్టమయినదని యెంచియు నామెబొమ్మనే పెట్టికొని యశ్వమేధముచేయఁ బూనుట రామునకు సీతయందుఁగల ప్రీతి కుత్కర్షము కలిగించుచున్నది. దీనిని పెద్దగుణముగా గ్రహింపవలసియుండఁగా [ధర్మశాస్త్రదృష్టిచే దోషమని వాదించు వాదము సరసమైన వాదము కాదు.

ఏవిధమునఁ జూచినను సీతా పునస్సమాగమ విషయములో రామునకు సమీహాగాని ప్రత్యాశగాని యున్నదనుట కాధార మేమియు లేదు. కావున నీ నాటకమందు ప్రధానరసము కరుణమే యని సిద్ధాంతము.

ముక్త్యేశ్వరము
సెప్టెంబరు 1931

జయంతి రామయ్య.

---

ఉత్తరరామచరిత్ర మూలమునందు పాఠభేదము లచ్చటచ్చటఁ గలవు. నేను బహుళముగా వీరరాఘవాచార్యవ్యాఖ్యానసమ్మతపాఠమునే * యవలంబించినాఁడను. కొన్నిచోటుల మాత్రము పాఠాంతరముల గ్రహించితిని వానిలో ముఖ్యమైన వాని నీ క్రింద నుదాహరించుచున్నాఁడను.

1. ద్వితీయాంకము 28 వ పద్యము మూఁడవ పాదములో "వంజుల లతాని" యను పాఠము గ్రహింపఁబడినది.

---

* బొంబాయి నిర్ణయసాగరముద్రాక్షరశాలా ప్రతి.

2. చతుర్థాంకము 22 వ పద్యము తరువాత కౌసల్యావాక్యములో "కుతో ముఖం విమలతే" యను పాఠ మంగీకరింపఁబడినది.

3. పంచమాంకము 6 వ పద్యము మూఁడవ పాదములో "ఖండ"ను బదులుగా "ముండ" యను పాఠమును, నాల్గవపాదములో "తృష్యత్"ను బదులుగా "తృప్యత్" అను పాఠమును గ్రహింపఁబడినవి.

4. షష్ఠాంకము 4 వ పద్యము పిదప విద్యాధరీ వాక్యములో "విమలముక్తాసర శీతల", "ఆనందమంద ముకుళితలోచనయా" అను పాఠములు గ్రహింపఁబడినవి.

5. ఆయంకమందే 24 వ పద్యము మూఁడవ పాదములో "రత్నాంరశ్మయస్తే మనోజ్ఞాః" అను పాఠము గ్రహింపఁబడినది.

6. ఆయంకమందే 34 వ పద్యమున నుత్తరార్థమందు "సుస్వరః" యను పాఠమును, 35 వ పద్యాదియందు "తదా" యను పాఠమును గ్రహింపఁబడినవి.

7. సప్తమాంకములోని 24 వ మూలశ్లోకము ప్రక్షిప్తముగా విడువఁబడినది.

జ. రా.

# కృతిసమర్పణము.

చరితముచేత ధర్మముల సర్వజనాళికి బోధసేయ భా
స్కర కులమందు రామనృప చంద్రముఁడై యవతారమొంది ని
ర్భర కృప ధాత్రిఁ బ్రోచిన పరాత్పరుదివ్యచరిత్రమందు ను
త్తరచరితంబు రూపకముఁ దత్పద సన్నిధిఁ జేర్చి మ్రొక్కెదన్.

# అవతారిక.

శ్రీవాణీ ధరణీధరేంద్ర తనయా స్త్రీరత్నముల్ నిత్యమున్
శ్రీవక్షోముఖ వామభాగముల సంసేవింప శ్రీ పుంస యో
గావిర్భూత సమస్తలోక సముదాయాధారులై యొప్పు నా
శ్రీవత్సాంక హిరణ్యగర్భగిరిశుల్ ప్రేమన్ మమున్ బ్రోవుతన్॥౧॥

పుట్టను బుట్టినట్టి మునిపుంగవుఁ డాదిగ సంస్కృతంబునన్
బట్టపురాణిగా వలచివచ్చిన భారతి నేలి నాతనిన్
దొట్టి తెనుంగునందుఁ గల దొడ్డకవీంద్రుల నెల్ల పారమున్
ముట్టిన భక్తితో ముతను మ్రొక్కి నుతించెద మాటిమాటికిన్॥ ౨॥

ఉత్తమకవిభవభూతికృ
తోత్తమకృతి యిదియనంగ నొప్పెడు శ్రీరా
మోత్తరచరితము రసికుల
చిత్తంబుల కెక్కఁ దెలుఁగుసేయఁ దరంబే॥ ౩॥

పలువు రింతకుఁ బూర్వమే తెలుఁగు చేసి
నట్టి దీనిని మఱలఁ జేయంగ నేల
యనిన నయ్యది కావ్యంపు గుణగణంబు
తప్పి యుగుఁగాని యరయ నా తప్పుగాదు॥ ౪॥

ఎందఱు చెప్పిన మది కా
నందము కావించునది గుణంబకద గుణం
బెందుఁగల దెందు లేదను
సందేహము మాన్పువారు సరసులె కాదే॥ ౫॥

శబ్దము లకంటె నర్థముల్ సమధికంబు
లర్థములకంటె భావంబు లధిక మరయ
భావకలనచేఁ బ్రభవించు భవ్యరసము
రసము కృతులకు జీవమై యెసఁగుఁగాన ॥ ౬॥

దీటుగ సంస్కృతంబునకుఁ దెల్గొనరించెడు వారు మూలమున్
దాఁటక భావమున్ రసము తప్పక వచ్చెడునట్లు లెంతయున్
దేటగ వేఱుమాటలను దెప్పినఁ బొల్పగుఁ గాక యెట్టులో
మాటకు మాట పెట్టి యొకమాడ్కిని మాటన మెత్తురే బుధుల్ ॥ ౭॥

పలుకుబడి వేఱు పదపరిపాటి వేఱు
రీతులును వేఱ యన్వయ రీతి వేఱు
భాషభాషకు ననుమాట భావమందుఁ
జేర్చి సంస్కృతమును దెల్గు సేయవలయు ॥ ౮॥

తెలుఁగుననె పుట్టె నీకృతి
తొలుత ననెడుభావ మాత్మఁ దోఁచెడు భంగిన్
జెలఁగిన యనువాదము సర
సుల కింపౌఁ గాకయున్న శోభింప దిలన్ ॥ ౯॥

నేఁటివారు మెచ్చకయున్న నేటికొఱఁత
పుట్టకుండునె నాబోటి పురుషుఁ డొకఁడు
నేల విపులంబు కడ లేదు కాలమునకు
ననియె భవభూతి మాబోఁటు లనఁగఁ దగదు ॥ ౧౦॥

నీరసమైన కావ్యమును నిండ రసావహ మౌను గోవిదుల్
కూరిమితోడఁ జూడ నలకూరిమి తప్పిన మంచికావ్యమున్
నీరసమౌ విమర్శకులస్నేహము కల్మియ కావ్యకర్తకున్
నేరుపుగాక వేఱెయొక నేరుపు గల్గుట చెప్పనొప్పునే ॥ ౧౧॥

# పాత్రలు.

## పురుషులు.

| | | |
|---|---|---|
| రాముఁడు | ... | కథానాయకుఁడు, కోసలాధిపతి. |
| లక్ష్మణుఁడు | ... | రాముని తమ్ముఁడు. |
| కుశుఁడు<br>లవుఁడు | ... | రాముని కొడుకులు. కవలు. |
| చంద్రకేతువు | ... | లక్ష్మణుని కొడుకు. |
| జనకుఁడు | ... | సీత తండ్రి : మిథిలాధిపతి. |
| వాల్మీకి | ... | మహర్షి. రామాయణకర్త. |
| అష్టావక్రుఁడు | ... | ముని. |
| దండాయనుఁడు<br>సౌధాతకి | ... | వాల్మీకి శిష్యులు. |
| శంబూకుఁడు | ... | శూద్రముని. |
| సుమంత్రుఁడు | ... | లక్ష్మణుని సారథి. |
| దుర్ముఖుఁడు | ... | శుద్ధాంతచారి. |
| ప్రతీహారి | ... | |
| కంచుకి | ... | |
| విద్యాధరుఁడు | ... | |

## స్త్రీలు.

| | | |
|---|---|---|
| సీత | ... | కథానాయిక. రాముని భార్య. |
| కౌసల్య | ... | రాముని తల్లి. |
| అరుంధతి | ... | వసిష్ఠుని భార్య. |
| ఆత్రేయి | ... | తాపసి. |
| గంగ<br>భగీరథి<br>తమస<br>మురళ | ... | నదీదేవతలు. |
| వాసంతి | ... | వనదేవత. |
| పృథ్వి | ... | వసుంధర – సీత తల్లి. |
| విద్యాధరి | ... | |

శ్రీరస్తు.

# ఉత్తరరామచరితము.

## ప్రథమాంకము.

క. తొలుతటి కవివరులకు నం
జలి యిదె కావించి మ్రొక్కి శాశ్వతయును జి
త్కళయును నై యొప్పారెడు
నలవాగ్దేవతను భక్తి నాత్మఁ దలంతున్. ౧

(నాంద్యంతమందు)

సూత్రధారుఁడు—చాలు, అతివిస్తరము వలదు. భగవంతుఁడగు కాళప్రియానాథుని యుత్సవమునకు వచ్చియున్న పెద్దలకొకవిజ్ఞప్తి. పూజ్యులార! అవధరింపుఁడు. కాశ్యపగోత్రుండును, శ్రీకంఠపదలాంఛనుండును, బదవాక్యప్రమాణజ్ఞుండును, జతుకర్ణీపుత్రుండు నైనభవభూతిమహాకవిని మీ రెఱుంగుదురు గదా!

క. చిత్తభవాగ్రజునకుఁ బలెఁ
జిత్తములో మెలఁగుఁ బల్కుఁ జెలి యెవ్వనికా
యుత్తమకవి రచియించిన
యుత్తరరామచరితముఁ బ్రయోగింతు మిదే. ౨

ఇదిగో, కార్యవశమున నే నయోధ్యాపురవాసుఁడను, ఆనాఁటివాఁడను నయితిని. పౌలస్త్యకులధూమకేతు వైన శ్రీరామమహారాజు పట్టాభిషేకమహోత్సవము రేయింబవ ళ్లవిచ్ఛిన్ననాందీకముగా జరుగుచుండెనే, యిప్పుడు చత్వరములయందు భటసంచారము లే దేమి ?

నటుఁడు—(ప్రవేశించి) ఆర్యా! పట్టాభిషేకమునకు వచ్చి యింతదనుక సమారాధన మొందుచుండిన లంకాసమరసుహృదు లగు ప్లవంగరాక్షసులును, నానాదిగంతముల నుండి వచ్చిన బ్రహ్మర్షి రాజర్షులును మహారాజు వీడ్కొలుపఁ దమతమ నెలవుల కరిగిరి.

సూత్రధారుఁడు—ఇది యొక కారణమే.

నటుఁడు—ఇం కొకటి కూడఁ గలదు.

గీ. ఘనుఁడు మైత్రావరుణముని కదిసి రాఁగఁ
బుణ్యచరిత యరుంధతి ముందు నడవ
నల్లుసవనంబు వీక్షింప నరిగి రెల్ల
రాముతల్లులు దేవులు రమణతోడ. 3

సూత్రధారుఁడు—పరదేశిని గాన నడుగుచున్నాఁడను, అల్లుఁడన నెవ్వరు ?

నటుఁడు—

గీ. శాంత యనుకన్యఁ బడసి దశరథవిభుఁడు
కూర్మి రోమపాదున కిచ్చెఁ గూఁతురుగను. ౪

విభండకసుతుం డైన ఋశ్యశృంగుఁ డామెను బెండ్లియాడి యిప్పుడు ద్వాదశవార్షికయాగ మొకటి యారంభించెను. ఆకారణమున నిండుచూలా లైనను జానకిని విడిచిపెట్టి పెద్ద లక్కడ కేగిరి.

సూత్రధారుఁడు—మన కిది యంతయు నేల? నిజకులమర్యాదానుసారముగ రాజద్వారమునే సేవింతము రమ్ము.

నటుఁడు—అట్లయిన రాజుగారియొద్దఁ బఠించుటకై నిర్దోషమైన స్తోత్ర మొక్కటి రచింపుము.

సూత్రధారుఁడు—మారిషా!

గీ. తనకుఁ దోఁచిన భంగిని దగును బలుక
నింద లేదన్నమాట తా నెందుఁ గలదు?
వనితలయెడలను గవుల వాక్కు లందుఁ
దప్పులే లోక మెప్పుడుఁ దడవుచుండు. ౫

నటుఁడు—ఈ విషయములో జను లతిదుర్జను లనియే చెప్పఁ దగును.

గీ. అగ్నిశుద్ధి యందును నిశ్చయంబు లేక
రావణుని యింట నున్నమాత్రమున జనులు
దివ్యచారిత్ర యైన వైదేహియందు
లేనినిందను మోపఁగాఁ బూనరె, కట! ౬

సూత్రధారుఁడు—ఈ కింవదంతి మహారాజువఱకుఁ బ్రాఁకెనేని యనర్థము వాటిల్లనోపు.

నటుఁడు—ఋషులును దేవతలును సర్వవిధముల శ్రేయస్సునే సమకూర్తురు. (కొంచెము నడచి) ఇప్పుడు మహారా జెక్కడ ? (విన్న ట్లభినయించి) జను లి ట్లనుచున్నారు.

గీ. ఇన్ని దినములు ముదముతో నిచటఁ గడపి
జనకుఁడు మఱలి మిథిలకుఁ జనియె నిపుడె
దీన మైయున్న దేవిని దేర్చుకొఱకుఁ
గొలువు విడిచి నరపతి లోపలకు నరిగె. ౭

[అని యిద్దఱును వెడలిపోయిరి.]

ఇది ప్రస్తావన.

(సీతారాము లుపవిష్టులై ప్రవేశింతురు.)

రాముఁడు—దేవీ, వైదేహీ, యూఱడిల్లుము. వారు మనల విడిచి పోవఁగలరా ? కాని,

క. సతతానుష్ఠానపరులు
స్వతంత్ర తాహీను లబల భావింప గృహ
స్థత ప్రత్యవాయసహితం
బతిసంకట మెందు నాహితాగ్నుల కిలలోన్. ౮

సీత—ఎఱుఁగుదును, ఆర్యపుత్ర ! ఎఱుఁగుదును. అయినను బంధుజనవియోగము సంతాపకరము గదా !

రాముఁడు—సత్యమే. హృదయమర్మచ్ఛేదకము లగు సంసార భాగము లిట్టివే. కావుననే వీనికి రోసి ప్రాజ్ఞులు సర్వ కామముల విడిచి యరణ్యములందు విశ్రమింతురు.

కంచుకి—(ప్రవేశించి) రామభద్ర! (అని సగముమాట చెప్పి జంకి) మహారాజా!—

రాముఁడు—(చిఱునవ్వుతో) ఆర్య, నాయనగారి పరిజనులు నన్ను రామభద్ర యనుటయే బాగుగా నుండును. నీ కలవాటయినట్టులే పిలువుము.

కంచుకి—దేవ! ఋష్యశృంగాశ్రమమునుండి యష్టావక్రులు వచ్చియున్నారు.

సీత—ఆర్య! అట్లయినఁ గాలవిలంబ మేల?

రాముఁడు—త్వరగాఁ దోడ్కొని రమ్ము.

కంచుకి—చిత్తము (అని వెళ్లెను)

అష్టావక్రుఁడు—(ప్రవేశించి) మీ యిరువురకును శుభ మగుఁగాక.

రాముఁడు—ఆర్యా, అభివాదనము చేయుచున్నాఁడను. ఇచ్చటఁ గూర్చుండుఁడు.

సీత—ఆర్యా, నమస్కారము. అత్తగార్లకు నల్లునికిని బూజ్యురాలైన శాంతకును గుశలమా!

రాముఁడు—మా బావగారును, అక్కగారును జేయుచుండిన సోమయాగము నిర్విఘ్నముగా నెఱవేఱినదా?

సీత—మమ్ముఁ దలఁతురా?

అష్టావక్రుఁడు—(కూర్చుండి) తలఁపకేమి, కులగురువు లగు వసిష్ఠులు నీతో ని ట్లనుమనిరి.

గీ. "అనఘ విశ్వంభరాదేవి కనియె నిన్ను
ధాతృసముఁ డైన జనకుండు తండ్రి నీకు
భానుఁ డేమునుఁ గురువుల మైనయట్టి
యవనిపతులకుఁ గోడలవైతి వీవు. ౯

కావున వేఱె యాశీర్వదింపఁ దగిన దే మున్నది. వీరమాతవు కమ్ము"—అని.

రాముఁడు—అనుగ్రహపాత్రుల మైతిమి.

క. లౌకికసాధుజనంబుల
వాకులు వర్తించు నర్థపరిపాటిమెయిం
బ్రాకటముగ నర్థ మెపుడు
వాకులనే యనుసరించుఁ బరమర్షులకున్. ౧౦

అష్టావక్రుఁడు—ఈమెకు గర్భదౌహృదము లగు కోర్కులేవేవి కలిగినను వానిని దప్పక వెంటనే తీర్చుచుండవలయు నని పూజ్యురా లగు నరుంధతియు, దేవులును శాంతయు మఱిమఱి చెప్పుమనిరి.

రాముఁడు—ఈమె చెప్పిన దెల్లఁ జేయుచునే యున్నాఁడను.

అష్టావక్రుఁడు—ఋష్యశృంగుఁడు దేవితో ని ట్లనుమని చెప్పెను. "వత్సా! నిండుచూలాల వగుటచే ని న్నిచటకుఁ బిలిచికొని రాలేదు. నీ వినోదముకొఱకే రామభద్రునిఁ గూడ నక్కడనే యుంచినారము. నీవు పుత్త్రపూర్ణోత్సంగవుగా నుండఁగాఁ జూచెదము" అని.

రాముఁడు—(సంతోషము లజ్జ చిఱునవ్వును దోఁప) అట్లే యగుఁ గాక! వసిష్ఠులు నా కేమియు నాజ్ఞాపింప లేదా?

అష్టావక్రుఁడు—ఇదిగో వినుము.

గీ. యాగమువలన మే మిట నాఁగినాము
బాలుఁడవు నీవు రాజ్యంబు చాలఁ గ్రొత్త
ప్రజల నెప్పుడు సంతోషపఱుపు మద్ది
యశముఁ దెచ్చెడు నదియ మీ కధికధనము. ౧౧

రాముఁడు—వారి సెలవుప్రకారము చేయుదును—

క. లోకారాధనమునకై
శోకం బనుమాట లేక సుఖమును దయ న
స్తోకస్నేహము నైనను
జ్మాకాంతాతనయ నైనఁ జయ్యన విడుతున్. ౧౨

సీత—కావుననే కదా, ఆర్యపుత్రుఁడు రఘుకులధురంధరుఁ డనిపించుకొనుట—

రాముఁడు—ఎవఁడురా, అక్కడ! అష్టావక్రులు విశ్రమింతురు. తగిన యేర్పాటు చేయుము.

అష్టావక్రుఁడు—(లేచి ముందుకు నడచి) ఇదిగో లక్ష్మణకుమారుఁడు వచ్చినాఁడు (అని వెళ్లును)

లక్ష్మణుఁడు—(ప్రవేశించి) ఆర్యులకు జయ మగుఁ గాక. మనము చెప్పినప్రకార మర్జునుఁడు మీ చరితము నీపట మందుఁ జిత్రించి తెచ్చినాఁడు. చూడఁ దగును.

రాముఁడు—వత్సా! వ్యాకులచిత్తయై యున్న దేవికి వినో
దము కల్పించు మార్గము నీ వెఱుఁగుదువు. ఇది యెంత
వఱ కున్నది?

లక్ష్మణుఁడు—ఆర్యాహుతాశనశుద్ధివఱకు.

రాముఁడు—పాపము శాంతించునుగాక.

క. జననముచే శుచి యగు నీ
వనజాక్షికి వేఱె శుద్ధి వలయునె తలఁపన్!
జననుత తీర్థజలంబుల
ననలంబును శుద్ధిసేయునవియుం గలవే. ౧౩

దేవీ! దేవయజనసంభవ, చిత్తము కలఁగనీయకుము.
ఈ ప్రవాదము నీవు జీవించి యున్నంతవఱకు నుండునదే.

గీ. ఖేదపడెదు జనుల నాదరింపవలయు
నిన్ను నట్టు లనుట నీతిగాదు
తావి గలుగుపూలఁ దలయందుఁ దాల్పఁగాఁ
దగును గాని కాళ్లఁ దన్నఁ దగునె? ౧౪

సీత—కానిండు, ఆర్యపుత్త్ర మీచరితము చూతము రండు.
(అని లేచి నడచును)

లక్ష్మణుఁడు—ఇదిగో పటము.

సీత—(చక్కఁగాఁ జూచి) దగ్గఱ దగ్గఱగా నిలువఁబడి పైనుండి
యార్యపుత్త్రుని స్తుతించుచున్న వీ రెవరు?

లక్ష్మణుఁడు—దేవి, యివి పూర్వము భృశాశ్వుఁడు కౌశికున
కుపదేశించినట్టియుఁ, బిదపఁ దాటకావధావసరమునఁ

గాశికుఁ డార్యపుత్రునకుఁ బ్రసాదించినట్టియు సరహస్య జృంభకాస్త్రములు.

రాముఁడు—దేవి, యివి దివ్యాస్త్రములు. వీనికి వందనము చేయుము.

క. జగదుపకారంబునకై
యగణితతప మాచరించి యాత్మమహిమ నాఁ
దగునట్టి వీనిఁ గాంచిరి
దుగిణుఁడు మొదలైనయట్టి తొల్లిటిపెద్దల్. ౧౫

సీత—వీనికి నమస్కారము.

రాముఁడు—ఇవి తప్పక నీ గర్భమం దున్న సంతతిని బొందును.

సీత—అనుగ్రహమునకుఁ బాత్ర మైతిని.

లక్ష్మణుఁడు—ఇది మిథిలావృత్తాంతము.

సీత—ఓహో! వికసన్నవ నీలోత్పలశ్యామస్నిగ్ధ దేహసౌభాగ్యంబును మా తండ్రి వెఱగంది విలోకించుచుండ శిఖండముగ్ధమండనుండయి నిమేషంబులో లీలగా శంకరు విల్లుఁ ద్రుంచిన యార్యపుత్రుని జిత్రకారుఁడు చక్కగా లిఖంచినాఁడు.

లక్ష్మణుఁడు—ఆర్యా,

క. కులగురు వైనశతానం
దులతోడను నీదుతండ్రి తోరపుఁబూజల్

సలిపెడు నిద్దె వసిష్ఠయు
తుల్యైన వియ్యంకులకు వధూమణి కంటే. ౧౬

రాముఁడు——ఈ పొత్తు చక్కఁగా కుదిరినది.

క. కొనువాఁడు నిచ్చువాఁడును
ఘనుఁ డాకౌశికమునిపతి కావున నిపు డీ
జనకేక్ష్వాకుల వియ్యము
జనులకు నత్యంతమోదజనకము గాదే ? ౧౭

సీత——ఇదిగో, తత్కాలకృతగోదానమంగళు లగు మీ యన్నదమ్ములు నలువురును వివాహదీక్షితు లయి యున్నవారు. ఆహా ! యేమి, నే నిపు డాకాలమందు నాప్రదేశమందు నున్నట్లే యున్నది.

రాముఁడు——

చ. సదమలకంకణాప్తిఁ గడుఁ జక్కనహెచ్చఁగ మూర్తి [మంత మా
ముదమిది నాఁగఁబొల్పెసఁగి ముద్దులుగుల్కెడునీకరంబు నా
కెద యిగురింప గౌతముఁ డహీనకృపన్ దయచేసినట్టి యా
యద నిదె గాఁగఁ దోఁచెడు సుధాకరబింబనిభోజ్జ్వలాననా.

లక్ష్మణుఁడు——ఇది మీరు, ఇది యార్యురా లగు మాండవి, ఇది మఱదలు శ్రుతకీర్తి.

సీత——వత్సా ! ఇంకొకతె యున్న దీమె యెవ్వరు ?

లక్ష్మణుఁడు——(సిగ్గుపడి, చిఱునవ్వుతోఁ దనలోఁ దాను) వదినగా

యార్త్రిళనుగూర్చి యడుగుచున్నది, కానిమ్ము. తప్పించి వేఱొకచోటికిఁ దీసికొని పోయెదను. (పైకి) ఆర్యా! ఇది చూడఁ దగినపట్టు. ఈతఁడు భగవంతుఁ డగు భార్గవుఁడు.

సీత—(సంభ్రమముతో) నాకు వడఁకు పుట్టుచున్నది!

రాముఁడు—ఋషివర్యా! నీకు నమస్కారము.

లక్ష్మణుఁడు—అమ్మా, చూడుము. అన్నగారీయనను—(అని సగముమాట యన్నంత)

రాముఁడు—(ఆక్షేపపూర్వకముగా) ఓయీ! చూడఁ దగినది చాల నున్నది. మఱియొకటి చూపుము.

సీత—(ప్రీతియు గౌరవమును దోఁపఁ జక్కఁగాఁ జూచి) ఆర్యపుత్ర! ఈవినయమహత్త్వము మీ కెంతేనియు శోభఁ దెచ్చుచున్నది.

లక్ష్మణుఁడు—ఇదిగో మన మయోధ్య ప్రవేశించితిమి.

రాముఁడు—(కన్నీరు విడుచుచు) తలఁపునకు వచ్చినది. అక్కటా! తలపునకు వచ్చినది.

గీ. నాన్నగారు సజీవులై యున్నయప్పు
డమ్మ లిమ్ముగా సేమంబు నరయుచుండఁ
గ్రొత్తగా సారివచ్చిన కూర్తిసతులఁ
గలసి మనమున్న యాదినములు చనెఁ గట! ౧౯

ఈమె యప్పటి జానకి.

చ. లలి నొకసారి యాడి మరల న్విరళంబుగ నచ్చటచ్చటన్
మొలచుచునున్న లేఁతపలు మొగ్గలు మోమునకింపునింపఁగా
విలసితనైజవిభ్రమము వెన్నెలనిగ్గును మార్దవంబునుం
గలిగినయీమె మేనినవకంబు హరించె మదీయచిత్తమున్.

లక్ష్మణుఁడు—ఇది మంథరావృత్తాంతము.

రాముఁడు—(త్వరగా మఱియొకచోటు చూపుచు) దేవీ! వైదేహీ.

గీ. పూర్వ మాశృంగిబేరాఖ్యపురమునందు
స్నిగ్ధహృదయుఁడై యెంతయుఁ జెలఁగునట్టి
గుహునితో స్నేహ మెచ్చోటఁ గుదిరె మనకు
నట్టి యింగుదీపాదపం బదిగోఁ జూడు. ౨౧

లక్ష్మణుఁడు—(నవ్వుచుఁ దనలోఁ దాను) అన్నగారు మధ్య
మాంబా వృత్తాంతమును దాఁటించినారు.

సీత—ఓహో! ఇది జటాసంయమనవృత్తాంతము.

లక్ష్మణుఁడు—

గీ. వృద్ధులైనట్టి యిక్ష్వాకుపృథివిపతులు
తనయులకు రాజ్య మర్పించి తనివిఁజెంది
సలుపుచుండిన వనవాసస ద్వ్రతంబు
చిన్నతనమందె పూనె మాయన్నగారు. ౨౨

సీత—ఇది ప్రసన్నపుణ్య సలిలయగు పూజ్యభాగీరథి.

రాముఁడు—రఘుకులదేవతా! నీకు నమస్కారము.

చ. జనకుని యధ్వరాశ్వము రసాతల మంటిన దానిఁ దేరఁగాఁ
జని కపిలర్షి కోపమునఁ జచ్చిన తాతలకెల్ల సద్గతుల్

పొనరిచెఁగాదె పూనిక నపూర్వతపం బొనరంగఁ జేసి యో జననిరో నిన్నుఁదెచ్చి యలక్ష్మాతలభర్తభగీరథుం డహో! అట్టి యోతల్లిరో యరుంధతివలె నీవును నీకోడ లగు సీత కెల్లప్పుడు శుభములు కోరుదాన వగుము.

లక్ష్మణుఁడు—ఇది చిత్రకూటారణ్యమార్గమునఁ గాళిందీతీరమం దున్న శ్యామ మను మఱ్ఱిచెట్టు.

సీత—ఆర్యపుత్రున కీ ప్రదేశము తలఁపునకు వచ్చెనా!

రాముఁడు—దీనిని మఱచు టెట్లు.

చ. స్ఫురదరవిందనాళ మన సొంపు వహించి పథిశ్రమంబుచేఁ
గరముఁ గృశించినట్టి మృదుకాయము నెట్టులో యల్లనల్లనా
యురమునఁ జేర్చి యేను బిగు వొప్పఁ గవుంగిటఁ గూర్చి [యొత్తఁగాఁ
బరమసుఖాప్తి మైమఱచి బాలరో నీ విట నిద్రపోవవే.

లక్ష్మణుఁడు—ఇది వింధ్యారణ్యముఖమందు విరాధుఁడు మనల నడ్డగించినపట్టు.

సీత—ఇది యింతటితోఁ జాలును. ఇఁక నార్యపుత్రుఁడు తాళపత్రము నెండ కడ్డుగాఁ బట్టియుండ మనము దక్షిణారణ్యము ప్రవేశించిన పట్టు చూతము.

రాముఁడు—

గీ. ఇవియె వైఖానసాశ్రితవృక్షపంక్తి
గలతపోవనంబు లిచటఁ గలుగుమాని

బృందము నివరియన్నంబు ప్రీతితోడ
నతిథులకుఁ బెట్టి పూజించు నహరహంబు. 29

లక్ష్మణుఁడు—అంతరము లేకుండఁ జెట్లతో నిండియున్న కారు నీలియడవినడుమ నెడ తెగక వర్షించు మేఘమాలచే నలు పెక్కిన జనస్థానమధ్యమందు ధ్వనించెడు గోదావరీ ప్రవాహముతోఁ గూడియున్న కందరములు గల యీ పర్వతము పేరు ప్రస్రవణము.

రాముఁడు—

చ. స్థిరతరభక్తితో నితఁడు సేవ యొనర్చుచు నుండఁగా మనో
హరమగునిగ్గిరిన్ మనముహాయిగ నుండిన యాదినంబులున్
వరసరసాంబుపూర మగు పావనగౌతమియుం దదీయభా
స్వరతటభూముల న్మనము సల్పిన యవ్వియు సంస్మరించెదే?

మఱియు,

చ. అలికులవేణిరో యిచటహాయిగఁ జెక్కును జెక్కుఁగూడ బా
హువులువిడకుండనొక్కొకటియొత్తి పెనంగొనమెల్ల నవ్వియో
జిలిబిలివల్కుల న్మనము చిత్త మెలర్పఁగ నాఁడుచుండగాఁ
దొలఁగిన యామము ల్గదికిఁదోఁపకయే నిశిజాఱెనంతటన్.

లక్ష్మణుఁడు—ఇది శూర్పణఖావృత్తాంతము.

సీత—హా! ఆర్యపుత్ర! ఇంతవఱకే నీ దర్శనము.

రాముఁడు—వియోగత్రస్తురాలా! ఇది చిత్రము సుమీ.

సీత—ఎట్లయినఁ గానిండు దుర్జనుఁడు దుఃఖమునే కావించును గదా!

రాముఁడు—అక్కటా! జనస్థానవృత్తాంత మిప్పుడు జరగుచున్నట్లే పొడకట్టుచున్నది నాకు.

లక్ష్మణుఁడు—

చ. అలహరిణంబురూపమున నట్లు మిషం బచరించి క్రూరులై
కులిశము వ్రక్కలౌపగిదిఁ గొండలుసైతము నేడ్చునట్లు మి
మ్ములమరఁ జేసినట్టి కుటిలాసురవృత్తము నెల్లఁ బాపికోఁ
గలిగితి మైన నద్ది పొడగట్టినచో నెద వ్రక్కలయ్యెడున్.

సీత—(సబాష్పయై తనలోఁ దాను) అకటా! దినకరకులనందనుండు గూడ నాకారణమున నట్లు క్లేశపడెను గదా!

లక్ష్మణుఁడు—(రాముని బరికించి సాభిప్రాయముగా) ఆర్య! యిది యేమిటి?

గీ. సరము పెరుగ రాలు వరమౌక్తికములు నా
దొరలు నశ్రు లివ్వె ధరణి మీఁదఁ
గదలుచున్న నాసికాపుటాధరములు
బిగియఁ బట్టినట్టి వగపుఁ దెలుపు. ౨౯

రాముఁడు—వత్స!

గీ. ప్రియను బాసినదుఃఖంబు పెద్దదైన
శత్రు సాధించువాంఛచే సైచినాఁడ
మఱల దుఃఖాగ్ని యధికమై మండుచుండి
మెండు బాధించు నెదలోని పుండువోలె. ౩౦

సీత—అతిమాత్రభయావేగముచేత నే నిప్పు డార్యపుత్త్రుని బాసి యున్నట్లే తోఁచుచున్నది!

లక్ష్మణుఁడు—(తనలో) కానిమ్ము, కథ దాఁటించెదను. (చిత్రమును జూపి పైకి) ఇదిగో ఇది మన్వంతరమునాఁటివాఁడును, బూజ్యుఁడును, మనకుఁ బితృసమానుఁడు నగు జటాయువు విక్రమచరిత్రల యుదాహరణము.

సీత—హా! తండ్రీ! నీ యపత్యస్నేహము నిరతిశయముగదా!

రాముఁడు—హా! తండ్రీ! కశ్యపపుత్ర! పక్షిరాజ! నీ వంటి తీర్థభూతుఁడగు మహాత్ముఁడు మరల నెప్పుడు పుట్టునో కదా!

లక్ష్మణుఁడు—ఇది జనస్థానము పశ్చిమమునఁ గబంధరూపుఁడగు దను వాక్రమించుకొన్న కుంజవంత మను దండకారణ్యభాగము. దానిసమీపమం దున్న యిది మతంగాశ్రమపదము. ఈపె శ్రమణియను సిద్ధశబర తాపసి. అయ్యది పంపాపద్మసరస్సు.

సీత—ఇచ్చటనే కాఁబోలు నార్యపుత్త్రుఁడు ధైర్యామర్షములు లుజ్జగించి బిగ్గరగా నేడ్చినది.

రాముఁడు—దేవి, యీ సరస్సు మిగుల రమణీయ మైనది.

చ. మదకలహంసపక్షపవమానవిధూతవిలోలనాళికా
స్పదకమలాంతరంబు లయి భాసిలు కల్వలగుంపుసొంపు లిం
పొదవఁగఁ జేయఁ గన్నుఁగవ కుత్సవమైతగు నీకొలంకు సం
పద మును గంటి బాష్పజలపాతసముద్గమనాంతరంబులన్.

లక్ష్మణుఁడు—ఈతఁ డార్యచరితుఁ డగు హనుమంతుఁడు.

సీత—చిరకాలదుఃఖములో మునిఁగియున్న జీవలోకము నుద్ధరించి మహోపకారము గావించిన మహానుభావుఁ డీమారుతి.

రామడు—

గీ. ఎవని శౌర్యంబున మనము భువనములును
గంటి మిష్టార్థ సంసిద్ధి కలికి యట్టి
యంజనానందవర్ధనుం డైన బాహు
బలుఁడు వీని ఋణముఁ దీర్పఁ గలమె మనము? 32

సీత—వత్సా! ఇదిగో ఇచ్చటఁ బూచినకదంబవృక్షముల మీఁద నెమిళ్లు తాండవము సల్పు నీపర్వతమం దొకచెట్టు క్రిందఁ బ్రభావసౌభాగ్యావశిష్టుఁ డై యార్యపుత్త్రుఁడు మూర్ఛనొంద నేడ్చుచు నీవు పట్టుకొని యున్నట్లు వ్రాసి యున్నది. ఇది యేపర్వతము?

లక్ష్మణుఁడు—

ఉ. నీలము సిగ్గు నైన నవనీరద మగ్రము నంటి యున్న యీ
శైలముమాల్యవంతమను క్ష్మాధరరాజము చుమ్మియార్యుఁడీ
శైలమునందుఁ—

రాముడు—

జాలునిఁకఁ జాలు సహింపఁగఁజాలఁ గ్రొత్తయై
చాల దహించెడుర్ జనకజావిరహం బిపు డబ్బినట్టులర్. 33

లక్ష్మణుఁడు—ఇటుపై ని వచ్చునవి యార్యునియొక్కయు రాక్షసుల యొక్కయు నపరిమితోత్తరోత్త రాశ్చర్యకర్మలు.

ఆర్య యలసినట్లున్నది. విశ్రమించుట యుచిత మని నా మనవి.

సీత—ఆర్యపుత్ర! యీ చిత్రపటముం జూచుటచే నా కొక కోరిక పొడమినది. మనవి చేయుదునా?

రాముఁడు—అనతిమ్ము.

సీత—ఇంకొకసారి ప్రసన్నగంభీరము లగు నావనములందు విహరింపవలయు ననియుఁ బవిత్రనిర్మలశిశిరసలిల యగు భాగీరథియం దవగాహము చేయవలయు నని యీ వాంఛ పొడము చున్నది.

రాముఁడు—వత్సా! లక్ష్మణ!

లక్ష్మణుఁడు—ఏమి సెలవు?

రాముఁడు—ఈమె వాంఛల వెంటవెంటనే తీర్చుచుండవలయు నని పెద్ద లిప్పుడే సందేశ మంపియున్నారు. కాఁబట్టి కుదుపు లేకుండ సమముగా నడచునట్టి రథము సిద్ధము చేయింపుము.

సీత—ఆర్యపుత్ర, మీరుకూడ రావలయును.

రాముఁడు—అతికఠినహృదయురాలా! ఆమాట నీ వనవల యునా?

సీత—అట్లయిన నాకు మిక్కిలి సంతోషము.

లక్ష్మణుఁడు—మీ సెలవు ప్రకారము చేసెదను. (అని వెళ్లును)

రాముఁడు—ప్రియా! వాతాయనసమీపమునఁ గూర్చుం దము.

సీత—అట్లే కానిండు. అలసటచేత నిద్ర కూరుకొని వచ్చుచున్నది నాకు.

రాముఁడు—అట్లయిన నన్ను గట్టిగాఁ బట్టుకొమ్ము వెళ్లుదము.

క. కుముదాప్తుని కిరణంబులఁ
జెమరుచు శశికాంతసరము చెల్వున సభయ
శ్రమజలయుతమాసీకర
మమరుచు మీ కంఠమందు హాయిగ నాకున్. ౩౪

(అట్లు చేయించి యానందముతో) ప్రియురాలా! ఇదియేమి?

చ. ఇది ముదమో విషాదమొ ప్రవృద్ధవిమోహమొ కాక నిద్రయో
మదమొ విషంబొ సోఁకుడొ సమర్థుఁడఁగాను వినిశ్చయింపఁగా
ముదితరో నీదుస్పర్శమున మూర్ఛము లయ్యెడునింద్రియంబులుం
బదిలముగాక నెమ్మనము భ్రాంతము మూర్ఛము నయ్యె నెంతయున్. ౩౫

సీత—నాయందు మీరు స్థిరప్రసాదులై యుండఁగా నిం దాశ్చర్యమే మున్నది?

రాముఁడు—దేవీ!

క. వాడిన జీవలతాంతము
పోఁడిమి చెడకుండ మరలఁ బొల్పొందఁగ నీ
వాడిన చల్లని పలుకులు
చూడఁగ సుధ యయ్యె మదికి శ్రోత్రంబులకున్. ౩౬

సీత—ప్రియవాదీ! పరుండెదను. (అని ఇటునటు జూచును.

రాముఁడు—ఏమిటి వెదకుచున్నదానవు?

గీ. పెండ్లి యాదిగా గృహమందు విపినమందు
బాల్యమందు వయసునందు బాల నీక
స్వాపహేతు వై తగు రామబాహు విప్పుడుఁ
గూడ నీ కుపధాన మై కుదురుఁగాత. ౩౨

సీత—(నిద్ర నభినయించును) ఔను నిజమే. ఆర్యపుత్ర!
(అనుచు నిద్రపోయెను)

రాముఁడు—ఏమీ! ప్రియవచనములు పలుకుచునే నా యెదపై నిద్రపోయినది! (పరికించి)

గీ. చందనం బయ్యె మేనికి స్పర్శ మహహ
కరము ముత్యాలసర మయ్యెఁ గంఠమునకు
రూపు సుధ యయ్యెఁ గంటికి నీపె దెద్ది
ప్రియముగా దొక్క విరహంబు వెగటు గాక. ౩౪

ప్రతీహారి—(ప్రవేశించి) దేవా! ఇదె వచ్చెను.

రాముఁడు—ఓరీ! యెవరు?

ప్రతీహారి—దేవరయాసన్నపరిచారకుఁ డైన దుర్ముఖుఁడు.

రాముఁడు—(తనలోఁ దాను) పట్టణములందుఁ బల్లెలందును గూఢముగా సంచరించుటకై శుద్ధాంతచారి యైన దుర్ముఖుని బంపియుంటిని. (పైకి) రానిమ్ము.

ప్రతీహారి—(వెళ్ళిపోయెను)

దుర్ముఖుఁడు—(ప్రవేశించి తనలోఁ దాను) అయ్యో, దేవినిగూర్చి యిట్టి తలఁపరాని జనాపవాదమును దేవర కెట్లు తెల్పుదును? అయినను మందభాగ్యుఁడ నయిన నాకిది తప్పని పనిగదా!

సీత—(పలవరించుచు) ఆర్యపుత్ర! ఎక్కడ నున్నాఁడవు?

రాముఁడు—చిత్రదర్శనమువలనఁ గలిగిన యావిరహాభావనయే కలలో నగపడి దేవి కుద్వేగము గలిగించుచున్నది. (ప్రీతిపూర్వకముగా నాపె శరీరము నిమురుచు)

సీ. సర్వకాలములందు సౌఖ్యంబు దుఃఖంబు
నుభయుల కేకమై యొప్పు నెందు
నాయాసపడినట్టి యంతరంగమునకు
విశ్రాంతి మొందు గావించు నెద్ది
ముసలిప్రాయము నందు రస మొకించుక యైన
వెలితి గాకుండఁగా వెలయు నెద్ది
పరిణయం బాదిగా మరణంబుదాఁకను
దద్దయు నానాఁటఁ బెద్ద యగుచుఁ
దేజరిల్లెడు వల పను తేనెయందుఁ
బండు వోలెను భద్రమై యుండు నెద్ది
యట్టి యనుకూలదాంపత్య మహరహంబు
పుడమిలోపలఁ బడిల మై పొదలుఁగాత! 35

దుర్ముఖుఁడు—(సమీపించి) దేవరకు జయ మగుంగాక!

రాముఁడు—నీవు తెలిసికొనివచ్చినది యెఱుఁగఁ జెప్పుము.

దుర్ముఖుఁడు—రామదేవుఁడు, మమ్ము, దశరథమహారాజును మఱచునట్లు చేసె నని పౌరులును జానపదులును దేవర వారిని స్తుతించుచున్నారు.

రాముఁడు—ఇది యర్థవాదములే, దోష మేమైన నున్నఁ దెలుపుము, సవరించుకొందును.

దుర్ముఖుఁడు—(కన్నీరు క్రమ్మఁగా) మహారాజా! అవధరింపుఁడు. (చెవిలో) ఇట్లు.

రాముఁడు—హా! యీవాగ్వజ్ర మతితీవ్రము! (అని మూర్ఛిల్లును)

దుర్ముఖుఁడు—దేవా! ఊఱడిల్లుఁడు.

రాముఁడు—(ఊరడిల్లి)

గీ. వనిత పరగృహమం దుండె ననెడునింద
యుద్భతోపాయములచేత నణఁపఁబడియు
విధివశంబున వెండియు వెఱ్ఱికుక్క
విషమువోలె నంతటను వ్యాపించె నకట! ౪౦

మందభాగ్యుఁడ నయిన నే నిప్పుడేమి చేయుదును? (విమర్శించి దుఃఖముతో) మఱే మున్నది?

క. లోకారాధనమునకే
యేకార్య మయిన నొనర్తు రెప్పుడు సుజనుల్
లోకప్రీతికిఁ గాదే
చేకొని మాతండ్రి విడిచె జీవము నన్నున్. ౪౧

ఇప్పుడే కదా పూజ్యుఁడగు వసిష్ఠుఁడు కూడ సందేశము పంపెను. ఇంతియ గాక,

చ. అలఘుతరార్కవంశకలశాబ్ధిశశాంకులు సర్వలోక పూ
జ్యులు నగు పార్థివుల్ తమ విశుద్ధచరిత్రముచేతఁ బండు వె
న్నెలగతి లోక మెల్లెడల నింపిన తోరపుఁగీర్తి కియ్యెడం
గలుష మొకింత నావలనఁ గల్గినచో నిఁక నన్నుఁ గాల్పనే.

హా! దేవి, దేవయజనసంభవా! హా! స్వజన్మానుగ్రహ పవిత్రిత వసుంధరా! హా! మునిజనకనందినీ! హా! పావక వసిష్ఠారుంధతీప్రశస్తశీలశాలినీ! హా! రామమయజీవితా! హా! మహారణ్యావాస ప్రియసఖి! హా! తాతప్రియా! మితవాదిని! ఇట్టి నీకీ దురవస్థ యెట్లు వాటిల్లెను?

గీ. నీకతంబునఁ బుణ్యులై నెగడునట్టి
ప్రజలు నీపట్ల నిప్పుడు పాపులైరి
దిక్కు లేనివారికి నెల్ల దిక్కు నీవ
నీకు నేఁ డక్కటా దిక్కు లేకపోయె. 43

(దుర్ముఖునితో) దుర్ముఖా! మాఱిపోయిన రామారాజ్ఞా పించుచున్నాఁడు (చెవిలో) ఇట్లని లక్ష్మణునితోఁ జెప్పుము.

దుర్ముఖుఁడు—హా! అగ్నిపరిశుద్ధురాలును గర్భస్థసంతానయు నగు దేవివిషయములో దుర్జనవచనమును బాటించి దేవర యిట్టి నిశ్చయ మెట్లు చేసితిరో గదా!

రాముఁడు—అట్లనఁ దగదు. పౌరులును జానపదులును దుర్జను లెట్లగుదురు?

గీ. ప్రజల కిష్టమే యిక్ష్వాకువంశ మన్నఁ
బుట్టి నొకవాడు దైవంబు చెట్టవలన
మానె నదియు సద్భుతశుద్ధిమహిమవలన
దూరవృత్త మాటను నమ్మ రేరు దాని. ౪౪

ఇఁకఁ బొమ్ము.

దుర్ముఖుఁడు—హా దేవి! (అని పోయెను)

రాముఁడు—అక్కటా! అతిబీభత్సకర్మ చేయఁ బూనినాఁడను. ఎంత క్రూరుఁడను!

గీ. పిన్ననాఁటనుండియుఁ బెంచి ప్రియను నన్నుఁ
దద్దయును నమ్మియున్న యీ ముద్దరాలి
మృత్యువున కిచ్చుచున్నాఁడ మిమను బన్ని
యింటి చిలుకను బోయకు నిచ్చునట్లు. ౪౫

నేను బాపుఁడను. అంటరాని వాఁడను. దేవి నంటుచేయు చున్నాఁడను. (అని సీత శిరస్సునెత్తి తనచేయి లాగుకొనును)

క. మెండగుపాపము చేసిన
చండాలుని నన్ను విడుము చయ్యన ముగుదా
చందనవిషద్రుమమును శ్రీ
ఖండం బను భ్రాంతిచేతఁ గదిసితి వకటా! ౪౬

(లేచి) అయ్యో! యిప్పుడు జీవలోకము తాఱుమాఱైనది. రాముఁడు జీవించి యుండుటకుఁ బ్రయోజనము నేఁటితోఁ

దీఱినది. జగత్తు జీర్ణశూన్యారణ్య మైనది. సంసార మసారము. శరీరము కాష్ఠప్రాయము. దిక్కులేనివాఁడ నైతిని. ఏమి చేయుదును? నాకు గతియేమి? ఔను.

క. శోకానుభూతి కొఱకే
నా కీచైతన్య మిచ్చె నాళీకభవుం
డీకఠినాసులు వజ్రము
లై కీళులు బ్రిదులఁగొట్టు ననయం బకటా! ౮౭

హాతల్లీ! యరుంధతీ! పూజ్యులగు వసిష్ఠవిశ్వామిత్రులార! భగవంతుఁడ వైనపావకా! హా దేవి, భూతధాత్రి! హాతండ్రీ! జనక! హా తల్లులార! హా ప్రియసఖ సుగ్రీవ మహారాజ! సౌమ్యుఁడ హనుమంతుఁడా! మహోపకారి వైన లంకాధిపతి విభీషణా! హాసఖి త్రిజట! మందభాగ్యుఁడయిన రాముఁడు మిమ్ము నందఱ మోసపుచ్చెను. అవమానించెను. ఔనుగాని వీరలఁ దలపెట్టుటకు నే నెవఁడను?

గీ. ఏఁ గృతఘ్నుఁడఁ బాపుఁడ హీనమతిని
వారలు మహానుభావులు పావనాత్ము
లట్టివారి నేఁ దలపెట్టినట్టులైన
నఘము వారిని దప్పక యంటుకొన్నె? ౮౮

నేనా!

గీ. తొమ్ముపయిఁ బడి యెంతయు నమ్మి నిద్ర
పోవు గృహలక్ష్మిఁ బ్రియసతిఁ బూర్ణగర్భ

నిద్దె కటిక నై త్రోయఁగా నెంచినాఁడ
గ్రద్దలకు బలి వై చెదుకరణి నకట! ४౯

(అని సీతపాదములపై శిరస్సునుంచి) రామునిశిరస్సునకు నీ పాదపంకజస్పర్శ మిదియే చిట్టచివరది. (అని యేడ్చును)

తెరచాటున—అయ్యో! అయ్యో!

రాముఁడు—ఎవఁడురా! అక్కడ! అది యేమిటో కనిరమ్ము.

తెరచాటున—(మరల)

క. లవణాసురుచే నెంతయు
నవమానితులైనమునులు యమునాతీరో
పవననివాసులు నీ కడ
కవనార్థము వచ్చి రిద్దె యవనీపాలా. ౫౦

రాముఁడు—ఏమీ! యింకను రాక్షసభయమా! కానిమ్ము. కుంభీనసపుత్రుఁడును దురాత్ముఁడు నగు మధురా నాథుని నిర్మూలము చేయుటకు శత్రుఘ్నుని బంపెదను. (కొంతదూర మరిగి మఱలివచ్చి) హా! దేవి, ఇట్టి నీ వేమగుదువో కదా! పూజ్యరాల వగు వసుంధరా,

గీ. జనకరఘుగోత్రములు రెంటికిని నహీన
మంగళం బొచు మిం చెడి మాన్యురాలిఁ
బుణ్యయజ్ఞమునను నీకుఁ బుట్టినట్టి
శుద్ధురాలిని గనుపెట్టి చూడవమ్మ. ౫౧

(అని యేడ్చుచుచు నిష్క్రమించును)

సీత.—హా! సౌమ్య, ఆర్యపుత్ర, ఎక్కడనున్నాఁడవు! (అని హాత్తుగ లేచి) ఆహా! దుస్స్వప్నము వలనఁ గలిగిన కలవరము చేత నార్యపుత్రుఁ డిక్కడ లేఁ డనుకొని మొఱపెట్టితిని. (కలయఁజూచి) అక్కటా! నిద్రపోవుచున్న నన్నొంటిగా విడిచి నాథుఁ డెక్కడకుఁ బోయెనో? కానిమ్ము, కనఁబడి నవ్వు డలిగెదను—సాధ్యమయ్యెనేని—ఎవరురా సేవకుఁడు.

దుర్ముఖుఁడు—దేవీ, "రథము సిద్ధముగా నున్నది దేవి యెక్క వచ్చు" నని లక్ష్మణకుమారుఁడు విజ్ఞాపించుచున్నాఁడు.

సీత—ఇదిగో ఎక్కినదానను. గర్భ మదరుచున్నది మెల్లగాఁ బోనిమ్ము.

దుర్ముఖుఁడు—ఇటు, ఇటు దేవి!

సీత—రఘుకుల దేవతల కిదె నమస్కారము. తపోధనుల కిదె ప్రణామము. ఆర్యపుత్ర చరణారవిందంబుల కిదె వందనము. పెద్దల కందఱ కిదె యంజలి.

(అందఱు నిష్క్రమించిరి)

ప్రథమాంకము సమాప్తము.

# ఉ త్త ర రా మ చ రి త ము.

## ద్వి తీ యాం క ము.

(తెరచాటున) తపోధనురాలికి స్వాగతము.

(పాంథవేషముతో నొక తాపసి ప్రవేశించును)

తాపసి——ఇదిగో ఫలకుసుమగర్భపల్లవార్ఘ్యముచేత వన దేవత నాకు దూరమునుండియే యాతిథ్య మిచ్చుచున్నది.

వనదేవత——(ప్రవేశించి అర్ఘ్యమిచ్చి)

చ. నినుఁ గనుఁగొంటి నీదినము
నిండ శుభావహ మయ్యె నాకు స
జ్జనుల సమాగమం బెపుడు
సంధిలుఁ బుణ్యము కల్మిచేత నీ
వనము మదీయ మిందుఁ గల
పండ్లును దుంపలు నీళ్లు నెల్ల నీ
మనమున కెక్కినట్టు లను
మానము మాని గ్రహింపు తాపసీ.

తాపసి——ఇక్కడఁ జెప్పవలసినది వేఱె యే మున్నది?

క. వినయాన్విత వాఙ్మయమము
ప్రణయాంచితవర్తనంబు పావనమతి త

గ్గని యనవద్యస్నేహము
నను నివి నైజములు సజ్జనావళి కెందున్. ౨

(ఇద్దఱుం గూర్చుందురు)

వనదేవత—పూజ్యురాల వైన నిన్ను నే నెవరినిఁగా నెఱుంగ వలయును?

తాపసి—నా పే రాత్రేయి.

వనదేవత—ఆర్యా! ఆత్రేయీ! నీ వెచ్చటనుండి వచ్చితి విటకు? దండకారణ్య సంచార మేల చేసెదు?

ఆత్రేయి—

గీ. కలశజాదులు తత్త్వజ్ఞు లలఘుమతులు
పలువు రిచ్చటఁ గల రని తెలిసి వారి
వలన నిగమాంతవిద్య నేఁ బడయఁ గోరి
వచ్చితి నిపుడు వాల్మీకి వలన నుండి. 3

వనదేవత—ఇతరమునులు పురాణబ్రహ్మవాదియైన యాప్రాచేతసునే బ్రహ్మపారాయణమునకై సేవించుచుండ నింత ప్రయాసపడి నీ విటకు రానేల?

ఆత్రేయి—అచ్చట గొప్ప యధ్యయనవిఘ్న మొక్కటి కలుగుటచే నీ దీర్ఘప్రవాస మంగీకరించితిని.

వనదేవత—ఆ విఘ్న మెట్టిది?

ఆత్రేయి—అప్పుడే స్తన్యము విడిచినట్టియు సర్వవిధముల నద్భుతప్రకారు లైనట్టియు నిద్దఱుబాలుర నెవరో యొక దేవత

తెచ్చి యా మహర్షి కొప్పగించెను. మహర్షులకే కాదు తిర్యగ్జంతువులకుఁ గూడ నా పిల్లలను జూచినఁ బ్రేమపుట్టక మానదు.

వనదేవత—వారి పేళ్లు తెలియునా ?

ఆత్రేయి—ఆ దేవతయే వారి పేళ్లు కుశలవు లని చెప్పి వారి ప్రభావముగూడఁ జెప్పినది.

వనదేవత—ఆ ప్రభావ మెట్టిది ?

ఆత్రేయి—వారికి సరహస్యజృంభకాస్త్రములు జన్మసిద్ధములఁట.

వనదేవత—ఇది చిత్రముగా నున్నది.

ఆత్రేయి—వాల్మీకి యా పిల్లలను ధాత్రివలెఁ బోషించి రక్షించుచుండి వారికిఁ జౌలకర్మ మైనపిదప వేదము గాక మిగిలిన విద్యలు మూఁడును జెప్పి పదునొకండవయేఁట క్షత్రకల్పముచే నుపనీతులఁ జేసి వారిచే వేదాధ్యయనము చేయించెను. ఆ బాలు రతిదీప్తప్రజ్ఞావంతు లగుటచే వారితో నస్మదాదులకు సహాధ్యయనయోగము లేక పోయెను. ఏలన :—

చ. మతిగలవానికి న్మతియు
మందునకుం గురు వొక్కరీతిగా
హితమతి విద్య చెప్పు మతి
నీయను దీయను లేఁడు వారికిన్

మఱియుతుఁ బొందు విద్య మఱి
మాలినవానికి నంట దేమి మే
ల్పతనములట్లులం బలుగు
బాళ్లు గ్రహించున బింబ మెన్నఁడున్? ౪

వనదేవత—అధ్యయనప్రత్యూహ మిదియా?

ఆత్రేయి—మఱియొకటి కూడఁ గలదు.

వనదేవత—అది యేది?

ఆత్రేయి—ఆ బ్రహ్మర్షి యొకనాఁడు మధ్యాహ్నసవనమున కై తమసానది కేగి యచటఁ గవగూడియున్న క్రౌంచపక్షిమిథునమం దొకదానిని వ్యాధుఁ డొకఁడు చంపఁగాఁ జూచెను. చూడఁగానె యతనిముఖమునుండి యాకస్మికముగ—

"మానిషాద ప్రతిష్ఠాంత్వ మగమః శాశ్వతీః సమాః
యత్క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్"

అని నిర్ఘోషమైన యనుష్టుప్ఛ్లోక మొకటి బయలువెడలెను.

వనదేవత—వేదములందుఁ గాక యితరస్థలములందు ఛందస్సగపడుట కిదియే మొదలు.

ఆత్రేయి—పిదప నొకనాఁడు బ్రహ్మ యావిర్భూతశబ్దబ్రహ్మప్రకాశుఁడగు నాఋషియొద్దకు వచ్చి "ఋషివర్యా, వాగ్బ్రహ్మము నీకుఁ బ్రత్యక్షమైనది, కావున, రామచరితముం జెప్పుము. ఆర్షమైన నీ జ్ఞానచక్షు వవ్యాహత

జ్యోతిర్మైనది. నీ వాద్యకవి వైతివి.'' అని చెప్పి యంత
ర్హితుఁ డయ్యెను. తదనంతర మా ప్రాచేతసుఁడు మనుష్య
లోకమందుఁ దొలుత తన ముఖమున నావిర్భవించిన శబ్ద
బ్రహ్మావివర్తమును రామాయణముగా రచించెను.

వనదేవత—అహో, లోకము పాండిత్యశౌండ మయినది గదా !

ఆత్రేయి—దీనిచేతనే యచ్చట గొప్ప యధ్యయనప్రత్యూహము కలిగిన దంటిని.

వనదేవత—యుక్తమే.

ఆత్రేయి—భద్రా! విశ్రమించితిని. ఇఁక నగస్త్యాశ్రమమునకు దారి చెప్పెదవా ?

వనదేవత—ఇక్కడనుండి పంచవటికి వెళ్లి యక్కడనుండి గోదావరియొడ్డును బట్టి పోవునది.

ఆత్రేయి—(కన్నీరు క్రమ్ముచుండ) ఇది తపోవనమా ! ఇది పంచవటియా ! ఈ నది గోదావరియా ! ఈ పర్వతము ప్రస్రవణమా ! నీవు జనస్థానవనదేవత వైన వాసంతివా ?

వనదేవత—ఔ నట్లే.

ఆత్రేయి—హా వత్స ! జానకి !

గీ. నీకు నెంతయుఁ బ్రియమైన యీ కుజాళి
నామమాత్రావశేష వైన నిను నిపుడు
కన్నులారంగ నిచ్చటఁ గన్నయట్లు
తోఁపగాఁ జేసె నిజముగాఁ దోయజాక్షి. ౫

వాసంతిక—(భయపడి, తనలోఁదాను) "నామమాత్రావశేషవు" అన్న నేమి? (పైకి) సీత కేమి యాపత్తు వచ్చినది?

ఆత్రేయి—వట్టి యాపత్తుమాత్రమే కాదు. సాపవాదమైనది కూడ, (చెవిలో) ఇట్లని.

వాసంతిక—ఇది దారుణదైవనిర్ఘాతము. (అని మూర్ఛిల్లును.)

ఆత్రేయి—భద్రా! ఊఱడిల్లుము.

వాసంతిక—హా! ప్రియసఖి! నీపుట్టువు చిట్టచివర కిందుల కైనదా! రామభద్రా—సీతోఁ బనియేమి! ఆర్యా—ఆత్రేయి! లక్ష్మణుఁ డడవిలో విడిచి పోయినపిదప సీత యేమయినదో వార్త యేమైనఁ గలదా?

ఆత్రేయి—లేదు, లేదు.

వాసంతిక—అక్కటా! రఘుకులమున నరుంధతీవసిష్ఠులు గురువులై యుండ, వృద్ధరాజభార్యలు జీవించియుండఁగా నిది యెట్లు సంభవించెను?

ఆత్రేయి—అప్పుడు పెద్ద లందఱును ఋష్యశృంగుని యాగములో నుండిరి. ఆద్వాదశవార్షికసత్ర మిప్పుడు ముగియఁగాఁ బెద్ద లందఱు ఋష్యశృంగుని పూజ లందుకొని యాతని వీడ్కొనిరి. పూజ్యురాలగు నరుంధతి కోడలు లేని యయోధ్య ప్రవేశింపనని చెప్పినది. రాముని తల్లులు నట్లే తలఁచిరి. అట్లే పూజ్యుఁడగు వసిష్ఠుఁడు వాల్మీకివనమున కేగి యచ్చట నుండ నిశ్చయించెను.

వాసంతిక—ఇప్పుడు రామభద్రునివర్తన మెట్లున్నది ?

ఆత్రేయి—ఆతఁడు రాజక్రతువైన యశ్వమేధము చేయ నారంభించెను.

వాసంతిక—ఏమీ, తిరిగి పెండ్లి కూడఁ జేసికొనియెనా ?

ఆత్రేయి—లేదు, లేదు.

వాసంతిక—యజ్ఞమం దతనికి సహధర్మచారిణి యెవరు ?

ఆత్రేయి—బంగారు సీతాప్రతిమను భార్యగాఁ జేసికొని యెను.

వాసంతిక—ఆహా !

క. కులిశంబుకంటె వాఁడియు
నలరులకంటె మృదువులు నై యుండు మహా
త్ములచిత్తంబులు భువిలో
పల వాని నెఱుంగునట్టివారలుఁ గలరే? ౬

ఆత్రేయి—వామదేవుచే ననుమంత్రితమయిన యజ్ఞాశ్వమును గూడ విడిచిపెట్టినారు. శాస్త్రప్రకార మాగుఱ్ఱమును రక్షించుటకై భటుల నియమించి లక్ష్మణుని కొమరుఁగు చంద్రకేతునకు దివ్యాస్త్రసంప్రదాయముల నొసంగి యా తని నాభటకోటి కధిపతిని గావించి చతురంగబలముతోఁ బంపిరి.

వాసంతిక—(హర్ష కౌతుకదుఃఖములు దోఁప) ఏమీ, లక్ష్మణకుమారునకుఁ బుత్త్రుఁడా ! అమ్మ ! బ్రదికితిని !

ఆత్రేయి—అంతట నొక బ్రాహ్మణుఁడు చచ్చిపోయిన తన కొడుకును దెచ్చి రాజద్వారమునందుఁ బడవైచి "అయ్యో! అయ్యో" యని గుండెలు కొట్టుకొనసాగెను. అది విని కరుణామయుఁడగు రామభద్రుఁడు రాజాపచారము లేని దే ప్రజల కకాలమృత్యువు కలుగ దని తనయం దేదో దోష మున్న దని నిరూపించుకొనునవసరమున నశరీరవాణి—

గీ. అవని శంబూకుఁ డను శూద్రుఁ డధికతపము
చేయుచున్నాఁడు నీ కలచెనఁటితపసి
వధ్యుఁ డగుఁ గాన వగ మాని వానిశిరముఁ
గోసి ద్విజపుత్రు బ్రదికింపు కోసలేంద్ర. 2

అని పలికెను. అది విని జగత్పతి యైన రామభద్రుఁడు కృపాణపాణియై పుష్పక మెక్కి యన్నిదిశలందును విదిశ లందును శూద్రతాపసిని వెదక నారంభించెను.

వాసంతిక—శంబూకుఁ డను శూద్రుఁ డధోముఖుఁడై ధూమ పానము చేయుచు నీజనస్థానమందే తపము చేయు చున్నాఁడు. కావున రామభద్రుఁడు మఱల నీవనము నలంకరింపనోపును.

ఆత్రేయి—భద్ర! వెళ్ళెదను.

వాసంతిక—మంచిది. ఎండ యెంత తీక్ష్ణముగా నున్నదో చూచితివా ?

శా. ఎండం బుల్గులు గూండ్లలో నొదిఁగి యెం
తే స్రుక్కి కూజింపఁగా
మెండై కాకులు క్రింది నీడఁ బురువు
ల్మేయంగ మిట్టాడఁగాఁ
గండూతిం గరు లెల్లఁ దమ్ము నొరయం
గా రాలుపుష్పాళిచే
నండం గల్గినభూరుహంబు లివిగో
యర్చించు గోదావరి౯.

(అని నడచి యిద్దఱు నిష్క్రమించిరి)

(అప్పుడు దయార్ద్రహృదయుఁడైన రామభద్రుఁడు ఖడ్గము చేతఁబట్టుకొని ప్రవేశించును)

రాముఁడు—

ఉ. ఓ కుడిహస్తమా మరణ
మొందిన విప్రసుతుండు వెండి సం
జ్ఞాకలితుండు గాఁగ నసిఁ జయ్యన
వైవుము శూద్రమౌని పై
వేఁకటిచేత ఖిన్నయగు
ప్రేయసిఁ గానకు నంపినట్టి యై
క్ష్వాకుని బాహు వీవనఁ గృ
పారస మెమ్మెయిఁ నీకుఁ గల్గెడి౯ ?

(ఏలాగుననో కత్తి విసరివైచి) రామసదృశమైనకృత్యము జరిగినది. ఆబ్రాహ్మణపుత్త్రుఁడు బ్రతికినట్లా !

దివ్యపురుషుఁడు—(ప్రవేశించి) దేవరకు జయమగుఁగాక!

గీ. యముని శాసింపఁ జాలు నీ వభయ మొసఁగ
ద్విజుఁడు జీవించె నాకు నీ తేజ మొదవెఁ
గొనుము శంబూకుఁ డొనరించు ప్రణతి యిదిగొ
సుజనులవలని చావును శుభకరంబ. ౧౦

రాముఁడు—రెండును మా కిష్టమే. నీవు చేసిన మహాతపము ఫల మనుభవింపుము.

క. కలిమియుఁ బుణ్యము మోదం
బలఘుతరానంద మతిశయంబుగ నెచ్చోఁ
గల వావై రాజపథం
బులు నీకు నొసంగుఁగాత భూరిసుఖంబుల్. ౧౧

శంబూకుఁడు—స్వామీ! ఇది మీ ప్రసాదమహిమయే గాని నా తప స్సేమి చేయఁగలదు? అట్లన నేల? తపస్సువలన నే పెద్దయుపకార మయినది.

ఉ. అందయు నేతె వంచు జను
లందఱు ని న్వెదకంగ నెంతయుం
గొందుక నైన న న్వెదకి
కొంచును నీ విట వచ్చు టారయన్
మెండగు నాతపంబు ఫల
మే యటుగాక యయోధ్య నుండియు
న్వెండియు దండకాఖ్యవన
వీథికి దేవర వచ్చు టెట్లగున్?

రాముఁడు—ఏమీ! ఇది దండకయా! (అంతటఁ గలయఁజూచి)
హా! యెట్లు

చ. సురుచిరనీలభాగములు
శ్లోభకరాతివిశాలభాగముల్
నిరతము నిర్ఝరారము
నిండఁగఁ బర్వెడుపట్లు గర్తముల్
వరమునివాసము ల్గిరులు
పావనతీర్థములుం గలట్టి యీ
పరిచితదండకావిపిన భాగములం గన
నయ్యె వెండియున్.

శంబూకుఁడు—ఇది దండకయే. దేవర పూర్వ మిచ్చట నివ
సించియున్నప్పుడే

గీ. పదియు నాలుగువేలును బదుగురు మఱి
నలుగురును దూషణాఖ్యుండు నలఖరుండు
మూఁడుతలలవాఁ డిందఱు పుణ్యజనులు
సమరమందున నీచేతఁ జచ్చి రనఘ. ౧౪

దానిచేతనేగదా, అస్మదాదు లగుజానపదులకుఁగూడ నీ
సిద్ధక్షేత్రమందు నిర్భయముగ సంచరించుట కవకాశము
కలిగినది.

రాముఁడు—ఇది దండకారణ్యము మాత్రమే కాదు, జన
స్థానముకూడ—

శంబూకుఁడు—నిశ్చయమే. మదించిన ఘోరమృగములతో నిండియుండు గిరిగహ్వరములతో నొప్పుచు సర్వభూతములకు రోమహర్షణము గలిగించు నీజనస్థానదీర్ఘారణ్యములు దక్షిణదిక్కుగా వ్యాపించియున్నవి. ఇదిగో చూఁడుఁడు.

చ. చిలుకలవల్కులుం జెవులఁ
జేరకయుండెడు నొక్కచో నిర
ర్గళముగఁ గ్రూరసత్త్వఘన
రావము లొక్కెడ నుప్పతిల్లెడున్
అలసటపేర్మి మైమఱచి
హాయిగ నిద్దురవోవుచున్న పెం
జిలువలవేఁడియూరుపులఁ
జెచ్చెర వెల్వడు మంట లొక్కెడన్.

ఉ. ఆరయ నీకెలంకుల జ
లాశయము ల్విరళంబు లౌటయున్
దారుణమైనయట్టి తృషఁ
దద్దయు డస్సినతొండ లెండచే
భూరిదరోదరస్థలుల
బుస్సలు గొట్టుచు నిద్రవోవు నీ
భూరిఫణీంద్రదేహములఁ
బుట్టెడు చెమ్మటఁ గ్రోలుఁ జూచితే.

రాముఁడు—

గీ. మున్ను ఖరున కాలయమౌచు నున్నయట్టి
యీజనస్థానమును గంటి నిపుడు మరలఁ
బరఁగ నలనాఁటి వృత్తాంతసరణి యెల్ల
వెండియును నే నిపుడనుభవించుచుంటి. ౧౭

(ఎల్లెడఁగలయఁజూచి) వైదేహికి వనము లనఁ బ్రీతి మెండు. ఇప్పు డీవనములో నాపెను బాసియుండుటకంటె దుఃఖకర మెద్ది?

గీ. అలరు తావులు వెదచల్లు నడవులందుఁ
గాంత నినుఁగూడి నివసింపఁ గంటిననుచుఁ
గలికి యేవేళ వేడ్కమైఁ గులుకు చుండు
నరయఁగా నాపెస్నేహంబు నట్టియదియ. ౧౮

క. తనసుఖ ముండుటచేతన
తనమిత్రుని దుఃఖమెల్లఁ దప్పింపఁగఁ జా
లిన యామిత్రము కంటెను
ఘనతరమౌ వస్తు వెద్ది క్ష్మాతలమందున్. ౧౯

శంబూకుఁడు—అలభ్యము లగు వీనిని దడవనేటికి. మదకలహంసమయూరకంఠకోమలమేచకాచలావకీర్ణంబులు, నిరంతరనీలబహుళచ్ఛాయాతరుషండమండితంబులు, నసంభ్రాంతవివిధమృగయూథంబులును, బ్రశాంతగంభీరంబులు నగు నీ మహారణ్యముల, మహాభాగ! తిలకింపుము.

ఇందు—

చ. ఫలముల వ్్రేఁగున న్నిగుల
వంగిన నేరెడుచెట్లగుంపులన్
గులగుల వ్రాయుచు న్వడియుఁ
గుండఁగఁ బాఱెడు నిర్ఝరంబులం
గెలఁకుల వేతసాళిపయి
కిన్విహగావళి యెక్కి యాడుచున్
జలజల రాల్చుఁ బూవు లిదె
సౌరభ మంతయు నీటి నంటఁగాన్. ౨౦

మఱియు—

చ. ఎలుఁగులు కందరంబుల న
హీనరవంబునఁ జేయునాదముల్
బిలములు వెండియు న్మొరయ
వింతగ నెంతయుఁ బెద్దబొబ్బ లోఁ
గలభము లగ్రము ల్విఱువఁ
గా నిదె గ్రంథులనుండి కాఱెడున్
సలలితగంధయుక్కటుక
పాయము సల్లకివృక్షపంక్తులన్. ౨౧

రాముఁడు—(కన్నీరు గ్రమ్మ నివ్వెఱపడి బాష్పముల నిరోధించుచు) భద్రా! దేవయానమార్గములు నీకు శుభకరములగుఁగాక. పుణ్యలోకములకుఁ బొమ్ము.

శంబూకుఁడు—పురాణబ్రహ్మవాదిమైన యగస్త్యునకభివా
దన మొనర్చి శాశ్వతపదముం బ్రవేశించెదను. (అని వెళ్లును)

రాముఁడు—

ఉ. ఈరమణీయకానన మి
దే కనుఁగొంటిని వెండి ప్రీతియే
పారఁగఁ దొల్లి యుందు వన
వాసగృహస్థత లన్న రెండు నొ
ప్పారఁగ స్వీయధర్మరతి
పాయక డెందమునందు నిల్ప సం
సారసుఖంబులం గల ర
సంబు నెఱింగినవాఁడ నెంతయున్. ౨౨

గీ. కూయునెమిళుల నొప్పునీకొండ లవియె
హరిణమయము లైనట్టి యీయడవు లవియ
లలితవంజులనిచులాదిలతలు మిగులఁ
దఱచుగా నున్న యీసరిత్తటము లవియ. ౨౩

గీ. మేఘమాలను బోలి సమీపమందు
నున్నయట్టులు గాన్పించుచున్న దెద్ది
వరఁగ గోదావరీనది పాఱు నెచట
నద్ది ప్రస్రవణాఖ్య మానద్రి నిజము. ౨౪

గీ. వాసముండెను దానిపైఁ బక్షిరాజు
ఇలను మే ముండితిమి యాకుటిండ్లలోను

బత్తిరవముచే రమ్య మహావృక్షపంక్తి
తనరు నలగౌతమీతీరవనములందు. ౨౫

ఇచ్చటనే పంచవటి యున్నది. చిరకాలనివాసముచేత మావివిధస్వేచ్ఛావిహారములకు సాక్షులైన ప్రదేశములును ప్రియురాలి సఖియైన వాసంతియు నిచ్చటనే యున్నారు. ఇప్పుడు రామునిమీఁదఁ బడినదేమిటి?

ఉ. ఊరక యుండియుండి కడు
నుగ్రతఁ దాఁకు విషంబుపోలికన్
సారయుతంబుగా వదలఁ
జయ్యన వచ్చునలుంగు లాగునన్
దారుణహృద్వ్రణంబుపయిఁ
దద్దయు నొవ్వఁగఁ గొట్టినట్టులం
గ్రూరత నాఁటిశోక మిదె
క్రొత్తదిపోలె నలంచు నక్కటా! ౨౬.

అట్టిదియైనను బూర్వమిత్రములుగాన నీ ప్రదేశములఁ జూచెదను. (నిరూపించి) భూతసన్నివేశ మొక్కరీతిగా నుండదుగదా!

ఉ. ఏఱులఁ దొల్లి నీరుప్రవ
హించిన చోటుల లంక లేర్పడెన్
భూరుహకోటిఁ జిక్కఁదన
ము న్విరళత్వము మాఱె నెంతయున్

వేఱుగఁ దోఁచె నీవనము
పెక్కుదినాలకుఁ గాంచినందున
న్మాఱక యున్న యీ గిరులు
మాత్ర మదే యిది యంచుఁ దెల్పెడిన్. *౨౭

ఆహా! విడిచిపోవుచున్నను నన్నుఁ బంచవటీ స్నేహము చేత బలవంతముగా లాగుచున్నది. (దీనముగా)

ఉ. ఇంటను బోలె నేనెచట
నింతిని గూడి దినంబు లెన్నియే
నుంటి సుఖాన దేనికథ
లుల్లముపొంగ సతంబుఁ జెప్పుకోఁ
గంటిమి యట్టి పంచవటిఁ
గాంతను గోల్పడి పాపి రాఘవుం
డొంటిగఁ జూడఁగల్గెడినో
యొప్పరికించి చనంగనోపునో. ౨౮

శంబూకుఁడు—(ప్రవేశించి) దేవరకు జయమగుం గాక. భగవంతుఁ డగునగస్త్యుఁడు దేవర యిక్కడనున్నట్లు నావలన విని "నీరాజనాదిమంగళాచరణద్రవ్యములు సిద్ధపఱుచుకొని వత్సలయగు లోపాముద్రయు మహర్షులును నీరాకకై

---

* ఉ. ఎక్కడ నీరు పాఱె మును పేఱుల నక్కడ లంక లేర్పడెన్
జిక్కదనంబుఁ బల్చనయుఁ జెట్లగుమి న్విపరీతమయ్యె నాఁ
బెక్కుదినాలకుంగనుట వేఱుగఁ దోఁచెడు నీవనంబహో
యిక్కలుః మాఱకుండు గిరులే యిది యద్దియటంచుఁ దెల్పెడిన్.

యెదురు చూచుచున్నారు. కావున నిక్కడకు వచ్చి మమ్ము గౌరవించి పిదపఁ బుష్పక మెక్కి వేగముగా స్వదేశమునకు వెళ్లి యశ్వమేధము చేయుదువుగాక" అని చెప్పుమని సెలవిచ్చిరి.

రాముఁడు—వారి సెలవు ప్రకారమే చేసెదను.

శంబూకుఁడు—దేవ! ఇటు, ఇటు.

రాముఁడు—(పుష్పకమును సాగించి) పూజ్యారాలవగు పంచవటీ, పెద్దలయాజ్ఞనుబట్టి రాముఁడు నిన్నతిక్రమించి పోవుచున్నాఁడు. క్షణకాలము క్షమింపవలయును.

శంబూకుఁడు—దేవ! ఇదిగో చూడుము.

శా. గుంజత్కుంజకుటీరకౌశికఘటా
ఘుక్కారవత్కీచకా
సంజాతస్వన మూకకాకకుల మీ
శైలంబు క్రౌంచాద్రి నా
గంజెన్నొందు నిటఙ్ మయూరగణకే
కారావ మాలించి వే
పుంజంబు ల్గొని గంధసారతరులం
బొర్లాడెడు న్సర్పముల్. 30

మఱియు—

గీ. గుహల గోదావరీవారి గులగులనుచు
నెల్లవేళలఁ దాఁ బ్రవహించుచుండ

నీలమేఘాళి వాళిపైఁ గ్రాలుచున్న
యల్లదక్షిణపునగము లవ్వె సుమ్ము. ౩౦

గీ. కూడి యొండొంటిఁ దాఁక సంకులము లగుచుఁ
బొంగి పై కుబ్బి మ్రోయు తరంగమాల
లలరఁ బుణ్యగంభీరసలిలము లైన
యాసరిత్సంగమంబులు నవియ సుమ్ము. ౩౧

(అని అందఱు వెళ్లిరి)

## ద్వితీయాంకము

సమాప్తము.

# ఉత్తర రామ చరితము

## తృతీయాంకము

(రెండు నదులు ప్రవేశించును)

ఒకనది—సఖీ మురల! ఏమో తొందరగా వెళ్లుచున్నట్లున్నావు.

మురల—సఖీ తమస! పూజ్యుఁ డగు నగస్త్యునిభార్య లోపాముద్ర సరిద్వర యగుగోదావరిని బిలిచికొని రమ్మని నన్నుఁ బంపినది. "వధూపరిత్యాగము మొదలుకొని—

గీ. అతిగభీర మగుట నగపడదు పయికిఁ
గాని లోన మిగులఁ గనలుచుండుఁ
గుతకుత మనుచు నుడుకు పుటపాకము గతి
గురుతర మగురాము కరుణరసము. ౧

అని నీ వెఱింగియే యున్నావుగదా! అట్టి యిష్టజనకష్టవినిపాతమువలనఁ గలిగిన దీర్ఘశోకముచేత రాముఁ డిప్పుడెంతయు క్షీణించియున్నాఁడు. అతనిని జూడఁ గుసుమసమబంధ మగు నా హృదయము వడఁకుచున్నట్లున్నది. రామభద్రుఁ డిప్పుడు మరల నిటకు వచ్చి పూర్వపరిచితములైన పంచవటీవనప్రదేశములఁ జూడనై యున్నాఁడు.

అప్పుడు నిసర్గధీరుఁడైనను నాతని కిప్పటియవస్థయం దతి గంభీరాభోగశోకక్షోభసంవేగమువలన మాటిమాటికి మహాప్రమాదములు గలుగవచ్చునని శంక పొడముచున్నది. కావునఁ బూజ్యురాలవగునో గోదావరీ,

గీ. శీకరక్షోదములచేత శీత మగుచుఁ
దమ్మిపుప్పొడి దాల్చిన తెమ్మెరలను
దెలివి నొందించి రాముని దేర్ప వమ్మ
యతఁడు మూర్ఛను మునిఁగిన యప్పుడెల్ల." ౨

అనికూడఁ జెప్పుచున్నది.

తమస—స్నేహమునకు దాక్షిణ్య ముచితమే, కాని రామభద్రునకు సమూలమైన సంజీవనౌషధ మేర్పడియే యున్నది.

మురల—అది యెట్లు.

తమస—అది యంతయుఁ జెప్పెద వినుము. లక్ష్మణుఁడు వాల్మీకితపోవనసమీపమందు విడిచిపోయినపిదప సీతాదేవి తనకుఁ బ్రసవవేదన గలుగ నాదుఃఖము సహింపంజాలక గంగాప్రవాహమందుఁ బడి యం దిరువురు బిడ్డలం గనియె. తదనంతరము పృథివియు భాగీరథియు నామెను రసాతలమునకుఁ గొనిపోయిరి. పాలు త్రాగుట విడిచిపెట్టినపిదప గంగాదేవి యాపిల్లలను దెచ్చి వాల్మీకి మహర్షి కొప్పగించెను.

మురల—(విస్మయముతో)

గీ. ఇట్టివారి కొదవ్వు నిమములు సైతము
తలఁప మిగుల నద్భుతంబు లవుర!
యింతలేసివారు హితు లౌచు నుపకృతుల్
సలుపఁబూని రట్టి సమయమందు. 3

తమస—ఇప్పు డీ శంబూకవృత్తాంతముచేత రామభద్రుఁడు జనస్థానమునకు వచ్చియున్నాఁ డని సరయువువలన విని లోపాముద్రకువలెనే తనకును శంక గలుగఁగా గంగాదేవి సీతను దోడ్కొని యేదోయొక గృహాచారవ్యపదేశముచేత గోదావరియొద్దకు వచ్చియున్నది.

మురల—పూజ్యురాలగు భాగీరథి మంచి యోజన చేసినది. రాజధానియం దున్నపుడు జగదభ్యుదయైక నానాకార్యవ్యగ్రతచే రామభద్రుని చిత్తవిక్షేపములునిరుద్ధము లై యుండును. ఇప్పుడు వ్యాపారాంతరశూన్యుఁ డై శోకమే తోడుగాఁగల యాతఁడు పంచవటిం బ్రవేశించినచో మహానర్థము సంభవించు ననుట నిశ్చయము. కాని, సీత యాతని నూఱడించుట యెట్లు?

తమస—పూజ్యురాలగు భాగీరథి "వత్సా! దేవయజనసంభవ! ఇప్పుడు చిరంజీవులగు కుశలవుల ద్వాదశజన్మవత్సరసంఖ్యామంగళగ్రంథ్యుత్సవము జరుగుచున్నది గదా, కావున మానవరాజర్షివంశకర్తయు, నీకుఁ బెద్దమామయు నిరస్త

సమస్తదోషుఁడు నగు సూర్యుని నీవు స్వయముగాఁ గోసి తెచ్చినపూలచే నర్చింపుము. నా ప్రభావమువలన భూమిపై సంచరించునప్పుడు నీవు వనదేవతలకు సైత మగపడ కుందువు. మర్త్యులమాట చెప్పనేల ?'' అని సీతతోఁ జెప్పి "తమసా ! సీతకు నీయందుఁ బ్రేమ మెండు, కావున నీ వామెకుఁ దోడుగా నుండు''మని నా కాజ్ఞాపించెను. త దాజ్ఞానుసారముగా నడచెదను.

మురల—నేను వెళ్ళి యీ వృత్తాంతము పూజ్యురాలగు లోపాముద్రకు వినిపించెదను. రామభద్రుఁడుకూడ వచ్చి యుండునని యూహించెదను.

తమస—ఇదిగో గోదావరీహ్రదమునుండి వెలువడి—

గీ. చిక్కియును జక్కనౌ తెలిచెక్కుఁగవయు
ప్రీలి యసియాడు వేణియు వింత గొలుపఁ
గాయ మొందిన విరహమో కరుణరసమొ
యనఁగ జానకి తా నిదే వనముఁ జొచ్చె. ౪

మురల—ఇదిగో యామె—

గీ. తొడిమఁ బాసిన తలిరాకు వడువుఁదోఁప
వాడి వెల్లనైనట్టి యీ చేడెమేనుఁ
జిరవియోగార్తి మఱి వాడఁజేసె శార
దతపనుఁడు కేతకీగర్భదళముఁబోలె. ౫

(అనుచు వెడలిపోయిరి)

(తెరచాటున) అయ్యో! అయ్యో!

(తరువాత సకరుణౌత్సుక్యముగా వినుచుఁ బువ్వులు గోయుచు సీత ప్రవేశించెను)

**సీత**—అహో! ఇవి నా ప్రియసఖి వాసంతి మాటలవలె నున్నవి.

(తిరిగి తెరచాటున)

గీ. తొల్లి జానకి స్వయముగా సల్లకి యిగు
ళ్లేర్చిపెట్టి పెంచినయట్టి యేనుగున్న

**సీత**—దాని కేమి?

(తెర చాటున)

యువిదఁగూడి జలక మాడుచుండఁ బెద్ద
ద్విరదపతి దానిపైఁబడి పెనఁగు నిదిగో. ౭

**సీత**—(తొందరగాఁ గొన్ని యడుగులు నడచి) ఆర్యపుత్ర! రక్షింపుము, రక్షింపుము! నా పుత్రకుని. (జ్ఞప్తికిఁదెచ్చుకొని) అయ్యో! మందభాగ్యరాలనైన నాకుఁ బంచవటీదర్శనము చేతఁ జిరపరిచితము లైన యాయక్షరములే స్ఫురించు చున్నవి. హా! ఆర్యపుత్ర! (అని మూర్ఛిల్లును)

**తమస**—(ప్రవేశించి) ఊఱడిల్లు మూఱడిల్లుము.

(తెరచాటున) విమానరాజమా యిచట నిలువుము.

సీత—(ఉల్లాసమును భయమును దోఁప) అహో! నిండుమేఘము నుండి వెడలిన గంభీరమాంసల స్తనితముగతి నెద్దియో వర్ణోచ్చారణము చెవుల సోఁకినమాత్రాన మందభాగ్య నయిన నాకుఁగూడ నుత్కంఠ కలుగుచున్నది.

తమస—(స్నేహబాష్పములతో)

గీ. ఎచటనుండిటు వచ్చెనో యెఱుఁగ రాని
యస్ఫుటంబైన యీనాద మాలకించి
నంతనే కడు హర్షంబు నందితి విదె
నీరదధ్వని విన్నమయూరివోలె. ౭

సీత—అస్ఫుటం బనియెదేల? సర్వమునుబట్టి యార్య పుత్రుని పలుకుగా గ్రహించుచున్నదానను.

తమస—తపము చేయుచున్న శూద్రుని దండించుటకై రామ భద్రుఁడు దండకారణ్యమునకు వచ్చియున్నాఁ డని వినికిడి కలదు.

సీత—దైవానుగ్రహముచేత నా రాజు రాజధర్మము విడువక యున్నాఁడు.

(తెరచాటున)

గీ. ఎచటఁ జిరకాల ముంటి నే నింతిఁ గూడి
యెచటి తరులును మృగములు నిష్టు లెంతొ
యెచట గుహలు నిర్ఝరములు నెన్నొ యున్న
వట్టిగోదావరీతీరఘట్టము లివి. ౮

సీత—(చూచి) హా! ప్రభాతచంద్రమండలము పోలెఁ బాలి
పోయి క్షీణించి దుర్బలుఁడై యున్న యార్యపుత్రుని సహజ
సౌమ్యగంభీరానుభావముచేత నెట్టులో గుఱుతింపఁగలి
తిని. ఆర్యా! తమసా నన్నుఁ బట్టుకొమ్ము. (అని తమసను
గాఁగిలించుకొని మూర్ఛిల్లును)

తమస—వత్సా! ఊఱడిల్లుము, ఊఱడిల్లుము.

(తెరచాటున) ఈ పంచవటీదర్శనముచేత

గీ. అకట మోహంబు నన్నిప్డు డలముకొనియె
నంతరంగములోపల నింతదనుక
నడఁగియుండి యుండియిపుడు కడఁక రవిలి
మిగుల వ్యాపించు దుఃఖాగ్నిపొగ యనంగ. ౯

హా! ప్రియురాల! జానకి!

తమస—(తనలోఁదాను) ఇంతవఱకు వచ్చునని పెద్ద లూహిం
చియే యున్నారు.

సీత—హా! నేనేమి చేయుదును.

(తిరిగి తెరలో) హా! దేవి, దండకారణ్యావాస ప్రియసఖి!
విదేహరాజపుత్రి! (అని మూర్ఛిల్లును)

సీత—అయ్యో, అయ్యో! మందభాగ్య నయిన నన్నుఁ
బేర్కొని నల్లకలువలఁ బోలు కన్నులు మూసికొని యార్య
పుత్త్రుఁడు మూర్ఛనొందెను. అయ్యో! నిరుద్ధనిశ్వాసుఁడై
భూమిమీఁద నెట్లుపడి యున్నవాఁడో! తమసా! రక్షింపుము,

రక్షింపుము. ఆర్యపుత్రుని బ్రదికింపుము. (అని పాదములఁ మీఁదఁ బడును)

తమస—

గీ. అఖిలలోకాధినేత యైనట్టి పతికిఁ
బ్రాణ మొసఁగుము తిరుగఁ గల్యాణి నీవె
నీకరస్పర్శ మతనికి నిండఁ బ్రియము
అదియ యాతనిఁ దేర్చ సమర్థ మగును. ౧౦

సీత—ఏదియెట్లయినఁ గానిమ్ము. నీ యాజ్ఞానుసారము చేసెదను.

(అప్పుడు కన్నీరువిడుచుచు సీతపట్టుకొనియుండ నాహ్లాదపూర్వకముగా నిట్టూర్పు నిగిడించుచు భూమిమీఁదఁ బడియున్న రాముఁడు ప్రవేశించును).

సీత—(కొంచెము సంతోషముతో) త్రైలోక్యమునకు మఱలఁ బ్రాణము వచ్చిన ట్లున్నది. ఆహా! ఏమి యిది?

రాముఁడు—

ఉ. చందనపల్లవోత్కరర
సంబో సుధాంశుకరాంకురంబులం
బొందుగఁ బట్టి పిండ నటఁ
బుట్టినసారమొ శోకతప్తమై
కందిన జీవము న్మఱలఁ
గందళ మొందఁగఁ జేసి తేర్చుచుం
డెందము నంటె నేదియొక
డిందిసుఖం బొనరంగఁ జేయుచున్. ౧౧

అంతియుకాదు—

చ. ఎఱిఁగిన యట్టులున్నదిది
యింతకు ముందుగ, నిక్క మద్దియే
యెరిసినచిత్తము న్మఱల
నేత్రిఱ గొల్పుచు శోకవహ్నిచేఁ
బెరిఁగినమూర్ఛఁ బాపియును
వెంటనె బుద్ధికి మాటిమాటికిన్
మఱపౌనరంగఁ జేయు నతి
మానసుఖానుభవాప్తిచేతనే. ౧౨

సీత—(భయకంపములతో) ఇప్పటి కిదియే పదివేలు నాకు.

రాముఁడు—(కూర్చుండి) వత్సల యగుదేవి నన్నిప్పు డనుగ్రహించి యుండలేదుగద!

సీత—అక్కటా! ఆర్యపుత్రుఁడు నన్ను నిందించుచున్నాఁడా యేమి? వెదకుచు.

రాముఁడు—కానిమ్ము, చూచెదను.

సీత—తమసా! కొంచెము చాటునకుఁ బోవుదము. రాజు చూచిన యెడల ననుజ్ఞలేనిదే యిటకు వచ్చినందుకు నా మీఁద నాయనకు మిక్కిలి కోపము రావచ్చును.

తమస—వత్సా! భాగీరథీప్రసాదమువలన వనదేవతలకుఁ గూడ నీ వగపడవు.

సీత—అవునది నిజమే.

రాముఁడు—హా ప్రియురాలా! జానకీ!

సీత—(భయముతోఁ గూడిన గద్గదస్వరముతో) ఆర్యపుత్ర, యిప్పటి యీమాటలకును జరిగినపనికిని నతుకుటలేదు. (కన్నీటితో) ఆర్యా! జన్మాంతరములందుఁ గూడ దుర్లభదర్శనుఁడై మందభాగ్యనయిన నన్నుద్దేశించి యిటులు వాత్సల్యముతోఁ బలుకు నార్యపుత్రునిమీఁద నను క్రోశము విడిచి వజ్రహృదయనై యెట్లుండఁగలను? ఈతని హృదయము నే నెఱుఁగుదును. నా హృదయ మీతఁ డెఱుఁగును.

రాముఁడు—(కలయంజూచి నిర్వేదముతోఁ) హా! యిక్కడ నేమియు లేదు!

సీత—ఆర్యా! నన్ను నిష్కారణముగఁ బరిత్యజించినవాఁడయిన నిప్పు డీవిధముగా నున్న యీతనిం జూచుటచే నా హృదయావస్థ యెట్లున్నదో యెఱుఁగుదువా?

తమస—ఎఱుఁగుదును, వత్సా! యెఱుఁగుదును.

సీ. ఆశకు బాత్రిగా నవకాశమే లేని
పగిదిదోఁపఁ దటస్థభావ మొందుఁ
బ్రియుఁడు చేసినయట్టి విప్రియం బొకయింత
తలఁపునఁ బొడకట్టఁ గలఁత చెందుఁ
జిరవియోగంబునఁ జెలువుఁ దకస్మాత్తు
గా నగపడుటచే మ్రానుపడును
సహజమైనట్టి సౌజన్యంబు మహిమచే
సారెసారెకును బ్రసన్న మగును

ప్రాణనాథుని వ్యథఁ జూచి వ్యథను బొందుఁ
గరము హెచ్చైన ప్రేమచేఁ గరఁగిపోవు
వత్స యీరీతి నీమది పలుదెఱఁగులు
గాఁగ వర్తిల్లుచున్న దీక్షణమునందు. ౧౩

రాముఁడు—దేవీ,

గీ. అబల, స్నేహార్ద్రశీతలం బైన నీదు
స్పర్శ మాకృతి గన్న ప్రసాద మనఁగ
నిప్పుడునుగూడ సంప్రీతి యొసఁగఁజేయు
నీవుమాత్రము గానంగరావు నాకు. ౧౪

సీత—అగాధస్నేహసంభరితములు నానందనిష్యందములు నగు నార్యపుత్రుని యుల్లాపముల వింటిని. నిష్కారణ పరిత్యాగశల్యపీడిత మయ్యు నాజన్మ మిప్పుడు ధన్య మైనది.

రాముఁడు—ఎప్పుడు నాపెనే తలంచుచుండు నభ్యాసము చేత రామునకుఁ గలిగిన భ్రమగాని యిది, ప్రియురా లెక్కడ నుండి వచ్చును?

(తెరచాటున) అయ్యో! ప్రమాదము, మహాప్రమాదము!

గీ. తొల్లి జానకి స్వయముగా నల్లకియగు
శేర్చిపెట్టి పెంచినయట్టి యేన్గు గున్న

(అని సగము చదువును)

రాముఁడు—(కరుణౌత్సుక్యములు దోఁప) దాని కిప్పుడేమి?

(తిరిగి తెఱచాటున)

యువిదఁ గూడి జలక మాడుచుండఁ బెద్ద
ద్విరదపతి దానిపైఁబడి పెనఁగు నిదిగో.

(అని యుత్తరార్ధము చదువును)

సీత—ఏనుఁగుగున్న పక్షమునఁ బోరువా రెవరున్నారు?

రాముఁడు—నా ప్రియురాలి పుత్త్రుని భార్యా సహితుఁడై యుండగాఁ దాఁకెడు దురాత్ముఁ డెక్కడ? (అని లేచును)

వాసంతిక—(ప్రవేశించి సంభ్రమముతో) దేవ! త్వరగా, త్వరగా.

సీత—ఏమీ! నా ప్రియసఖి వాసంతికయా?

రాముఁడు—ఏమీ, దేవి ప్రియసఖి యయిన వాసంతికయా!

వాసంతిక—దేవ, సత్వరముగ జటాయుశిఖరమునకు దక్షిణమున నున్న సీతాతీర్థము నొద్ద గోదావరి దాఁటి దేవి పుత్త్రకుని రక్షింతురుగాక.

సీత—అకటా! తండ్రీ! జటాయు! నీవు లేకుండుటచే నీ జనస్థానము శూన్య మైనదిగదా!

రాముఁడు—అహహా! ఈపూర్వకథోద్ఘాటనములు హృదయమర్మచ్ఛేదకములుగా నున్నవి.

వాసంతిక—దేవా! ఇటు, ఇటు.

సీత—పూజ్యురాలా! నిజమే. వనదేవతకు సయితము నే నగపడుటలేదు.

తమస—వత్సా! దేవత లందఱకంటె మందాకినీప్రభావ మధికము. నీ కీసందియ మేల కలిగెను?

సీత—వారివెంటఁ బోవుదము. (అని నడచును)

రాముఁడు—భగవతీ! గోదావరీ! నీకు నమస్కారము.

వాసంతిక—(పరికించి) వధూద్వితీయుఁ డగు దేవిపుత్త్రుఁడు గెలిచెను. దేవర సంతోషింతురుగాక!

రాముఁడు—ఆయుష్మంతుఁ డెప్పుడును విజయ మందునుగాక.

సీత—అహో! నా పుత్త్రకుఁ డింతవాఁ డయ్యెను!

రాముఁడు—దేవీ! నీ వదృష్టవంతురాలవు.

గీ. మొలకకోఱతో నీ చెవి మొదట నున్న
లవలిలేఁజిగురాకును లాగుచుండు
నీ సుతుండు మత్తకరులఁ గాసిచేయు
చున్నవాఁ డిదె నవవయో యుక్తుఁడగుచు. ౧౫

సీత—వీఁడు సౌమ్యదర్శనమైన యీ భార్య నెప్పుడును బాయక దీర్ఘాయువై యుండుఁగాక.

రాముఁడు—సఖీ, వాసంతికా, చూడు చూడుము. వత్స కాంతానువృత్తిచాతుర్యము కూడ నేర్చెను.

చ. జలరుహకాండఖండములఁ
జాన తినంగ నోసంగుఁ బద్మగం
ధలసితవారిఁ బుక్కిటను
దాలిచి త్రాగఁగ నిచ్చు వేడుకన్

జలములు పీల్చి పై కుమియుఁ
జల్లనితుంపరగా నవక్రాం
డలసితపద్మపత్రము బె
డంగుగ ఛత్రముగాఁగఁ బట్టెడున్. ౧౬

సీత—ఆర్యా, తమసా, వీఁ డిప్పటి కింతవాఁ డయ్యెనుగదా కుశలవు లిప్పు డెంతవారై యుందురో ?

తమస—వీఁ డెంతవాఁడో వారు నంతవారే యగుదురు.

సీత—మందభాగ్యనయిన నే నిట్టి స్థితికి వచ్చినదానను. ఆర్యపుత్రవిరహమేగాక పుత్రవిరహముగూడ సంప్రాప్తమైనది నాకు.

తమస—ఇట్లు కావలసినయోగ మున్నది.

సీత—ఇంచుక విరళములైన తెల్లని లేఁతపలు మొగ్గలతోడను ముద్దులు గుల్కెడు నవ్యక్తమధురవిహాసనంబుతోడను నిత్యసుందరమగు నా కొడుకులముఖపుండరీకయుగళము నార్యపుత్రుఁడు చక్కఁగా ముద్దు పెట్టుకొన నైన లేదుగదా! ఇట్టి సంతానము నేఁ గనిన ఫలమేమి?

తమస—దేవతాప్రసాదము వలన నదియు సిద్ధింపవచ్చును.

సీత—ఆర్యా, తమసా, పిల్లలు తలంపునకు వచ్చినందునఁ బాలు చేఁపువచ్చి, వారల తండ్రి సన్నిధానమున నుండుటచే నిపుడు క్షణమాత్రము సంసారవంతురాల నయితిని.

తమస—ఇచ్చటఁ జెప్పవలసినది మ రేమున్నది? సంతాన
మనునది ప్రేమాతిశయమునకుఁ బరమావధి. తల్లిదండ్రుల
పరస్పరదృఢానురాగమునకుఁ గూడ ముఖ్యకారణము.

గీ. ఉభయులకుఁ బ్రేమపాత్ర మై యొప్పఁ గానఁ
దల్లిదండ్రుల యిద్దఱ యుల్లములను
గదియఁ గట్టెడు మోదంపు గ్రంథియగుచుఁ
దనరుచుండును ధరణి సంతాన మనఁగ. ౧౭

వాసంతిక—ఇటుకూడ దేవర చూడవలయును.

గీ. మొలకపింఛంబుతోనున్న ముగ్ధబర్హిఁ
బెంచె నీప్రియ ప్రీతితోఁ బెఱిఁగి యదియు
మణిముకుటనిభశిఖఁ దాల్చి మహీజ మెక్కి
కూయుచున్నది కాంతతోఁ గూడి యిదిగో. ౧౮

సీత—(కౌతుకము, ప్రేమయుం దోఁప, కన్నీరు గ్రమ్మ) ఇది యదియే.

రాముఁడు—వత్సా! సుఖముగా నుండుము. మే మదృష్ట
వంతులము.

సీత—అట్లగుంగాక.

రాముఁడు—

క. కనుఁగవ ద్రిప్పుచు మఱిమఱి
కనుబొమ లాడంగ ముగ్ధ కరతాళముతో
డను నాడింపఁగఁ దిరుగుచు
గునగున నర్తించు నిన్నుఁ గొడుకుగఁ దలఁతున్. ౧౯

ఆహా! తిర్యగ్జంతువులుగూడఁ బూర్వపరిచయమును మఱవకుండునుగదా!

గీ. ఇంచుకించుక పూచిన యీకదంబ
వృక్షమును బెంచె దేవి తాఁ బ్రీతితోడ

సీత—(కన్నీరుగ్రమ్మ) ఆర్యపుత్రుఁడు బాగుగా గుర్తించెను.

రాముఁడు—

బంధుభావంబునను జూవె వనమయూర
మిందుపై నెక్కి హర్షంబు నొందు నిదిగో. ౨౦

వాసంతిక—దేవర యిచ్చటఁ గూర్చుండురుగాక. ఇదియే మీయాశ్రమము.

రాముఁడు—(కూర్చుండును)

వాసంతిక—

గీ. సఖియు నీవుఁ గూడి శయనించు జానేల
యిదిగొ యీయనంటిఁయూరమందు
సీత లేళ్ల కిచట మేఁత యిడుచునుంట
నిప్పుడు నవి విడువ వీస్థలంబు. ౨౧

రాముఁడు—ఇది చూడశక్యముగాదు. (అని యేడ్చుచు వేఱొకఁ చోటఁ గూరుచుండును.)

సీత—సఖీ, వాసంతీ, ఇది చూపి యార్యపుత్రునకు నాకు నెంతదుఃఖము గలిగించితివి! అక్కటా, అక్కటా! ఆర్య పుత్రుఁ డతఁడే, పంచవటీవన మదియే. ప్రియసఖి వాసం

తికయు నదియే. మా రహస్యవర్తనము లనేకములు చూచిన గోదావరీకాననప్రదేశములు నవియే. కన్న పిల్లలవలె నత్యంతప్రియములై యుండిన మృగములు, పక్షులు, చెట్లునుగూడ నవియే. అన్నియు నున్నవి, కాని, మందభాగ్య నయిననాకు మాత్ర మేమియు లేదు. ఆహా! జీవలోక మెట్లు మాఱినది!

వాసంతి—సఖీ సీతా! రామభద్రుని యవస్థ చూడవేల?

మ. నవనీలోత్పలకోమలావయవసౌం
దర్యంబు నానాఁటికి
న్నవమాధుర్యము లీనుచు న్నదికినా
నందంబు గావించె నా
నవకం బంతయుఁ బోయి నేఁడు వనట
న్నత్యేదియు న్నాకనుం
గవ కెంతే రమణీయమై యితనియా
కారంబు గన్పట్టెడున్. ౨౨

సీత—సఖీ, చూచుచున్నదానను.

తమస—ప్రియుని నీ వెప్పుడును జూచుచుందువుగాక.

సీత—హా దైవమా! ఈతని విడిచి నేను నన్ను విడిచి యీతఁడు నుందు మని కలలోనైన నెవ్వరుం దలంచి యుండరుగద! జన్మాంతరమందును దుర్లభదర్శనుండును వత్సలుండును నగు నార్యపుత్రుని గన్నీటి తెఱపి యందు ముహూర్తమాత్రము చూచెదను. (అని చూచుచుండెను)

తమస—(కౌఁగిలించుకొని, కన్నుగొలుక)

గీ. మోదశోకజబాష్పము ల్పొంగి పొరలఁ
దెలుపు మధురంబు ముగ్ధంబు దీర్ఘము నయి
స్నేహనిష్యందినియు నైన నీదుచూడ్కి
ప్రియుని ముంచుచున్నది పాలవెల్లిపోలె. ౨౩

వాసంతి—

చ. ఫలములఁ బుష్పము ల్గొనుచుఁ
బాదపము ల్తగునర్ఘ్యమీవుతన్
జలరుహగంధ సంభరిత
శైత్యవనానిల మల్ల వీవుతం
గలరవసంయుతంబు లగు
కంఠము లెత్తి పికాళి పాడుతన్
వెలువడివచ్చె రాముఁ డిదె
వెండియు నీ వనముం గనుంగొనన్. ౨౪

రాముఁడు—సఖీ వాసంతీ, వచ్చియిటఁ గూర్చుండుము.

వాసంతి—(కూర్చుండి కన్నురు పెట్టుకొని) మహారాజ! లక్ష్మణకుమారునకుఁ గుశలమా?

రాముఁడు—(వినని వానివలె)

గీ. అంబునీవారఘాసంబు లంబుజాక్షి
ప్రీతిఁ జేయారఁ బెట్టి తాఁ బెంచినట్టి
తరుశకుంతహరిణముల మరలఁ జూచి
నంతనే నాదు మనసు నీరయ్యె నకట. ౨౫

వాసంతి——మహారాజా! లక్ష్మణకుమారునకుఁ గుశలమా యని యడిగితిని గదా!

రాముఁడు——(తనలోఁ దాను) మహారాజా! అని పిలుచుటచేత నీమెకు నా యందుఁ బ్రేమ లేనట్లగపడుచున్నది. కన్నీరొలుక గద్గదకంఠముతో లక్ష్మణుని విషయమై మాత్రమే కుశలప్రశ్నము చేయుటచేత సీతావృత్తాంత మీమెకుఁ దెలిసియున్నదని యూహించెదను. (పైకి) ఆఁ. లక్ష్మణకుమారునకుఁ గుశలమే.

వాసంతి——(ఏడ్చుచు) దేవ, యెంతటికౄరుఁడ వైతివి!

సీత——ప్రియసఖి, వాసంతీ, ఇట్లేలనియెదు? ఆర్యపుత్రుఁ డందఱకు—నందులో ముఖ్యముగా నా ప్రియ సఖ వైన నీకుఁ—బూజార్హుఁడు గదా!

వాసంతి——

చ. హృదయము నీవు నాకుఁ బరి
కింపఁగఁ బ్రాణము నీవ నాకుఁ గౌ
ముదియును నీవ కన్గవ కవూ
ర్వసుదాబ్ధివి మేని కంచు నీ
మొదలగు తేనెపల్కులను
ముగ్ధకు నమ్మి కవుట్టఁ బల్కి నీ
వదయత నామెనే తుదకు——
హా! యిఁకఁ జాలు వచింపనేటికిన్. ౨౬

(అని మూర్ఛిల్లును)

తమస—వాక్యనివృత్తియు మూర్ఛయు సహజమే.

రాముఁడు—సఖీ, ఊఱడిల్లు మూఱడిల్లుము.

వాసంతి—(ఊఱడిల్లి) దేవ! యిట్టి యకార్య మేల చేసితివి?

సీత—సఖీ, వాసంతీ, చాలింపు, చాలింపుము.

రాముఁడు—లోకము సహింపదని.

వాసంతి—ఏమి హేతువుచేత?

రాముఁడు—ఏదో లోకమే యెఱుఁగును.

తమస—ఇప్పుడా యీయాక్షేపము తోఁచినది?

వాసంతి—క్రూరుఁడా.

గీ. యశము నీ కెంతయును బ్రియ మౌనుగాదె
యింతకంటెను దుర్యశం బెద్ది చెపుమ
భీతహరిణాక్షి యేమయ్యె విపినమందు
నెఱుఁగఁ జెప్పుము నాకది యెఱుఁగుదేని. ౨౭

సీత—సఖీ వాసంతీ, నీవే దారుణవుఁ గఠోరవును. ఏడ్చుచున్న వాని మఱింత యేడ్పించుచున్నావు.

తమస—ప్రణయము శోకము నిట్లుసపించుచున్నవి.

రాముఁడు—సఖీ, యెఱుఁగుట కేమున్నది?

గీ. త్రస్తహరిణాక్షి పూర్ణగర్భయు నగు సతి
మృదులబిసకాండకౌముదీమిత్రకోమ
లాంగలతికను గ్రవ్యాదు లాక్రమించి
మాయ మొనరించి యుండును మర్థ మిదియ. ౨౮

సీత—ఆర్యపుత్ర, ఇదిగో నేను జీవించియున్నదానను.

రాముఁడు—హా ప్రియురాల! జానకి, యెక్కడ నున్నదానవు?

సీత—అయ్యో, ఆర్యపుత్త్రుఁడు సామాన్యునివలె బిగ్గరగా నేడ్చుచున్నాఁడు.

తమస—వత్సా! ఇది యుక్తమే. దుఃఖితు లగువారు దుఃఖోపశమనము చేసికొనవలయును గదా.

గీ. అధిక మైన నీరు వచ్చిన యపుడు చెఱువు
గండికొట్టిన భద్ర మై యుండు కరణి
శోక మధిక మై చిత్తముఁ క్షోభపెట్టు
నప్పు డెలుఁగెత్తి యేడ్చిన హాయి గలుగు. ౨౯

అందులో రామభద్రున కీజీవయాత్ర బహువిధకష్టములతో నిండియున్నది.

గీ. చేయవలయును రాజ్యంబు చింత విడిచి
విరహమున సోలె మది యెంత విరుల పగిది
నది స్వకృత మాట విలపింప నైతిగాదు
రుదిత ముచ్ఛ్వాసఫలదంబ యదియు మేల. ౩౦

రాముఁడు—అయ్యో, అయ్యో,

చ. బలువగ బీఁటవాఱు నెద
వ్రయ్యదు రెండగునట్లు మోహమ
గ్గల మయి చాలఁ జేడ్పడెదుఁ
గాయము తెల్వి నశింపఁబోదు లో

పలియుడు కట్టె కాల్చు మఱి
భస్మము సేయదు మేను నంగసం
ధులు ప్రిదులంగ మోదు మఱి
త్రుంపదు ప్రాణము దైవ మక్కటా! ౩౧

చ. జనపదవాసులార పుర
సజ్జనులార వినుండి యింటిలో
జనకజ యుంట మీ కది య
సమ్మత మయ్యెను శూన్యకాననం
బునఁ దృణమట్లు వీడినను
బుట్టద జాలి తలంపు లెంతయు
స్తనమును నీరుసేయ గతి
మాలుట నేడ్చెద నల్గఁజోకుఁడీ. ౩౨

వాసంతి—(తనలోఁ దాను) కోపప్రకటన మతిగంభీరముగా నున్నది. (పైకి) దేవా! కడచినదానికి వగవఁ బనిలేదు. ధైర్య మూనవలయును.

రాముఁడు—ఏమిటి, ధైర్యమా?

గీ. దేవి లేనట్టి జగతికిఁ దీఱెఁ బదునొ
కండువర్షము ల్పేరైనఁ గలదో లేదో
వసుధ రాముండు లేఁ డన్నవార్త లేద
యింతకంటె ధైర్యం బన నెందుఁ గలదు? 33

సీత—ఆర్యపుత్రుని ప్రియవచనములచే నేను మోహితురాల నగుచున్నదానను.

తమస—అవును, వత్సా,

గీ. ప్రియతమంబులుఁ గడుఁ బ్రేమమయము లయ్యు
శోకభీష్మములై నిన్ను సోఁకు నవ్వి
తలఁప సవిషంబు లౌ తేనె ధార లంతె
గాని యవి యెల్ల మాటలు కావుచుమ్మి. ౩౮

రాముఁడు—వాసంతీ, నేను,

చ. కొరవిని ద్రిప్పినట్లు విష
గుంభిత దంతము నాటినట్టులున్
గురుతరతీవ్రతన్ హృదయ
కోశమునందలి కీళ్లు గోయుచున్
బిరబిర శోకశంకు విదె
వేగముతోడుతఁ జీల్చుచుండఁగా
స్థిరమతితో సహించితిని
దీనికి నంతము గల్గు టెన్నఁడో? ౩౯

సీత—మందభాగ్యను నే నార్యపుత్త్రునకు మరల నాయాసము గలిగించుదాన నైతిని.

రాముఁడు—నే నంతఃకరణము నణఁచిపెట్టి యెంతగుట్టుగా నున్నను జిరపరిచిత ప్రియవస్తుదర్శనముచేత దుఃఖ మాఁగకున్నది.

గీ. పొంగి పొరలెడుశోకంబుపొంగు నాఁపఁ
జలుపుయత్నంబు లన్నిటి సమయఁ జేసి

యేచుఁ జిత్తవృత్తి యెదిరియు, యిసుకకట్టఁ
బడఁగఁ దన్ని పాఱునదీప్రవాహ మట్లు. ౩౬

సీత—ఆపుటకు శక్యముగాక పొంగి పొరలుచున్న యార్యపుత్రుని శోకవేగముచేత నా దుఃఖము పోయియు గుండెలు పగులుచున్నవి.

వాసంతి—(తనలోఁ దాను) రామభద్రుఁడు మిక్కిలి కష్టదశలో నున్నాఁడు. కొంచెము మఱపించెదను. (పైకి) చిరపరిచితములగు జనస్థానప్రదేశములకు దేవర దర్శనగౌరవమిత్తురు గాక.

రాముఁడు—అటులే కానిమ్ము. (అని లేచి నడచును.)

సీత—వినోదమునకై ప్రియసఖి చేసిన యీ యుపాయము వలన దుఃఖము మఱింత హెచ్చునని తలంచెదను.

వాసంతి—దేవ, దేవ, చూడుఁడు, ఈపొదరింట నున్నప్పుడే—

చ. పొరుగున గౌతమీపులిన
భూముల నంచలఁ జూచువేడుకన్
ధరణిజ జాగుసేయఁ గను
దమ్ముల నీ వటు నిల్పియుంటి వం
త రమణి వచ్చి నీ వలుక
దాలిచినట్టులు దోఁప భీతయై
కరములు మోడ్చె ముద్దు లొలు
క న్నరసీరుహకుట్మలాకృతిన్. ౩౭

సీత—ఎంతక్రూరురాలవే, వాసంతీ? హృదయమర్మముల నాటుకొని యున్నయలుఁగులం బోలు నీపలుకులచేత నార్యపుత్త్రుని నన్నుఁ గూడ వేఁచుచున్నదానవు.

రాముఁడు—కఠినురాలా! జానకీ, ఇక్కడ నక్కడఁ గనఁబడుచునే యున్నదానవు. నా మీఁద మాత్రము దయలేదు నీకు. హా దేవి!

చ. హృదయము వ్రక్కలయ్యెడు ద
హించెడు లోపలఁ దాప మెప్పుడుం
బ్రిదిలెడు దేహబంధములు
విశ్వము శూన్యము గాఁగఁ దోఁచెడున్
ముదిరిన చిమ్మచీఁకటిని
మున్గెడుఁ జిత్తము జ్ఞానశూన్యమై
గదురుచు మోహ మెల్లెడలఁ
గప్పెడు నక్కట యేమిసేయుదున్? ౩౮

(అని మూర్ఛిల్లును)

సీత—అయ్యో, అయ్యో, ఆర్యపుత్త్రునకు మఱల మూర్ఛ వచ్చినది!

వాసంతి—దేవ, ఊఱడిల్లు మూఱడిల్లుము.

సీత—ఆర్యపుత్త్ర! సకలజీవలోకమంగళాధారమవైన నీకు మాటిమాటికి జీవితసంశయకారక మగునిట్టి కష్టదశ నా మూలమునఁ గదా కలుగుచున్నది. అయ్యో, యెంత నిర్భాగ్యురాలను. (అని మూర్ఛిల్లును)

తమస—వత్సా! ఊఱడిల్లుము. తిరిగి నీ పాణి స్పర్శమే రామభద్రునకు జీవనోపాయము.

వాసంతి—ఏమీ, ఇంకను నూపిరి రాలేదే! హా! సీతా! ఎచ్చటనున్నదానవు? నీ ప్రాణనాథుని బ్రదికింపుము.

సీత—(తొందరగా వెళ్లి) రాముని వక్షమందును లలాటమందును స్పృశించును.

వాసంతి—దైవానుగ్రహముచేత రామభద్రుఁడు తిరిగి జీవించినాఁడు.

రాముఁడు—

చ. వెలుపల లోపల న్సుధను
బెల్లుగ మేనునఁ బూసినట్టులై
తొలుతటిమోహముం దొలఁగఁ
ద్రోసి యసుప్రకరంబు వెండియుం
గలుగఁగఁజేసి తోడుత నె
గాఢసుఖానుభవాప్తిచేత నా
కలఁకను గల్గఁజేసెడు న
కారణరీతిగ స్పర్శ మెద్దియో. 39

(ఆనందముచేతఁ గన్నులు మూసుకొనియె) సఖీ వాసంతీ, నీవు ధన్యురాలవు.

వాసంతి—ఎట్లు?

రాముఁడు—మఱేమి, మఱల దొరకినది, జానకి.

వాసంతి—దేవా, రామభద్ర, ఆమె యెక్కడ!

రాముఁడు—(స్పర్శసుఖ మనుభవించుచు) చూడు, ఇదిగో యిక్కడ, ఈమె కాదూ?

వాసంతి—దేవా, రామభద్ర! ప్రియసఖి వియోగదుఃఖము చేతఁ దపించుచున్న మందభాగ్యురాల నన్ను మర్మచ్ఛేదకములైన యీ క్రూరప్రలాపములచేత మాటి మాటికిఁ గాల్చెదేల?

సీత—తొలఁగిపోవలయు నని యున్నది. గాని, చిరప్రణయాతిశయముచే సౌమ్యము శీతలము నగు నార్యపుత్త్రుని స్పర్శమువలనఁ జిరకాలానుగతదారుణతాపము పోయి, వజ్రలేపనముచే నతికించినట్లు కదలి రాకున్నది, నా ముంజేయి.

రాముఁడు—సఖీ, ప్రలాపములేమి?

చ. పరిణయమందునం దొలుత
భాసురకంకణధారియై సుధా
కరకరశైత్యశాలి యయి
కమ్రలతాంకుర సన్నిభంబునై
కరముఁ బ్రమోదమే కరము
గల్గఁగఁ జేసెను నాకు—

సీత—ఆర్యపుత్త్ర! నీ వాతఁడవే యిప్పుడును.

రాముఁడు— నిప్పుడా

కరము లభించె వెండియును
గట్టిగఁ బట్టఁగఁ గంటి నే నహో. ౪౦

(అని పట్టఁబోవును)

సీత—అయ్యో, ఆర్యపుత్రుని స్పర్శముచేఁ దెలివిదప్పి యున్న నావలనఁ బొరపాటు వచ్చినది.

రాముఁడు—సఖీ, వాసంతీ, ప్రియాస్పర్శసుఖమువలనఁ గలిగిన యానందముచేత నింద్రియములు మూఢములై నేను బరవశుఁడ నయితిని. నీవైన నీమెను బట్టుకొమ్ము.

వాసంతి—అయ్యో, ఉన్మాదమే.

సీత—(త్వరగా హస్తమును లాగుకొని చాటునకు వెళ్లెను,)

రాముఁడు—అయ్యో, ప్రమాదము!

గీ. కడుఁ జెమర్చి కంపించుచు జడమ యైన
నాకరంబున నుండి క్షణంబులోనఁ
గడుఁ జెమర్చి కంపించుచు జడమ యైన
చాన కరపల్లవం బిదె జాఱిపోయె. ౪౧

సీత—అయ్యో, పొంగి పొరలుచున్న వేదనచే నా కింకను మనసు గూటఁబడలేదు.

తమస—(ప్రేమ, కౌతుకము, చిఱునవ్వును దోఁపఁ బరికించి)

గీ. ప్రాణవల్లభు నంటుట వత్స మేను
గడుఁ జెమర్చి పులకలెత్తి వడఁకు నిదిగొ
తొలిజడిని దోఁగి మొగ్గలు కలయఁబొడమి
గాలిచేతను గదలెడు కడిమి యనఁగ. ౪౨

సీత—(తనలోఁ దాను) అవశాత్మనైన నన్నుఁ బూజ్యురాలగు తమన లజ్జగొలుపు చున్నది. "ఆ పరిత్యాగమేమి, యీ యనురాగమేమి" యని యీమె యనుకొను చున్నది కాఁబోలును.

రాముఁడు—(ఎల్లెడఁ గలయఁజూచి) హా! ఏమీ! లేనే లేదా? దేవీ, నిర్దయురాలా?

సీత—నిజముగా నేను నిర్దయురాలనే. ఈస్థితిలోనున్న నిన్నుఁ జూచియు జీవించి యున్నదానను.

రాముఁడు—ప్రియురాల! ఎక్కడ నున్నదానవు? దేవీ, నన్ననుగ్రహింపుము. ఈవిధముగా నున్న నన్ను విడిచి పెట్టఁ దగదు నీకు.

సీత—ఆర్యపుత్ర, మీ మాటలు విపరీతముగా నున్నవి.

వాసంతి—దేవ, చెదరియున్న మీ హృదయమును లోకోత్తరమయిన మీ ధైర్యముచేతనే స్వస్థపఱుచు కొనుఁడు. ఏదీ నా ప్రియసఖి?

రాముఁడు—ఔను, లేదు, స్పష్టమే. ఉన్నయెడల వాసంతికిఁ గూడ నగపడకుండునా? ఇది కలయేమో! నేను నిద్రపోవుట లేదే! రామునకు నిద్ర యెక్కడిది! నిక్కముగా నిఁ నన్ను మాటి మాటికిఁ బీడించుచున్న భ్రాంతి దేవతయే నన్నుఁ బట్టి వదలకున్నది.

సీత—ఈభ్రాంతి క్రూరురాల నయిన నావలననే కలిగినది.

వాసంతి—దేవ చూడు చూడు—

చ. అదిగో సురారి యిన్పరథ
మల్ల జటాయువుచేత భగ్నమై
నది యవిగో పిశాచవద
నాంచితరథ్యఖరాస్థిరాసు ల
య్యదె తెగి యున్నవక్కట జ
టాయువు ఱెక్కలు మించుతోడియం
బున మన జానకిం గొనుచుఁ
బోయె దశాననుఁ డభ్రగామియై. ౮౩

సీత—(భయముతో) ఆర్యపుత్ర! జటాయువును నఱకుచున్నాఁడు. రక్షింపు రక్షింపుము. నన్నుఁ గూడఁ దీసికొని పోవుచున్నాఁడు.

రాముఁడు—(వేగముగా లేచి) ఓరీ, దురాత్మా! లంకాపతీ, జటాయువు ప్రాణమును సీతను హరించి యెక్కడకుఁ బోయెదవురా?

వాసంతి—దేవ, రాక్షసకులమును నిర్మూలముచేసిన మీరు కోపపడఁ దగినవా రింకను గలరా?

సీత—అహో, నాకుఁ బిచ్చి యెత్తుచున్న ట్లున్నది.

రాముఁడు—వేఱొకవిధమైన విపర్యయము గలిగిన దిప్పుడు—

ఉ. ఇంతిని దొల్లి పాసినది
యెంతయుఁ గష్టమ యైన వైరి నా

యంతకు చెంతకుం బనుపు
యత్నభరంబున నోర్వఁగంటి నా
వంతయుఁ దీఱెఁ దత్షిలుని
ప్రాణముతోడుత నిప్పు డన్ననో
యంతములేని యీ ప్రవిల
యంబు సహింప నశక్య మయ్యెడిన్. ౪౪

సీత—అంతము లేఁదట! అయ్యో, అయ్యో!

రాముఁడు—హా, యెంతకష్టము!

సీ. వానరాధిపుమైత్రి వమ్మయ్యె నెచ్చోట
వానరశౌర్యంబు వ్యర్థమెచట
భల్లూకపతి ప్రజ్ఞ పనికిరా దెచ్చోట
ననిలజుం డెచ్చోటి కరుగనేర
డలవిశ్వకర్మజుం డైనట్టి నలుఁడును
శాట యెచ్చోటికిఁ బన్న లేఁడు
సౌమిత్రి పటుబాణజాలంబులును గూడ
సూటిగా నెచ్చోటు సొరఁగఁజాల
వట్టి గహనాతిగహన మై యమరునట్టి
బుద్ధికిని గూడఁ బోల్పఁగాఁ బొసఁగనట్టి
మాఱుమూలను నెచ్చోట మడిఁగి యుంటి
వలఘు గుణజాల యోప్రియురాల బాల ౪౫

సీత—పూర్వవిరహమే మే లనిపించుచున్నది.

రాముఁడు—సఖీ, వాసంతి, ఇప్పుడు రామునిం జూచెడు మిత్రులకు దుఃఖము తప్ప వేఱొకటి లేదు. ఇంకను నిన్నెంతకాల మేడిపింపను! నేను వెళ్ళెదను సెలవిమ్ము.

సీత—(ఉద్వేగము, మోహాము తోఁచునట్లు తమసను గాఁగిలించుకొని) హా! పూజ్యురాల! తమస! ఆర్యపుత్రుఁడు వెళ్లిపోవుచున్నాఁడు. ఏమి చేయుదును! (అని మూర్ఛపోవును)

తమస—వత్సా! జానకీ, స్తిమితపడుము. దైవము నీ కనుకూలము కాఁగలదు. చిరంజీవులగు కుశలవుల వర్ష వర్ధంత్యుత్సవము జరపుటకై భాగీరథి సమీపమునకుఁ బోవుదము.

సీత—పూజ్యురాలా, క్షణమాత్ర మనుగ్రహింపుము. ఈదర్శనము మరల దుర్లభము. క్షణమాత్రమైనఁ జూచెదను.

రాముఁడు—నాకిప్పు డశ్వమేధసహధర్మచారిణి కలదుగదా!

సీత—(ఆక్షేపపూర్వకముగా) ఆర్యపుత్ర! ఎవరు?

వాసంతి—తిరుగ వివాహముకూడ నయినదా?

రాముఁడు—లేదు, లేదు, బంగారుతోఁ జేసిన సీతాప్రతికృతి.

సీత—(సోచ్ఛ్వాసముగ) ఆర్యపుత్ర. నిజముగా నీ విప్పు డార్యపుత్రుఁడ వయితివి. నాహృదయమునందలి పరిత్యాగశల్యము నిప్పు డార్యపుత్రుఁడు పెఱికివైచెను.

రాముఁడు—బాష్పదిగ్ధములైన నా కన్నుల దానిచే నైనను దనిపెదను.

సీత—ఆర్యపుత్రునిచే నిట్లు సన్మానింపఁబడి యార్యపుత్రుని సంతోషపెట్టుచు జీవలోకమున కాశాబంధమై యొప్పెడు నామె ధన్యగదా!

తమస—(చిఱునవ్వు నవ్వుచుఁ బ్రీతితోఁ గౌఁగిలించుకొని) వత్సా! నిన్ను నీవే పొగడుకొనుచున్నదానవు.

సీత—(లజ్జించి) ఎగతాళి చేయుచున్నదానవు, నన్ను.

వాసంతి—ఈ సమాగమము నాకు మహాప్రసాదమైనది. తాము వెళ్లువిషయములో నెట్లుచేసినఁ గార్యహాని కాకుండునో యట్లుచేయుదురుగాక.

సీత—వాసంతి నాకిప్పుడు ప్రతికూలయైనది.

తమస—వత్సా, రమ్ము పోవుదము.

సీత—అట్లేచేయుదము.

తమస—

గీ. చూచుతమిచేత వెడఁదయై శోభచెంది
కాంతుపై నాటియున్న నీకన్నుదోయిఁ
దిగిచి మఱలింపఁ జూచుట ముగుద నీకు
మర్మభేదకమైనట్టి కర్మ మరయ. ౪౬

అట్టి నీ వెట్లు రాఁగలవు!

సీత—సుకృతపుణ్యలోకదర్శనీయము లగు నార్యపుత్రుని పాదపద్మములకు నమస్కారము. (అని మూర్ఛపొందును.)

తమస—వత్సా! ఊఱడిల్లుము.

సీత—(స్తిమితపడి) మేఘములలో నుఱుఁగుపడియున్న నిండు చంద్రుని దర్శనము తిరుగ నెన్నటికోఁగదా!

తమస—ఏమీ, యీ సంవిధానకము!

గీ. కరుణ యొక్కటే రసమది కాంచువేఱు *
వేఱురూపముల నిమిత్తభేదయుక్తి
నలలు బుద్బుదంబులు సుళ్లు ననఁగ వేఱు
తలఁపగా నవి యన్నియు సలిలమయము. ౪౭

(అందఱును లేచుచున్నారు)

తమసా, వాసంతులు—(సీతారాముల నుద్దేశించి)

గీ. అలయరుంధతీ నాథుఁడైనట్టి మునియు
నన్వయపతి త్రయీమూర్తి యస్మదాది
సహితలైనట్టిధారుణీ జాహ్నవులును
హెచ్చుగా నీకు శుభముల నిచ్చుఁగాక! ౪౮

(అందఱు వెళ్ళిపోయిరి)

తృతీయాంకము సమాప్తము.

---

* కరుణరస మొక్కటే యది కాంచువేఱు.

# శ్రీరస్తు.

# ఉత్తరరామచరితము

## చతుర్థాంకము

(ఇద్దఱు తాపసులు ప్రవేశింతురు)

ఒకఁడు—సౌధాతకీ! అధికముగాఁ జేరియున్న యతిథుల సత్కరించుటకై నలుఁపబడుచున్న కార్యభారముచేత రమణీయమైన వాల్మీక్యాశ్రమ మిదిగో చూడుము.

గీ. అపుడె యీనినసతి త్రాగ నట్టియున్న
మధురమా వేఁడి నివ్వరిమండనంబు
నించుకంతయు విడువక యెల్లఁ ద్రావె
నాశ్రమంబునయందలి హరిణ మిదిగో. ౧

గీ. పండు రేఁగు కాయలఁ గూర్చి వండినట్టి
శాకములనుండి వెలువడు సౌరభ మిదె
యావునేతితోఁ గూడిన యన్నరాశి
గంధమును గూడి యెల్లెడఁ గలయఁ బర్వె. ౨

సౌధాతకి—అనధ్యయన హేతువులగుచు గడ్డములు నరసిన యీ తపోధనులకు స్వాగతము.

మొదటివాఁడు—(నవ్వుచు) సౌధాతకీ, పెద్దలను గౌరవించుటకు నీవు చెప్పిన హేతు వపూర్వముగా నున్నది.

సౌధాతకి—దాండాయనా, ఇంతమంది యాఁడువారిని వెంటఁ బెట్టుకొని వచ్చిన యీ యతిథి పే రేమి ?

దాండాయనుఁడు—పరిహాసము విడచిపెట్టుము. ఋశ్యశృంగాశ్రమమునుండి యరుంధతీపురస్కృతుఁడై దశరథ మహారాజుగారిభార్యల వెంటబెట్టుకొని వచ్చిన యీ మహానుభావుఁడు వసిష్ఠుఁడు కాఁడా! ఇట్లు ప్రేలెద వేల ?

సౌధాతకి—ఊఁహూఁ, వసిష్ఠుఁడా ?

దాండాయనుఁడు—మ తేమి ?

సౌధాతకి—ఏదో పెద్దపులి యనుకున్నానులే, నేను.

దాండాయనుఁడు—అ ట్లేల యనుకొంటివి.

సౌధాతకి—ఏల యనుకొంటినా ? ఈయన యిక్కడకు వచ్చి పడెనో లేదో, పాప మానల్లావు పెయ్య బలవంతముగ "మడ మడా" అయినది.

దాండాయనుఁడు—"సమాంసో మధుపర్క" యను శాస్త్రము ననుసరించి శ్రోత్రియు లభ్యాగతులుగా వచ్చినపుడు గృహస్థులు తఱిపి పెయ్యను గాని యెద్దును గాని వండి పెట్టుదురు. ధర్మసూత్రకారులు దీనిని ధర్మముగాఁ జెప్పుచున్నారు.

సౌధాతకి—ఓడిపోయినాఁడవులే.

దాండాయనుఁడు—ఎట్లు ?

సౌధాతకి——వసిష్ఠుఁడు వచ్చుటచేతఁ దఱపిపెయ్యను జంపినారు. ఇప్పుడే రాజర్షియైన జనకుఁడు వచ్చియుండఁగా వాల్మీకి మహర్షి యాయనకుఁ బెరుఁగుతోను దేనెతోను మాత్రమే మధుపర్క మిచ్చి తఱపి పెయ్యను విడిచిపెట్టెను.

దాండాయనుఁడు——ఆకల్పము మాంసభక్షణము విడిచిపెట్టని వారి విషయమై చెప్పఁబడినది. జనకుఁడు మాంసభక్షణము విసర్జించినాఁడు.

సౌధాతకి——ఏమి కారణముచేత ?

దాండాయనుఁడు——సీతాదేవికి సంభవించిన యా యాపత్తు విని యాయన వానప్రస్థాశ్రమము పూని చంద్రద్వీపతపోవనమందుఁ గొంతకాలమునుండి తపస్సు చేయుచున్నాఁడు.

సౌధాతకి——అట్లయిన నిక్కడ కేల వచ్చెను ?

దాండాయనుఁడు——ప్రియమిత్రుఁ డయిన వాల్మీకిమహర్షిని జూచుటకు—

సౌధాతకి——ఈయనకు వియ్యపురాండ్ర సమావేశ మైనట్లా లేనట్లా ?

దాండాయనుఁడు——స్వయముగా వెళ్ళి యాయనను బ్రీతిపూర్వకముగా దర్శింపవలయునని కౌసల్యకు వసిష్ఠుఁ డరుంధతిచేత నిప్పుడే వార్త యంపెను.

సౌధాతకి——ఈ ముదుసళ్లు తమలోఁ దాము కూడుకొని యున్నట్లే మనము కుఱ్ఱవాండ్రతోఁ గలసి యాటవిడుపు

టుత్సవము చేసికొని యాడుకొందము. ఆజనకుఁడెక్కడ ?

దాండాయనుఁడు—ఆయన వసిష్ఠుని వాల్మీకిని సేవించి యాశ్రమమునకు వెలుపల నొకచెట్టుక్రిందఁ గూర్చున్నాఁడు చూడుము—

గీ. ఉల మందున సీతావియోగదుఃఖ
మెపుడుఁ దగిలియుండఁగ దపియించు నితఁడు
పరఁగ నుదరంబులోపల వహ్ని యెపుడుఁ
బ్రజ్వరిల్లఁ గాలెడు వనస్పతియుఁ బోలె. 3

(ఇద్దఱును వెళ్లిరి)

---

(తరువాత జనకుఁడు ప్రవేశించును)

జనకుఁడు—

చ. తనయకుఁ గల్గినట్టి యుతి
దారుణమౌ దురితంబుచేత నా
మనమునఁ బాదుకొన్న ఘన
మన్యువు డెందముఁ గుందఁజేయుచుం
దునియలుగాఁగ మర్మములఁ
ద్రుంచుచుఁ దెం పొకయింతలేక తా
ననయముఁ బేర్చుచున్న దిది
యాఱుట గల్గద యేమి సేయుదున్. ౪

అయ్యో, ముదిమిచేతను, దుర్భరమైన దుఃఖముచేతను, పరాకసాంతపనాదితపశ్చర్యలచేతను ధాతువు లన్నియు శోషించియున్న పాపిష్ఠశరీర మింకను బట్టు వదలి రాల కున్నది. ఆత్మహత్య చేసికొన్నవారు చచ్చి సూర్యరశ్మి చొరని కటికిచీఁకటిలోకములకు బోదురని ఋషులు చెప్పుదురు. అనేకసంవత్సరము లైనను బ్రతిక్షణముఁ దలంపునకు వచ్చుచుండుటచేత నెప్పటి కప్పుడే క్రొత్తది పోలెఁ దీవ్ర మగుచున్నది గాని నాదుఃఖము శాంతించుట లేదు. ఓ తల్లీ, దేవయజనసంభవా! నీజన్మఫల మిట్లు పరిణమించినది! యథేచ్ఛము గాఁ నేడ్చుటకుఁగూడ సిగ్గగుచున్నది. హా! పుత్రి!—

చ. మొలచుచునున్న లేఁత పలు
మొగ్గలు వచ్చియురాని కమ్మ నౌ
పలుకులు నిర్నిమిత్తముగ
వచ్చుచుఁ బోవుచునుండునట్టి యే
ద్పులు చిరునవ్వులున్ దనరఁ
బోల్పె సలారెడు చిన్ననాటి నీ
జలజముఁబోలునెమ్మొగము
చక్కఁదనంబుఁ దలంతు నెంతయున్. ౫

పూజ్యురాలవగు వసుంధరా! నిజముగా నీవు గట్టిగుండె గలదానవే!

చ. ఇనుఁడును వహ్నియు న్సునులు
నీవును గంగ వసిష్ఠుపత్నియుం
దనదు మహత్త్వముం దెలియు
తజ్జ్ఞులు వాక్కున విద్యపోలెఁ దా
జననమునందె నీవలన
సంపరిశుద్ధయు నయ్యె నట్టి నీ
తనయకుఁ గల్గినట్టి యతి
దారుణహింసన మెట్టు లోర్చితో! ౬

(తెరచాటున)

భగవతీ? మహాదేవులార! ఇటు. ఇటు—

జనకుఁడు—ఇదిగో సృష్టిదారి చూపఁగా మహానుభావురా లయిన యరుంధతి (తేచి)—మహాదేవి యనుచున్నాఁ డెవరిని?—(పరికించి) హా! హా! దశరథమహారాజు ధర్మ పత్నియు, నా ప్రియసఖియు నైన కౌసల్యా? ఈమె యామెయే యని యెవ్వరు నమ్మఁగలరు?

గీ. దశరథుని యింటి సిరివోలెఁ దనరె నీవు
పోలె నన నేల సిరియ యై పొల్పెసంగ
నకట యదియెల్ల జెడి యిప్పు డార్తి మూర్తి
చెందినటు లయ్యె విధిదుష్టచేష్టవలన. ౭

గీ. పూర్వ మీమెఁ గన్నఁ బూర్ణోత్సవంబును
గన్నయట్టు లయ్యెఁ గన్నుఁ గవకు

నిప్పు డీమెఁ జూడ నెంతయుఁ గష్టమౌఁ
గురువులోన నుప్పు గూరినట్లు. ౮

(అరుంధతి, కౌసల్య, కంచుకియుఁ బ్రవేశింతురు)

అరుంధతి—నీవు స్వయముగా వెళ్లి జనకుని జూడవలయు నని మీ కులగురువులు సెలవిచ్చి తన్నిమిత్తమై యే నన్నుఁగూడఁ బంపిరిగదా! అడుగడుగునకు సంకోచ మేల?

కంచుకి—దేవీ, ధైర్య మవలంబించి పూజ్యులయిన వసిష్ఠులు సెల విచ్చినప్రకారము జరిగింపవలయు నని మనవి చేయు చున్నాఁడను.

కౌసల్య—ఇట్టి సమయమందు మిథిలాపతిని జూడవలసి వచ్చి నందుకు దుఃఖము లన్నియు నొక్కుమ్మడిగా నవతరించి హృదయమును బెల్లగించుచున్న ట్లున్నది. స్తిమితపడఁ జాలకున్నదానను.

అరుంధతి—దానికి సందేహ మేమి?

గీ. ప్రియులఁ బాసిన దుఃఖంబు విడువ కెపుడు
నుండునట్టిదే యైనను మొందు ప్రీతి
గలుగువారలఁ గన్నప్పు డలవిగాక
పెక్కుమడుఁగులు పెద్దయై పెచ్చుపెరుగు. ౯

కౌసల్య—అడవిపాలయిన కోడలితండ్రియగు రాజర్షి మొగ మెట్లు చూతును?

అరుంధతి—

గీ. భవ్యచరితుండు మీకు సంబంధి యితఁడు
జనకవంశోద్భవుండు సజ్జనవరుండు
యాజ్ఞవల్క్యుని శిష్యుఁ డై యభ్యసించె
నన్నివిద్యల కాదియా నాత్మవిద్య. ౧౦

కౌసల్య—నా కోడలితండ్రి సీరధ్వజుఁడైన యీ విదేహ రాజు, మహారాజునకు హృదయతుల్యుఁడు. దుఃఖ మన్న నేమో యెఱుఁగని యా సుఖదినములు తలంపునకు వచ్చినవి. హా! దైవమా! అది యంతయు గతించెనుగదా!

జనకుఁడు—(దగ్గఱకు వచ్చి) పూజ్యురాలవైన యరుంధతీ, విదేహరాజైన సీరధ్వజుఁ డభివాదించుచున్నాఁడు.

చ. గురువుల కెల్ల సద్గురుఁ డ
కుంఠిత తేజుఁడునౌ వసిష్ఠుఁడుం
బరమపవిత్రుఁగాఁ దనను
భావనసేయును నీ కతంబునం
బరఁగ ద్రిలోకమంగళవు
వంద్యవు నెల్లర కిట్టి నీ కిదే
శిరము ధరిత్రి నంట నతి
సేసెద నేఁ దొలిసంధ్యకుం బలెన్. ౧౧

యరుంధతి—అక్షరమైన తేజస్సు ప్రతిభాసించుఁగాక నీకు. రజోతీతుఁ డై ప్రకాశించు దేవత నిన్ను బావనునిం జేయుంగాక!

జనకుఁడు—గృష్టీ, రాజుగారి తల్లికిఁ గుశలమా ?

కంచుకి—(తనలోఁ దాను) ఇది యతినిష్ఠురమైన మెత్తి పొడుపుమాట. (పైకి) రాజర్షీ, చిరకాలమునుండి రామభద్రుని బాసి యతి దుఃఖితయై యున్న దేవిని మీ రిట్లు కోపవాక్యములచేత మఱియు దుఃఖింపఁజేయుట యుచితము కాదు. అగ్నిశుద్ధియందు విశ్వాసము లేక యల్పులగు పౌరులు బీభత్సమైన ప్రవాద మొకటి యెల్లెడఁ బ్రవర్తింపఁజేయుటచే రామభద్రుఁడు దారుణమైనపని చేసెను.

జనకుఁడు—(కోపముతో) ఆఁ! నా కూఁతును బరిశోధించుట కగ్ని యెవఁడు ? రామభద్రుఁడే యవమానము చేసె ననుకొనుచుండఁగా నిట్టి మాటలచేత జనులు మమ్ము మఱింత పరిభవించుచున్నారు.

అరుంధతి—(నిట్టూర్పు నిగిడ్చి) నిజమే, సీతవిషయమై అగ్ని యగ్ని యనుట యల్పభాషణము. సీత యన్న నంతయు నందే యిమిడియున్నది. హా, వత్సా!

చ. అరయఁగ నాకు నీవు శిశు
వైనను శిష్యవు నైన నేమి నీ
పరమవిశుద్ధత న్నిగుల
భక్తి జనించెను నాకు నీపయిన్

ధర శిశు వైన నేమి వని
తాత్త్వము గల్గిన నేమి పూజకా
కరము గుణంబ లింగమును
గాదు వయస్సును గాదు చూడఁగన్. ౧౨

కౌసల్య—అహో! దుఃఖములు హృదయమును సమూల
ముగాఁ బెల్లగించుచున్నవి. (అని మూర్ఛపొందును)

జనకుఁడు—అక్కటా! ఇదేమిటి!

అరుంధతి—రాజర్షీ! మఱియేమి?

చ. వెస నిను మిత్త్రుఁ జూడ మది
వెండియుఁ దోఁచెను నాఁటిరాజు నా
యసమసుఖంబు నల్ల దివ
సాళియు నీసుత సీత యెల్లయున్
వ్యసనము లిట్లు వెంబడిన
వారల డెందము కుందకుండునే
కుసుమము లట్టుల న్నిగులఁ
గోమలము ల్గద స్త్రీల చిత్తముల్. ౧౩

జనకుఁడు—హాన్త! నే నెంతక్రూరుఁడను! నా ప్రియమిత్త్రుఁ
డయిన దశరథుని ప్రియపత్నిని జిరకాలమునకుఁ జూచుట
తటస్థించినపుడు శత్రువువలెఁ జూచుచున్నాఁడను.

గీ. అనఘ సంబంధి మిత్త్రుండు తనువు నెదయు
జీవ మానంద మఖిలమా జీవితఫల

మన్ని నా కయ్యె దశరథుం డతనికంటెఁ
బ్రియతరం బైన దెద్దియుఁ బృథివిలేదు. ౧౪

హా! ఈమెయేనా యీ కౌసల్య?

గీ. ఈమెయును భర్త తమతమ యింగితముల
నొకరు వినకుండఁ జెప్పుదు రొకరు, వీరి
యలుకయును గూర్మి నావశం బద్దియెల్లఁ
దడవనేటికి దహియించు నెడఁద నకట! ౧౫

అరుంధతి—చిరకాల మూపిరి బిగపట్టి యుంచుటచే నీమె హృదయము సంచలనము వీడియున్నది.

జనకుఁడు— హా! ప్రియసఖి! (అని కమండలూదకము పైఁజల్లును)

కంచుకి—

గీ. సదయుఁడైనట్టి మిత్రునిచంద మొప్పఁ
దొలుత సర్వంబు సుఖముగాఁ దోఁపఁ జేసి
పిదప మనమున కదియెల్ల వెగటు పఱచు
నదయమైనట్టి దైవ మేమనఁగవచ్చు? ౧౬

కౌసల్య—(మూర్ఛ తేఱి) హా వత్సా! జానకీ! ఎక్కడ నున్న దానవు? శరచ్చంద్రసుందరంబును నవవివాహలక్ష్మీ విలాసమంగళంబును నగు నీ సంఫుల్లముఖారవిందము స్మరణమునకు వచ్చుచున్నది. తిరుగవచ్చి నా యంకతల మలంకరింపుమీ వత్సా! రఘుకులమహత్తరుల కెల్లఁ గోడలగు జనకసుత నాకుఁ గూఁతురే యనెడువారు మహారా జెప్పుడును—

కంచుకి—దేవి యన్నట్లే.

గీ. పిల్ల లేవుర లోపలఁ బృథివిపతికిఁ
గూరిమి యధికము సుబాహు వైరియందు
అటులె కోడండ్రు నల్వురి యందతనికిఁ
బ్రీతి యెక్కువ యీరాజు కూఁతునందు. ౧౭

జనకుఁడు—హా! ప్రియసఖ! మహారాజ దశరథ! సర్వ ప్రకారముల చేత హృదయంగముఁడ వైన నిన్ను మఱచుటెట్లు?

గీ. అల్లు నాప్తులఁ బూజింతు రత్తవారు
అద్ది మనపట్ల విపరీత మయ్యె, నరిగి
తీవు సంబంధ బీజంబు నేగె నకట
బ్రతికి యున్నాఁడ నే దుఃఖభాజనముగ. ౧౮

కౌసల్య—వత్సా! జానకీ! నే నేమిచేయుదును! నిర్భాగ్యురాల నైన నా పాపిష్ఠ జీవము వజ్రలేపముతోఁ గదలకుండ నంటించినట్లు నన్ను విడువకున్నది.

అరుంధతి—రాజ్ఞీ! ఊఱడిల్లుము. అప్పుడప్పుడు బాష్పవిశ్రామము కర్తవ్యమే. ఋశ్యశృంగాశ్రమములో మీ కులగురువు "తప్పక యట్లు కావలసియున్నది కావున నే యట్లు జరగినది. చివరకు శుభము కలుగు"నని చెప్పిన మాట జ్ఞప్తియందు లేదా?

కౌసల్య—మనోరథములెల్ల గతించిపోయిన నాకది యెట్లు సంభవించును?

అరుంధతి—అట్లయిన, రాజపత్నీ, నీయభిప్రాయమేమి? అది యసత్య మనియా? క్షత్రియు లట్లు తలంపరాదు.

గీ. భూరి తేజస్సమేతు లా భూమిసురుల
పలుకులం దెప్డు సందేహపడఁగఁ దగదు
భద్రయా లక్ష్మి నివసించు వారినోటఁ
గల్ల యగుమాట వారికిఁ గలుగ దెపుడు. ౧౯

(తెరచాటునఁ గలకలము)

(అందఱును జెవియొగ్గి వినుచున్నారు)

జనకుఁడు—ఓహో! శిష్టానధ్యయన మని స్వేచ్ఛగా నాడుచున్న బ్రహ్మచారుల కోలాహల మిది.

కౌసల్య—చిన్నతనమందు సౌఖ్యము సులభముగదా! (నిరూపించి) ఆహా! చిన్ననాఁటి రామభద్రుని యవయవములఁ బోలి కౌమారలక్ష్మీవిలాసాశ్రయములై మృదు లలితములైన యవయవములచేత వీరందఱిలోను నా కన్నుల కానందము గలిగించుచున్న యీతఁ డెవఁడో?

అరుంధతి—(తనలోఁదాను ఉత్కంఠయు సంతోషముఁదోఁప) భాగీరథి చెప్పిన సరహస్యకర్ణామృత మిదియే కావచ్చును. కాని, చిరంజీవులగు కుశలవులలో నీతఁ డెవ్వఁడో తెలియకున్నది. (పైకి)

చ. కువలయనీల దేహమును
గూఁకటియుం జెలువొందఁ దేజమం
దవని వటూత్కరంబునకు
నాభరణంబన నొప్పి వెండి శై
శవదశ నొందినట్టి రఘు
సత్తముఁ బోలి సుధాంజనంబు దా
నవు నన నాకనుంగవకు
హాయిని గొల్పెడు నీతఁ డెవ్వఁడో? ౨౦

కంచుకి—ఈపిల్లవాఁడు తప్పక క్షత్రియబ్రహ్మచారి యని నేఁ దలఁచెదను.

జనకుఁడు—అవును. ఈతనికి—

చ. గరుల శిరంబు మూర్ధ్నిఁ నెడి
కాండనిధిద్వితయంబు వీఁపునం
దురమున భస్మలాంఛనము
నొప్పగు నైణపు జన్నిదంబు సు
స్థిరముగ నారిచే మొలను
జేరఁగఁగట్టిన కావిపంచెయుఁ
గరమున రావికోలయును
గార్ముకముం జపమాలయుం దగున్. ౨౧

పూజ్యురాలవయిన యరుంధతీ, యీతఁ డెవఁడని యూహించెదవు?

అరుంధతి— మేము నిప్పుడేగద వచ్చితిమి.

జనకుఁడు—ఆర్యా, గృష్టీ, నాకుఁ గుతూహలము మెండుగా నున్నది. నీవు వెళ్లి పూజ్యుఁడైన వాల్మీకినే యడుగుము. ఈ పిల్లవానితో "వత్సా! పెద్దలు వీరెవరో నిన్నుఁ జూడ వలయునని కోరుచున్నారు" అని చెప్పుము.

కంచుకి—దేవర సెలవు ప్రకారము చేసెదను. (అని వెళ్లెను)

కౌసల్య—కంచుకి పిలిచినమీఁదట సీతఁడు వచ్చునో రాఁడో, మీ రేమని తలంతురు?

జనకుఁడు—ఇట్టి రూపముగల చోట సద్వృత్తము లేకుం డునా!

కౌసల్య—(పరికించి చూచి) ఏమీ, గృష్టిమాటలు సవినయముగ విని తోడిబాలుర నెల్లర విడిచి పిల్లవాఁ డిటు వచ్చుచు న్నాఁడు.

జనకుఁడు—(చాలసేపు పరికించి) ఓహో యిదేమిటి?

గీ. వినయశిశిరంబు మాధ్యమసృణము పండి
తాధిగతము సీతని మహిమాతిశయము
దృఢమమైనట్టి నామదిఁ దిగుచు నిదిగొ
యాయసము నీళ్ళు సూదంటుఱాయి పోలె. ౨౨

లవుఁడు—(ప్రవేశించి) వయఃక్రమానుసారముగాఁ బూజింపఁ దగిన వీరివయస్సు తెలియకయే నే నెట్లభివాదింతును? (యోజించి) ఇది యువిరుద్ధప్రకార మని పెద్దలవలన వినియు న్నాను. (వినయముతోఁ జేరవచ్చి) మీకివే లవుని శిరఃప్రణామ పరంపరలు.

అరుంధతి—భద్రా! ఆయుష్మంతుఁడ వగుము.

కౌసల్య—వత్సా! చిరంజీవివి కమ్ము.

అరుంధతి—ఇటురా వత్సా! (లవుని నొడిలోఁ గూర్చుండఁబెట్టుకొని తనలోఁదాను) దైవానుగ్రహమువలనఁ జిరకాలమున కుత్సంగమే కాక నా మనోరథముకూడఁ బూర్ణమైనది.

కౌసల్య—వత్సా! ఇక్కడకుఁగూడఁ గొంచెమురమ్ము. అహా! కొంచెము వికసించిన నల్లగలువలవలెఁ బ్రకాశించుచున్న దేహముచేత మాత్రమేగాక పద్మకేసరములు క్రింగుటచే వగరెక్కిన కంఠముగల కలహంస స్వరమువంటి స్వరముచేతఁగూడ నీబాలుఁడు రామభద్రుని బోలుచున్నాఁడు. కఠోరకమలగర్భపక్ష్మలశరీరస్పర్శముకూడ నద్దియే. వత్సా! నీ ముఖపుండరీకము చూచెదను (గడ్డమెత్తి పరికించి కన్నీరు గ్రమ్మ సాభిప్రాయముగా) రాజర్షీ! చూచితివా? చక్కఁగాఁ బరిశీలింప నీతని మోమునందు నా ముద్దుకోడలి ముఖచంద్రుపోలికలు కనఁబడుచున్నవి.

జనకుఁడు—చూచితిని సఖీ, చూచితిని.

కౌసల్య—అయ్యో! పిచ్చియెత్తిన దానివలె నా హృదయము పరిపరివిధములఁ బోవుచున్నది.

జనకుఁడు—ఉ. బాలునియందుఁ గాన నగు
బాలికపోలిక రాముపోల్కియుం
జాలఁగ రూప మయ్యెడియ
చక్కనికాంతియు నద్ది వాణియున్

శీలము నవ్విఁయే వినయ
సిద్ధియు నయ్యది, దేవి, యక్కటా
యేలొకో కానిమార్గమున
నిట్లు మనంబిదె వర్వులెత్తెడున్. ౬౩

కౌసల్య—వత్సా! నీకుఁ దల్లియున్నదా? తండ్రి నెఱుఁగుదువా?

లవుఁడు—ఊఁ హూఁ.

కౌసల్య—మఱి నీ వెవ్వరివాఁడవు?

లవుఁడు—పూజ్యుఁడయిన వాల్మీకివాఁడను.

కౌసల్య—చెప్పవలసిన దంతయుఁ జెప్పాము.

లవుఁడు—ఇంతే నాకుఁ దెలిసినది.

(తెఱచాటున)

ఓహో సైనికులార! ఆశ్రమ సమీపప్రదేశమునకుఁ వెళ్లఁగూడ దని చంద్రకేతుని యాజ్ఞ యైనది.

అరుంధతీజనకులు—యాగాశ్వరక్షునిమిత్తము వచ్చియున్న చంద్రకేతువును జూడనవకాశము కలిగిన దీదినము సుదినము.

కౌసల్య—ఆహా! లక్ష్మణుని కొడుకాజ్ఞాపించుచున్నాఁడని యమృతబిందుతుల్యములయిన యక్షరముల వినఁగంటిని.

లవుఁడు—ఆర్యా! చంద్రకేతుఁ డెవఁడు?

జనకుఁడు—రామలక్ష్మణులను దశరథపుత్రుల నెఱుఁగుదువా?

లవుఁడు—వారేకదా రామాయణ కథాపురుషులు.

జనకుఁడు—అవును.

లవుఁడు—అయిన నెఱుఁగకేమి ?

జనకుఁడు—ఆ లక్ష్మణుని కొడుకే చంద్రకేతువు.

లవుఁడు—అతఁడూర్మిళాపుత్రుఁడు. రాజర్షియైన మైథిలుని దౌహిత్రుఁడు.

అరుంధతి—కథాప్రావీణ్యము చక్కఁగాఁ బ్రకటించినాఁడు.

జనకుఁడు—(ఆలోచించి) నీకీ కథ తెలిసినచో దశరథుని కొడుకుల కెందఱు పిల్లలో, వారి పేళ్లేవో, యేయేభార్యల యం దెవరుపుట్టిరో చెప్పుము వినియెదను.

లవుఁడు—ఈ కథాభాగము మాకుఁగాని మఱియితరులకుఁ గాని తెలియదు.

జనకుఁడు—ఏమి ? కవి రచియించి యుండలేదా ?

లవుఁడు—రచియించెనుగాని ప్రకాశము చేయలేదు. ఆ కథలో నేదో యొకభాగము ప్రబంధముకంటె రసవత్తరమయిన నాటకముగా రచించి తానే స్వయముగా వ్రాసి వాల్మీకి తౌర్యత్రికసూత్రధారుఁడైన భరతునియొద్దకిఁ బంపెను.

జనకుఁడు—ఎందునిమిత్తము ?

లవుఁడు—అప్సరసలచేత భరతుఁడా నాటక మాడించుటకై.

జనకుఁడు—ఇదియంతయు వింతగా నున్నది మాకు.

లవుఁడు—ఈ విషయమున వాల్మీకి కాస్థ మెందు. ఆ పుస్తకమును గొందఱు శిష్యులచేత భరతాశ్రమమునకుం బంపి

త్రోవలోఁ బ్రమాదమేమియు రాకుండుటకై చాపహస్తుఁడైన నాభ్రాతనుగూడ వారితోఁ బంపెను.

కౌసల్య—నీకు భ్రాతకూడఁ గలఁడా?

లవుఁడు—కలఁడు, ఆయనపేరు కుశుఁడు.

కౌసల్య— అనఁగా నాతఁడు నీకన్నగా రన్నమాట.

లవుఁడు—అవును ప్రసవానుక్రమమును బట్టి యాయన పెద్ద.

జనకుఁడు—మీరు కవలా?

లవుఁడు—మఱియేమి.

జనకుఁడు—కథ యెంతవఱకుఁ బ్రకాశము చేయఁబడినదో చెప్పుము వత్సా.

లవుఁడు—అసత్యాపవాదభయముచే నుద్విగ్నమనస్కుఁడైన రాజు నాజ్ఞచేత నాసన్నప్రసవవేదనయు, దేవయజనసంభవయు నైన సీతాదేవి నొంటిగా వనమందు విడిచి లక్ష్మణుఁ డింటికి వచ్చుపర్యంతము.

కౌసల్య—హా! వత్సా! ముద్దులగుమ్మ! ఏకాకినిగా నరణ్యమందు విడిచిపెట్టినపుడు కుసుమకోమలమగు నీదేహమునకు దైవదుర్విలాసమువలన నెట్టియవస్థ తటస్థించి యుండునోగదా!

జనకుఁడు—హా వత్స!

ఉ. ఓరువరాని యీపరిభ
వోగ్రతచే మతి సంతపింపఁగా
ఘోరవనంబుమధ్యమునఁ
గ్రూరమృగంబులు చుట్టి భీకరా
కారత నార్వఁగాఁ బ్రసవ
కాలపువేదనఁ బొక్కుచు స్వరా
ధారను గావుమయ్య ననుఁ
దండ్రి యటంచును నొంత యేడ్చెతో! ౨౮

లవుఁడు—ఆర్యా! వీరిద్దఱు నెవరు?

అరుంధతి—ఈమె కౌసల్య. ఈయన జనకుఁడు.

లవుఁడు—(బహుమాన ఖేద కౌతుకములతోఁ జూచును)

జనకుఁడు—అహో దురాత్ములయిన పౌరుల నిర్దయత
అహో రామభద్రుని తొందరపాటు!

ఉ. దీపిత వజ్రపాత సమ
తీక్ష్ణపరాభవజాత కోపముఁ
శాపముచేతఁ గాని యిదె చా
పముచేతను గాని రేపెదన్

కౌసల్య—(భయముచే వడఁకుచు) పూజ్యురాలా, రాజర్షి కోప
మాపి రక్షింపవలయును.

లవుఁడు—పాపులచేత నా పరిభ
వంబునకుం దగు శాస్తి యద్దియే

అరుంధతి—

భూపతి! నీకు రాఘవుఁడు
పుత్త్రుఁడు పాల్యులు దీనులౌ జనుల్. ౨౫

జనకుఁడు—

గీ. పుత్త్రభాండంబు రాముండు పోల్ప నాకుఁ
బౌరజనులందు నుందురు బహుళముగను
ద్విజులు స్త్రీబాలవికలాంగ వృద్ధజనులు
కాన నా రెండు శాంతించుఁ గాక యిపుడు. ౨౬

(వటువులు ప్రవేశించి తొందరగా)

కుమార, కుమార. గ్రామములలో నశ్వ మశ్వ మని చెప్పుకొనఁగా మనము విన్న జంతు విశేష మిప్పుడు మాకు స్వయముగాఁ బ్రత్యక్షమైనది.

లవుఁడు—అశ్వమను పేరు పశుశాస్త్రమందును సంగ్రామ సందర్భమందును వినియున్నాము. అది యేలాగున నున్నది?

వటువులు—ఇదిగో వినుము.

చ. కల దొక పెద్దతోఁక వెను
కన్ సతతం బది యాడుచుండు డె
క్కలు మఱినాలుగే, పొడవు
కంఠము, మామిడికాయలంత ము

ద్దలుగ వెలల్చుఁ బేఁడ సత
తంబును బాలతృణంబులం దినుం
బలుకు లికేల పోవుదము
పర్వ్వన ర మ్మది దూరమేగెడున్. ౨౭

(అని యజినమును జేతులునుబట్టుకొని లాగుదురు)

లవుఁడు—(ఉపరోధము, కౌతుకము, వినయముం దోఁప) ఆర్యులార, చూడుఁడు, వీరునన్ను లాగుకొని పోవుచున్నారు.

(అని తొందరగా నడచిపోవుచున్నాఁడు)

అరుంధతి } జనకుఁడు } పిల్లవానికిఁ గౌతుకము మెండు.

కౌసల్య—అరణ్యాచారియైన వీని రూపముచేతను, మాటల చేతను, మీకును నాకును సంతోష మయినది. పూజ్యురాలా! ఆపిల్లవానిని జూచినప్పుడు నామనస్సు వంచితమయి సరిగాఁ జూడలేదు. కావున నిప్పుడు పరువెత్తుచుండగా నా చిరంజీవిని మఱలఁ జూచెదను.

అరుంధతి—ఆచపలుఁడతివేగముగాఁ జాలదూర మేగినాఁడు. వానిని జూచుటెట్లు?

కంచుకి—(ప్రవేశించి) సమయము వచ్చినప్పుడు మీా కిది తెలియు నని మీాతోఁ జెప్పుమని వాల్మీకిమహర్షి సెలవిచ్చెను.

జనకుఁడు—ఇదియేదో యతిగంభీరముగా నున్నది. పూజ్యురాలవగు నరుంధతీ! సఖి కౌసల్యా, ఆర్యాగృష్టీ, మనము స్వయముగాఁబోయి పూజ్యుఁడగు ప్రాచేతసుం జూతము.

(అని వృద్ధవర్గము వెళ్ళును)

వటులు——(వటులు ప్రవేశించి) కుమార ! ఈ యాశ్చర్యమును జూడుము.

లవుడు——చూడను జూచినాఁడను. తెలియను దెలిసినది. నిశ్చయముగా నిది యశ్వమేధ సంబంధమైన గుఱ్ఱము.

వటులు——ఎట్లు తెలిసినది ?

లవుడు——ఓరిమూర్ఖులార ! ఆ కాండమును మీరును జదివియే యున్నారుగదా ! కవచములు, దండములుఁ, దూణీరములు ధరించిన రక్షకులు ప్రత్యేకముగా నూర్గురొలది దానివెంటనున్నారు. మీరుచూడలేదా? ఇదియశ్వమేధాశ్వము వెంటనుండవలసినంత బలము. మీకునమ్మకము లేనిచోఁ బోయి యడుగవచ్చును.

వటులు——ఓహో సైనికులార ! మీరు పరివేష్టించియుండ గుఱ్ఱమిట్లు సంచరించుటకుఁ గారణమేమి?

లవుఁడు——(సస్పృహముగా దనలోదాను) అశ్వమేధ మనఁగా విశ్వవిజయులగు క్షత్రియులయొక్క సర్వక్షత్రపరిభవకరోత్కర్ష నికషము.

(తెరచాటున)

గీ. వినుఁడి జనులార మీరలు వినుఁడి యీహ
యంబు దశకంఠకులఖండ నాంకుఁడైన
సప్తలోకైకవీరుని జయపతాక
యనఁగఁ దద్వీర ఘోషంబు ననఁగ నొప్పు. అ

లవుఁడు—(సగర్వముగా) అహో! యీయక్షరములు సందీపనములుగానున్నవి.

వటులు—చెప్పాటకేమున్నది. నీవు ప్రాజ్ఞుఁడవుగదా! ఏమనియెదవు?

లవుఁడు—ఏమీ! పృథివి క్షత్రియశూన్యమైనదా మీ రిట్లు విజృంభించుటకు?

(తెరచాటున)

ఓరీ, మహారాజునెదుట క్షత్రియులెక్కడ?

లవుఁడు—ప్రేలుట యుడుగుఁడు.

గీ. కలరు క్షత్రియుల్ తప్పక కలరు కలర
యేల యిప్పు డీబెదరింపు లేల మీకు
రిత్తమాటలఁ బనియేమి చిత్త మలర
నీపతాకను హరియింతు నిపుడ నేను. ౨౯

ఓ వటులార! చుట్టుకొని బెడ్డలతోఁగొట్టి యీగుఱ్ఱమును లేళ్ల కదుపులోనికిఁ దోలుఁడు.

ఒకపురుషుఁడు—(ప్రవేశించి సక్రోధముగా) ఛీ, చపలా! ఏమన్నాఁడవు? ఆయుధములు తీక్ష్ణములు. పిల్లవాఁడు పలికినను గర్వపువాక్కులు సహింపవు. రాజపుత్రుఁడైన చంద్రకేతుఁడు దుర్దాంతుఁడు. అపూర్వారణ్య దర్శనముచేఁ బడసినాఁడు. అతఁడు రాకుండగనే మీరు శీఘ్రముగాఁ బోయి చెట్లచాటున దాఁగికొనుఁడు.

వటులు—కుమార! యీ గుఱ్ఱముమాట యిఁకఁ జాలును, మ్రోయుచున్న శరాసనములతో నీ సైనికులు నిన్నుఁ దర్శించుచున్నారు. ఆశ్రమ మేమో దూరముగానున్నది. రమ్ము, లేడిపఱువునఁ బాఱిపోవుదము.

లవుఁడు—ఏమి! శరాసనములు మ్రోయుచున్నవా!

(అని ధను వెక్కు వెట్టి)

ఉ. నారియజిహ్వ తద్గతశ
నద్ఘనకోటులె దంష్ట్రలై తగన్
ఘోరతరోరురావపటు
ఘోషసమిద్ధమదీయచాప మే
పారుచు లోకభక్షణప
రాయణతాహసదంతకాస్యసా
కారత నొందుఁగాత భయ
కంపితభూరివిరోధిసైన్య మై. ౩౦

(ఇట్లు యథోచితముగఁ దిరిగి యందఱు వెళ్ళిపోయిరి.)

చతుర్థాంకము సంపూర్ణము.

శ్రీరస్తు.

# ఉత్తరరామచరితము

## పంచమాంకము

(తెరచాటున) ఓహో! సైనికులారా! దొరకినది మన కూఁత.

చ. పెనఁకువ మాటవిన్న వెను
వెంటనె మిట్టిది యిద్ది పల్లవా
ననక హయంబు లెంతయుర
యంబునఁ బాఱఁగఁ గోవిదారకే
తనము చలింప సూటిగ ర
థంబు సుమంత్రుఁడు తోల వచ్చెడుం
గనుఁ డిదె చంద్రకేతుఁడు జ
గన్నుతవిక్రమరేఖ యొప్పఁగన్. ౧

(అప్పుడు సుమంత్రుఁడు నడుపుచున్న రథమెక్కి ధనుష్పాణియై యద్భుత హర్ష సంభ్రమములొప్పఁ జంద్రకేతుఁడు ప్రవేశించును.)

చంద్రకేతువు—ఆర్యా! సుమంత్రా! చూడు చూడుము.

గీ. చిఱునలుకను హూ మించుక జేవుటింపఁ
బంచచూడంబు లల్లాడ బాణవృష్టి

కురియుచున్నాఁడు సేనపై నురకమ్రోయు
వింటిచేతను నీ పిల్లవీరుఁ డెవఁడొ? ౨

ఆశ్చర్యము!

చ. ఘనతర కోపభారమున
గంధగజేంద్ర కపోలభాగముల్
తునుఁగఁదలంబుగా మెఱుఁగుఁ
దూపుల నేయుచు నార నూత్నమా
నినకులదుర్యశోంకురమొ
యీతఁ డనంగ నెసంగునట్టి యీ
మునిశిశువుం గనుంగొనఁగ
మోదము గల్గెడు నామనంబునన్. 3

సుమంత్రుఁడు—ఓయి! ఆయుష్మంతుఁడా!

గీ. దేవదానవాతీత మై తేజరిల్లు
నితని తేజంబు రూపంబు నెంచిచూడఁ
గాశికసవనరక్షణకాలమందు
ధనువు పట్టినరాముండు దట్టె మదికి. ४

చంద్రకేతువు—ఒకనికై యింతమంది పూనుకొన్నామే యని
నాకు సిగ్గగుచున్నది.

శా. బాలుం డొక్కఁడువీఁడు దుర్భరశర
వ్రాతంబు లెన్నేనియున్
లోలత్కాంచన కింకిణీరవభర
ప్రోద్యద్రథానీక మే

కాలంబు న్నద మాఱుకుండు నిభసం
ఘాతంబులు న్గల్గియా
భీలం బై తనరారు సైన్య మితని
న్వేష్టించి పీడించెడున్. ౫

సుమంత్రుఁడు—వత్సా! ఇవి యన్నియుఁ గూడిన నితనికిఁ జాలవు. విడివిడిగా నున్నఁ జెప్పనేటికి ?

చంద్రకేతువు—ఆర్యా! త్వరగాఁ దోలుము. త్వరగాఁ దోలుము. ఈతఁడు మన సేనల సంహరించుట కారంభించినాఁడు. చూడుము.

శా. జ్యానాదంబు నమంద దుందుభిచయ
స్వానంబు నొక్కుమ్మడిన్
వీనుల్గాడ గుహోదరంబులఁ గరుల్
భీతిల్లి గర్జింపఁగా
సేన ల్గాలుఁడు పొట్టనిండఁ దిని యు
చ్ఛిష్టంబుగా వీడ నా
న్మేను ల్మొండెము లెల్లెడం బఱపె నీ
నిర్వక్రశౌర్యం డహో. ౬

సుమంత్రుఁడు—(తనలోఁ దాను) ఇట్టివానితోఁ జంద్రకేతువు ద్వంద్వయుద్ధము చేయుట కెట్లంగీకరింతును. (చింతించి) నే నిక్ష్వాకుకులవృద్ధును గదా! యుద్ధ మాసన్నమైనపు డింక గతియేమి ?

చంద్రకేతువు—(విస్మయము, లజ్జ, సంభ్రమము దోఁప) ఛీ ఛీ, నా సైన్య మంతయుఁ దిరిగి వచ్చుచున్నది.

సుమంత్రుఁడు—(రథము వేగముగాఁ దోలుచు) ఓయి! ఆయుష్మంతుఁడా! నీ విప్పుడు ప్రశంసించుచున్న వీరుఁ డిడిగో-

చంద్రకేతువు—(మఱచిపోయిన ట్లభినయించి) ఆర్యా! ఈతని నేమని పిలిచిరి యింతకుముందు ?

సుమంత్రుఁడు—లవ యని.

చంద్రకేతువు—

గీ. ఓ మహాబాహుఁడ వినవె యో లవుండ
సైనికులతోడ నీ కేల సమతఁ బెనఁగ
నిదిగో నే నిట నున్నాఁడ నిటులు రమ్మ
కడిమి తేజమందునఁ దేజ మడఁగుఁగాత! ౭

సుమంత్రుఁడు—కుమారా! చూడు చూడుము.

గీ. పృతనమథనంబు నాపి యీ పిల్లవాఁడు
మఱలు నీ వంక నిదిగో నీమాట వినుచు
జలదనినదంబు విని సింహశాబకమ్ము
కరివధము మాని వెన్కకుఁ దిరుగునట్లు. ౮

(అప్పుడు ధీరోద్ధతపరాక్రముఁ డయిన లవుఁడు ప్రవేశించును.)

లవుఁడు—బళీ, రాజపుత్ర, బళీ, నిజముగా నీ వైక్ష్వాకుఁడవే! ఇదిగో నేను వచ్చినాఁడను.

(తెరచాటునఁ బెద్ద కలకలము)

లవుఁడు—(సావష్టంభముగాఁ దిరిగి చూచి) ఏమీ! యిప్పుడే దెబ్బలు తిని పోయి మఱల నిలద్రొక్కుకొని నా వెనుకనే వచ్చుచున్నారు చమూపతులు! ఛీ—

గీ. మందరక్షోభజాజ్వల్యమానబాడ
బాగ్నికిఁ బ్రళయవాతాహతాబ్ధిజలము
భంగి నిర్భరమైన యీబలము నాదు
కట్టలుకకొక్క కబళ మౌఁగాత మిపుడు. ౯

(వేగముగాఁ దిరుగును)

చంద్రకేతువు—ఓయీ! కుమార!

గీ. ప్రియసఖుఁడ వైతివి గుణాతిశయముచేత
నాకు నావాఁడు నీవాఁడు నాఁగ వేఱె
పెనఁగ నేటికి నీ పరిజనముతోడ
నీ ప్రతాపంబు నికషంబు నేన కాదె? ౧౦

లవుఁడు—(హర్ష సంభ్రమములతోఁ దిరిగి వచ్చి,) అహో, వికర్తనకుల కుమారుఁడైన యీమహానుభావుని వీరవచనములు పైకిఁ బ్రసన్నములును లోపల బింకములుగా నున్నవి. వీరలతోఁ బనియేమి? ఈతనినే గారవించెదను.

(తిరిగి తెరచాటునఁ గలకలము)

అవుఁడు—(క్రోధనిర్వేదములతో) ఏమీ! ఈపాపులు వీరసంవాదమునకు విఘ్నము చేయుచు నాకుఁ బని సాగకుండఁ జేయుచున్నారు: (అని వారి కెదురుగాఁ బోవును)

చంద్రకేతువు—ఆర్యా! చూడుఁడు. ఇది చూడఁదగినది.

చ. పటుతరదర్పముం గుతుక
భావము నొప్పఁగ నన్నుఁ జూచుచుం
జటుల బలంబు వెన్కొని వె
సన్ దను ముట్ట నుదీర్ణచాపుఁడై
యిటునటు నూఁగు నీతఁడు స
మృద్ధమరుత్తర లేంద్రచాప సం
ఘటితవినూతనాంబుధర
కాంతి వహించి యెసంగు నెంతయున్. ౧౧

సుమంత్రుఁడు—కుమార! నీవే యీతనిని జూడనైనఁ జూడఁ గలిగితివి, నేనా, విస్మయముచేతఁ బరవశుఁడనే యైపోయి నాఁడను.

చంద్రకేతువు—ఓ రాజులార!

గీ. వాహనారూఢులై యుండి పాదచారిఁ
గవచధారులు గానుండి కవచహీను
బహుజనం బిట మీర లీబాలు నొకనిఁ
జెనకి పోరుట మనకెల్ల సిగ్గుగాదె. ౧౨

లవుఁడు—(సోత్సాదముగా) ఏమీ! నా మీఁద దయదలంచు చున్నాఁడా! (సంభ్రమముతోఁ జింతించి) కానిమ్ము కాలహరణము కాకుండ జృంభకాస్త్రము ప్రయోగించి యీ సైనికుల స్తంభింపఁజేసెదను. (అని ధ్యానించుచున్న ట్లుండును)

సుమంత్రుఁడు—ఏమియిది! మనసైన్యఘోష మకస్మాత్తుగా నడఁగిపోయినది!

లవుఁడు—ఇప్పుడీ ప్రగల్భుని జూచెదను.

సుమంత్రుఁడు—(తొందరగా) వత్సా! యీపిల్లవాఁడు జృంభకాస్త్రమును బ్రయోగించినాఁడని యూహించెదను.

గీ. మెఱుపుల దమము నుగ్రంబుగాఁ బెరసినట్లు
కన్నుదోయిని మిక్కిలి గాసిసేయు
నిదియె పడియున్న దీసేన కదలకుండ
నరయ నిది జృంభకాస్త్రంబ యౌను నిజము. ౧౩

ఏమీ యాశ్చర్యము!

సీ. దరుల లీనములైన శరదంబులం దున్న
మెఱుపుఁదీఁగల చాలు మెఱుఁగులీనఁ
గల్పాంతపవనంబు కలఁగఁజిమ్మిన యట్టి
వింధ్యాద్రి కూటాళివిధము దోఁప
నాతప్తమైనట్టి యారకూటము చాయఁ
దెగడఁ జాలెడునట్టి దీప్తులెసఁగఁ
బాతాళకుక్షిలోఁ బవళించి యున్నట్టి
కటికచీఁకటిఁ బోలుకాయ మొప్పఁ
జటుల సంరంభ రభసంబు దిటముగొనఁగ
గగనచారుల యుల్లముల్ కలఁతఁజెంద
నంబరం బెల్ల దట్టమై యలముకొనియె
జృంభకాస్త్రంబు లివిగో విజృంభణమున. ౧౪

సుమంత్రుఁడు—జృంభకాస్త్రము లీతని కెవరివలన వచ్చియుండునో!

చంద్రకేతువు—మహానుభావుఁడైన వాల్మీకివలన నని తలంచెదను.

సుమంత్రుఁడు—వత్సా! అస్త్రముల విషయములో, అందులోను జృంభకాస్త్రముల విషయములో నీ వనినట్లు కాదు. ఏలన:—

గీ. అలభ్యశాశ్వుఁడు గనె వీని నాదియందు
నతనిచేఁ బడసెను గాశికాఖ్యమౌని
కౌశికుం డుపదేశించెఁ గరుణతోడ
రామభద్రున కదె వీని క్రమము వత్స! ౧౫

చంద్రకేతువు—అతిశయ సత్త్వప్రకాశు లగు నితరమంత్రద్రష్టలు సయితము స్వయముగా వీనిం గనిపెట్టవచ్చును.

సుమంత్రుఁడు—వత్సా! సావధానుఁడవు కమ్ము. నీ ప్రతివీరుఁడు తిరిగి వచ్చుచున్నాఁడు.

కుమారులిద్దఱు—(ఒకనిం గూర్చియొకరు) అహో! యీతనిం జూడ నాకుఁ బ్రీతికలుగుచున్నది. (ప్రీత్యను రాగములఁతో బరికించి)

చ. ఇతనిని జూడ నాహృదయ
మెంతయు సంతసమందె దీనికిం
గతము యదృచ్ఛయో మఱియు
గన్యగుణాతిశయుంబు కల్మియో

గతజనిమైత్రిబంధనమొ
కాక యిదేద్దియొ దైవచేష్టచే
మతికి నగోచరం బగుచు
మాటుగనున్న నిజానుబంధమో! ౧౬

సుమంత్రుఁడు—ఒక్కొకనియం దొక్కొక్కని కవ్యాజమైన ప్రీతి పుట్టుట జీవకోటికి సామాన్యధర్మము. చూచిన మాత్రానఁ జక్షుఃప్రీతి కలుగుట లోకవ్యవహారమందుఁ గలదు. దానికిఁ గారణ మూహింప నలవిగాదు.

గీ. హేతురహితం బయిన పక్షపాతమునకు
విఱుగు డేమియు లేద యీధరణియందు
నరయుఁగా భూతతతి యంతరంగములను
స్నేహమనునట్టి దారంబు చేరఁ గుట్టు. ౧౭

కుమారులు—(ఒకరినొకరుద్దేశించి)

గీ. కన్నమాత్రాన సీతనిఁ గాఁగిలింప
బుద్ధి యుదయించి మేనిదే పులకలెత్తె
నట్టి ననుబట్టువంటి దేహంబుమీఁద
వాఁడితూపుల నెటులేయవచ్చు నకట! ౧౮

చ. శరమ శరణ్య మిద్ధభుజ
సారు నెదుర్కొనఁ గల్గినప్పుడా
శరమును ధన్యమా నిటులు
చక్కనిదా గుఱి యబ్బెనేని నే

శర మిపు డుజ్జగింప ననుఁ
జాలనివాఁ డని యూతఁ డెంచఁడే
గురుతరమైత్రియుం జెఱచుఁ
గ్రూరము లెంతయు వీర పద్ధతుల్. ౧౯

సుమంత్రుఁడు—(లవునిఁ బరికించిచూచి కన్నీరు గ్రమ్మఁదనలోఁదాను) హృదయమా కానిపరువు లెత్తెదవేల ?

గీ. విధివశంబునఁ జెడె దాని బీజ మపుడ
యిఁక మనోరథ మీడేఱు టెట్లు లకట
మున్నె తీవయే తెగిపోయి యున్నయెడలఁ
బూవు లాతీవ వెండియుఁ బూచు టెట్లు? ౨౦

చంద్రకేతువు—ఆర్యా! రథము దిగెదను.

సుమంత్రుఁడు—ఏల?

చంద్రకేతువు—ఈ వీరపురుషుని గౌరవించినట్లు నగును. క్షత్రధర్మమును బాటించి నట్లు నగును. రథారూఢులైనవారు పాదచారుల మార్కొనరాదని శాస్త్రవిదులు చెప్పుదురు.

సుమంత్రుఁడు—(తనలోఁదాను) అయ్యో! కష్టదశ వచ్చినది.

గీ. ధర్మ్యమైన దీనిఁ దగదంచు ఖండించి
మమ్ముఁబోటివారు మాన్పు టెట్లు ?
అనుమతించు టెట్లు లతిసాహసంబైన
కృత్య మిద్ది యంచు నెఱిఁగి యెఱిఁగి ! ౨౧

చంద్రకేతువు—ధర్మసందేహము వచ్చినపుడు నాయనగార్లు కూడఁ జిత్రసఖుఁడవైన నిన్నడుగుచుందురుగదా! అట్టి నీవు సందేహింపనేల?

సుమంత్రుఁడు—ఆయుష్మంతుఁడా నీయూహ యథార్థము గానే యున్నది.

గీ. ఇత్థసాంగ్రామికన్యాయ మిదియ యిదియ
ధర సనాతనంబైనట్టి ధర్మసరణి
మఱియు రఘువంశ్య సింహుల మాననీయ
వీరచారిత్రపద్ధతివిధము నిదియ. ౨౨

చంద్రకేతువు— ఆర్యా! నీ వచన మనురూపముగానే యున్నది.

గీ. ధర్మశాస్త్రవచనమర్మంబు లితిహాస
సమితియును బురాణ సంచయంబు
నఘవిదూరమైన రఘువంశవృత్తంబు
నెల్ల నీవయెఱుఁగు దిత్థచరిత.  ౨౩

సుమంత్రుఁడు—(ఆనందబాష్పములు గ్రుక్కఁగాఁగిలించి)

గీ. వత్స! నీతండ్రి యింద్రజిద్వైరి తాను
నిన్న మొన్నటి పిల్లవాఁ డెన్నిచూడఁ
దత్సుతుఁడును బూనెను వీరధర్మ మౌర
దశరథుకులము సుస్థిరత్వంబు చెందె. ౨౪

చంద్రకేతువు—(కష్టముగా)

గీ. కులము పెద్దకు వంశంబు నిలువనపుడు
కులము నిలుచుట తానెట్లు కుదురు నకట
దానికేగద యాతనితమ్ము లెప్పుడు
భూరిదుఃఖముచేతను బొక్కుచుంద్రు. ౨౮

సుమంత్రుఁడు—చంద్రకేతుని పలుకులు హృదయ మర్మచ్ఛేదకములుగా నున్నవి.

లవుఁడు—ఆహా! యేమీ! యీరసమిశ్రీకరణము!

గీ. ఇందుఁ డుదయింపఁ గలువ లానందమొందు
కరణి నీతనిఁ జూడ నాకనులు తనిసెఁ
గాని జ్యాఘోషధరితాస్త్ర మైనకరము
కయ్య మన్నను దానిదే కాలుద్రవ్వు. ౨౯

చంద్రకేతువు—(రథముదిగి) ఆర్యా, సూర్యవంశజుఁడైన చంద్రకేతుఁడిదే యభివాదించుచున్నాఁడు.

సుమంత్రుఁడు—ఆహిత పరాభవము చేయుటయందు శ్రీమదాది వరాహమూర్తి నీకుఁ దోడ్పడెడుగాత. మఱియు—

చ. కులపతిభానుఁ డీవుతను
గోర్కెలు నీకు మహానుభావుఁడై
కులగురు వెష్ఠ నీహితముఁ
గోరెదుఁ దార్క్ష్యహరీంద్రవాయువుల్

బలము నోనంగుచుండుదురు
పాయక నీకు జయంబు నిచ్చుఁ బో
యలఘుల రామలక్ష్మణుల
జ్యానినదంబను మంత్ర మెప్పుడున్. ౨౭

లవుఁడు—నాకుఁ జేసిన మర్యాద చాలును. నీవు రథము మీఁద నున్నపుడే మిగుల శోభింతువు.

చంద్రకేతువు—అట్లయినచో నీవుకూడ వేఱొక రథము నలంకరింతువుగాక !

లవుఁడు—ఆర్యా ! రాజపుత్రుని రథ మెక్కింపుము.

సుమంత్రుఁడు—చంద్రకేతువు మాటప్రకారము నీవు కూడఁ జేయుము.

లవుఁడు—ఎవరి యుపకరణములు వా రుపయోగించుట కింత విచార మేల ? వనవాసుఁడనుగాన రథ మెక్కుట నా కభ్యాసము లేదు.

సుమంత్రుఁడు—వత్సా ! దర్పసౌజన్యముల రెంటి నెట్లు చూపవలయునో యెఱుఁగుదువు. ఇక్ష్వాకువంశప్రభువగు రామభద్రుఁడు నిన్నుఁ జూచెనేని స్నేహముచే నాతని హృదయము కరఁగిపోవును.

లవుఁడు—ఒకమాట, చంద్రకేతూ, ఆ రాజర్షి సుజనుఁ డని వినియున్నాఁడను. (లజ్జ నభినయించుచు)

మ. క్రతువిధ్వంసకవైరి నేనె యిటు లా
రాధింపుచుండంగ నీ
క్షితిలో నెవ్వగు తద్గుణాంబు నిలయు
న్సేవింపకుండైరిన నీ
క్షితిస క్షత్రియజాతికెల్లను మహా
క్షేపాత్మకంబైన యీ
క్రతు గంధర్వసురక్షకాళి పలుకుల్
కాఱించెదున్ డెందమున్. ౨౨

చంద్రకేతువు—ఏమీ, మా పెదనాయనగారి ప్రతాపో త్కర్షమందుఁగూడ నీ కసహానమా !

లవుఁడు—అసహాన ముండనిమ్ము లేకపోనిమ్ము. ని న్నొకమాట యడిగెదను. ఆ రాఘవుఁ డుదాంతుఁ డనియు నిర్గర్వుఁ డనియు నతని ప్రజలుకూడ గర్వాలు కారనియు విని యున్నాము. అట్టిచో నాతని పరిజనులు రాక్షసవాక్యములు పలుకుచున్నా రేల ?

గీ. దృప్తులును మత్తులును నాఁడు తీవ్రవాక్కు
లరయ రాక్షసవాక్యంబు లండ్రు మునులు
సర్వవైరంబులకు మఱి సర్వ పరిభ
వంబులకుఁ గూడ నవి కారణంబు లగును. ౨౩

ఆ ఋషులే తద్వ్యతిరేకభాషణముల నిట్లు ప్రశంసింతురు.

గీ. కోరికలఁ జేఁపుఁ గీడుల పేరు మాపుఁ
గీర్తి నీను వైరులఁ దోలుఁ బూర్తిగాను

శస్త్రములధాని శాంతాచ్ఛ సత్యవాణి
యరయ జనులపాలిటి వేల్పుటావుగాదె. ౩౦

సుమంత్రుఁడు—ప్రాచేతసాంతేవాసి యగు నీ పిల్లవాఁడు శుద్ధస్వభావుఁడు. ఆర్షసంస్కారాభిసంపన్నముగా మాటలాడుచున్నాఁడు.

లవుఁడు—చంద్రకేతూ! ఒక్కమాట యడిగెదను జెప్పుమా! "మా పెదనాయనగారి ప్రతాపోత్కర్షయందును నీ ససహాసమా" యంటివే, క్షత్రధర్మము వ్యవస్థితవిషయమా యేమి ?

సుమంత్రుఁడు—వత్సా! ఇక్ష్వాకువంశప్రభువైన రాముని నీ వెఱుఁగవు. అతిప్రసంగము మానుము.

గీ. ప్రతిబలంబులపైఁ బడి భంగపఱిచి
నీదు శౌర్యంబు చాటితి నిజము కాని
జామదగ్నిని సాధింపఁ జాలినట్టి
దండి వీరుని నిరసింపఁ దగవు నీవు. ౩౧

లవుఁడు—(నవ్వుచు) ఆర్యా! ఆరాజు జామదగ్నిని గెలిచెనను నీ పెద్దమాట లేల ?

గీ. పలుకులనె యుండు శౌర్యంబు బ్రాహ్మణులకు
బాహువుల నుండు క్షత్రియవర్యులకును
విల్లు పట్టిన విప్రుండు భృగుకులుండు
అతని గెలుచుట నుతియె యా యవనిపతికి ? ౩౨

చంద్రకేతువు—(కోపోద్రేకముతో) ఆర్యా, యీతనితో మాట
లేల ?

గీ. అరిదమనఁ డౌర నేఁటికి నవతరించె
భృగుకులుండును నితనికిఁ బెద్దగాఁడు
సకలభువనభయహరణక్షమము లయిన
తాతచరితంబు లెఱుఁగఁ డీతద్జ్ఞుఁ డహహా! 33

లవుఁడు—రఘుపతి చరితమును మహిమయు నెఱుఁగనివాఁ
డెవఁడు ? కాని, చెప్పవలసినది కొంచెమున్నది. పోనిమ్ము—
అది యెందు కిప్పుడు—కాని

ఉ. వారలు పెద్దలౌటఁ దడ
వందగ దేరికి వారివృత్తమున్
వారి పరాక్రమం బసదె
భామను దాటకఁ జంపువేళఁ బా *
కారిసుతుం జయించు సమ
యంబున నాఖరుతోడ ధీరతం
బోరుచునుండి మూఁడుపద
ముల్లటి వెన్కకుఁ బెట్టినప్పుడున్. ౩౪

చంద్రకేతువు—ఆహా! తాతాపవాదీ! మర్యాద మీఱి
మాట లాడుచున్న వాఁడవు.

* దే। వారిఖరున్వధించు సమయంబున మూడుపదంబు లెట్టులో। తాటి
చినప్పుడున్ బలవిదారి సుతుం బరిమార్చినపుడున్.

లవుఁడు—ఓయీ, నా మీఁదనే యీ కనుబొమల ముడి వెట్టుట?

సుమంత్రుఁడు—వీరిరువురకును క్రోధము రేఁగుచున్న దిదిగో—

ఉ. కోపముచే బొమల్గలయఁ
గుంతలము ల్సెదరంగ నంగముల్
వేపనమందఁ గెంపుటర
విందదళాకృతిఁ గన్నులెఱ్ఱనై
దోఁపఁ జెలంగెడుం జెదరు
తుమ్మెద లొప్పెడు పంకజంబులో
దీపితలక్ష్మియుక్తహిమ
దీధితులో యన వీరివక్త్రముల్. ౩౮

కుమారులు—కుమారా! కుమారా! రమ్ము రమ్ము యుద్ధమున కనువైన చోటునకుఁ బోవుదము.

(అందఱును వెళ్లిపోయిరి)

పంచమాంకము—సమాప్తము.

శ్రీరస్తు

# ఉత్తరరామచరితము

## షష్ఠాంకము

(విమానమెక్కి - విద్యాధరమిథునము ప్రవేశించును)

విద్యాధరుఁడు — ఆహా! క్షాత్రధర్మమును బ్రకటించుచుఁ దగిన కారణము లేకయే తీవ్రముగాఁ బోరుచున్న యీ వికర్తనకులకుమారుల యత్యద్భుతవిక్రమవిలాసములు దేవాసురులను సైత మాశ్చర్యమగ్నులఁ జేయుచున్నవి. చూడుము, ప్రేయసీ!

మ. చిఱుగంటల్ రొదసేయ జ్యానినదము
క్షీణంబుగా నెంతయున్
భరమై భీకరలీల నెల్లయెడలం
బర్వంగ నేపారి దు
ర్భరచాపంబుల గట్టిగాఁ దిగిచి నా
రాచౌఘ మెంతేనియున్
విరియం జిమ్మెడివీరి యుద్ధమెసఁగున్
భీమంబుఁ జిత్రంబునై. ౧

గీ. అమరదుందుభి మ్రోయంగ నవతరించి
మేఘనాదంబుఁ బోలి గంభీర మగున
నినద మేతెంచె నత్యంత నిబిడముగను
వీరి కెంతయు మంగళకారి యగుచు. ౨

కావున నీ మహావీరులపై నవిరళమిళిత వికచ కనక కమల కమనీయసంహతియు నమరతరుణామణినిభముకుళనికర మకరందబిందు సుందరంబును నగు పుష్పవర్ష మెప్పుడును గురిపించు చుండవలయును.

విద్యాధరి—ఏమియిది, చూడ నలవిగాక యాకాశము మెఱుఁగులు క్రమ్మినట్లు కపిలముగా నున్నది!

విద్యాధరుఁడు—ఇది యేమయి యుండును?

గీ. నీలలోహితచక్షుఁడౌ నీలకంఠు
ఫాలలోచన మందలి పావకుండో
త్వష్ట సానపై నెక్కించి తరిమెనయిడఁ
దిగుగుచున్నట్టి మార్తాండు కిరణచయమొ? 3

ఆఁ! తెలిసినది, క్షోభము చెందిన చంద్రకేతుఁడు ప్రయోగించిన యప్రతిహతాగ్నేయాస్త్ర మిది. దీనిమూలమున

గీ. కేతుచామరంబులు దగ్ధమైతనర వి
మానమండలం బవలకు మఱలిపోయె
నరవి నవకింశుకద్యుతిసదృశ మైన
యగ్ని దహియించె నల్లధ్వజాంశుకముల. ౪

ఆశ్చర్యము! ఉచ్చండవజ్రఖండావస్ఫోట పటురటద్విస్ఫులింగుండు, నుత్తాలతుములశిలిహానోజ్జ్వలజ్వాలాసంభారభైరవుండునగు వైశ్వానరుం డెల్లెడల నిదె వ్యాపించి యున్నాఁడు. ప్రియురాలికి నా శరీర మడ్డుచేసి యవలకుఁ దీసికొనిపోయెదను. (అ ప్రకారము చేయును)

విద్యాధరి—అమ్మా! ఆనందమందముకుళిత ఘూర్ణమానలోచన నయిన నా సంతాప మిదె విమలమౌక్తికహారశిశిరమయిన ప్రియుని దేహస్పర్శచేఁ నడఁగినది.

విద్యాధరుఁడు—ప్రియా! నీకు నేనేమి యుపకారము చేసితి నిప్పుడు? కాకున్నను,

క. తన సుఖముండుట చేతన
తన మిత్రుని దుఃఖమెల్లఁ దప్పింపఁగఁ జా
వినయా మిత్రునికంటెను
ఘనతరమౌ వస్తువెద్ది క్ష్మాతలమందున్. ౫౬

విద్యాధరి—అవిరళలోల ఘూర్ణమానవిద్యుల్లతావిలాసశోభితంబులును, మత్తమయూరకంఠశ్యామలంబులు నగు మేఘములాకాశ మంతయు నలముకొన్నవి. ఏమి కారణము!

విద్యాధరుఁడు—లవుఁడు ప్రయోగించిన వారుణాస్త్రప్రభావ మిది. అవిరళముగాఁ గురియుచున్న యుదకధారలచే నాగ్నేయాస్త్ర మెట్లు శాంతించినదో చూడు.

విద్యాధరి—ఇది నా కెంతయుఁ బ్రియము.

విద్యాధరుఁడు—ఆహా! అతిమాత్ర మెప్పాడును జెలువే. కల్పాంతవాతక్షోభముచే గులగులయని మ్రోగుచు నిబిడములైన మేఘముల యంధకారముచేత నావరింపఁబడినట్లును, విశ్వము నంతను నొక్క_ ముద్దగాఁ మ్రింగఁదలఁచి మృత్యువు తెఱచిన కరాళవక్త్రమునుగిరి కందరములోఁ జిక్కుకొన్నట్లును, యుగాంతమందు సర్వద్వారనిరోధము చేసి యోగనిద్రం జెందియున్న నారాయణు నుదరంబులో నిండియున్నట్లును, భూతజాత మెంతయుఁ జిక్కువడి యున్నది. బళీ! చంద్రకేతూ! బళీ, వాయవ్యాస్త్రము మంచి సమయమునఁ బ్రయోగించితివి. ఏలన—

గీ. విద్యమూలమున వివర్తవితతియెల్ల
బ్రహ్మమందున లయమొందు భంగిగాను
ఘనములైనట్టి జీమూతగణము లెల్ల
గాలిచేతను నేడకో తూలిపోయె. ౬

విద్యాధరి—నాథా! యీతఁడెవఁడు, చేయి పైకెత్తి యుత్తరీయము చెరగుఁ దొందరగావీచుచు మధుర ప్రియవచనములచే యుద్ధము నాపుచు వీరిరువురనడుమ విమానముం గ్రిందికి దింపుచున్నవాఁడు?

విద్యాధరుఁడు—(చూచి) ఈతఁడు శంబూక వధచేసి తిరిగి వచ్చుచున్న రఘుపతి.

గీ. ఇమ్మహాత్ముని శాంతవాక్యమ్ము వినుచుఁ
బెనఁగుటను మాని శాంతుఁడయ్యెను లవుండు

చంద్రకేతుండు తా నిదే చాఁగి మ్రొక్కెఁ
దనయుసంగతి నీరాజు గనుత శుభము. ౭

మనము పోవుదము, రా. (అనిపోయిరి)

(రాముఁడు, లవుఁడు, ప్రణతుఁడగు చంద్రకేతుఁడును ప్రవేశించిరి)

రాముఁడు——(పుష్పకముదిగి)

గీ. ద్యుమణికులచంద్ర చంద్రకేతుండ నీవు
వేగవచ్చి నన్గట్టిగాఁ గౌఁగిలింపు
మిహికగతిఁ జల్లనైన నీమేను నాదు
చిత్తదాహంబు శమియింపఁ జేయుఁగాత! ౮

(లేవఁదీసి, యానందబాష్పములతోఁ గౌఁగిలించుకొని) నూతనముగా దివ్యాస్త్రములచేత యుద్ధము చేయుచున్న నీకుఁగుశలమా?

చంద్రకేతు——అత్యద్భుత ప్రియవయస్యలాభాభ్యుదయము వలనఁ గుశలమే. అనర్గళసాహసుఁడైన యీవీరుని నన్ను వలెనే విశేషప్రీతిపూర్వకమైన చూపుతో నాయనగారు చూతురుగాక యని నావిజ్ఞాపనము.

రాముఁడు——(లవుని బరికించి) వత్సా! నీ యీవయస్యుఁ డతి గంభీరమధురకల్యాణాకృతిగలవాఁడు. చాల సంతోషము.

చ. అనువుగ లోకముల్మనుప
నంగము దాల్చిన యస్త్రవేదమో
పనివడి వేదరక్ష సలు
పం దను పొందిన క్షాత్రధర్మమో

గానములప్రోవొ నేరుపుల
గుంపొకొ కాక సమస్తలోక స
జ్జనచరితోరుపుణ్యగణ
సంచయమో యన సీతఁ డొప్పెడున్. ౯

లవుఁడు—(తనలోఁదాను) అహో! యీ మహాపురుషుఁడు పుణ్యానుభావదర్శనుఁడుగదా!

గీ. భక్తి విస్రంభ సుస్నేహ భావములకు
నద్వితీయమౌ పరమాశ్రయంబితండు
భూరిసద్ధర్మసురచిరాకారుఁ డితఁడు
ననఁగ వచ్చును నిస్సంశయంబుగాఁగ. ౧౦

అహో! ఆశ్చర్యము!

చ. గతపడె వైర మొప్పసఁగెఁ
గౌతుకము న్వినయంబు హెచ్చెను
ద్ధతిచనె సీతనింగనన
తత్క్షణమం దిదె పారవశ్య మొం
దితిని మహార్ఘమైనయది
తీర్థములందునఁ బోలె నెద్దియో
యతిశయ ముండనోపును మ
హాత్ములయందుఁ దలంచి చూడఁగన్. ౧౧

రాముఁడు—ఏమీ, ఏకారణముచేతనో యీతఁడేక క్షణమందే నాదుఃఖమును బాపి యంతరాత్మకుఁ బ్రీతి

యొనర్చు చున్నాఁడు. ఆలోచింపఁగా స్నేహమునకుఁ గారణ ముండవలయు నన్నమాట చెల్లఁదగినది కాదు.

గీ. ఆంతరంబైన దేదియో యతుకు నెడల
బహిరుపాధులు లేకయే పరఁగుఁ బ్రేమ
భానుఁ డుదయింప వికసించుఁ బంకజంబు
చంద్రకాంతము ద్రవియించు శశియుఁ దోఁప. ౧౨

లవుఁడు—చంద్రకేతూ, వీ రెవరు ?

చంద్రకేతువు—ప్రియవయస్య, తాతపాదులు.

లవుఁడు—నీవు నన్నుఁ బ్రియవయస్య యని పిలిచితివిగావున ధర్మముచే నాకును దాతపాదులే. కాని, నీవు తాతపాదులనఁదగిన రామాయణకథా పురుషులు నలువురుగదా! వారిలో నీయనయెవ్వరు ?

చంద్రకేతువు—మా పెద్దనాయనగారు.

లవుఁడు—(ఉల్లాసముతో) ఏమీ, రఘునాథుఁడే? ఈ మహానుభావుని దర్శనము చేయుటచే నీదినము సుదినము, నాకు. (సవినయముగాఁ జూచి) నాయనగారూ! ప్రాచేతసాంతేవాసియైన లవుఁ డభివాదనము చేయుచున్నాఁడు.

రాముఁడు—వత్సా! రమ్మిటురమ్ము. (స్నేహపూర్వకముగాఁ గౌఁగిలించుకొని) ఈవినయము చాలును, గాని నన్ను గట్టిగాఁ గౌఁగిలింపుము.

గీ. దళితపుష్కర గర్భచ్ఛదంబు పోలె
మసృణసుకుమార పీనమై మెసక మెసఁగి

చంద్రచందన నిష్యందజడము నగుచుఁ
దనరు నీమేనిస్పర్శంబు తనిపె నన్ను. ౧౩

లవుఁడు—(తనలోఁదాను) ఈయనకు నాయం దకారణ స్నేహము కలిగినది. తెలివితక్కువవాఁడ నయి యీయనకు ద్రోహము చేయు తలంపుతో నాయుధము పట్టినాఁడను. (పైకి) నాయనగారూ! లవుని తెలివితక్కువను క్షమింతురుగాక!

రాముఁడు—నీ వేమి యపరాధము చేసితివి, వత్సా.

చంద్రకేతువు—గుఱ్ఱము వెంట వచ్చినవారు నాయనగారి ప్రతాపము వర్ణింపఁగా విని యితఁడు పరాక్రమించెను.

రాముఁడు—అది క్షత్రియున కలంకారమే కదా!

క. ఉరుతేజస్వియగు నతం
డొరు తేజముఁ జూచి యోర్వకుండుట సహజం
బరుణాంశుఁ జేరి యుండిన
ఖరకరపాషాణ మగ్ని గ్రక్కక యున్నే? ౧౪

చంద్రకేతువు—ఈ మహావీరున కమర్షముసహిత మలంకారముగానే యున్నది. నాయనగారూ! చూడుఁడు. నా ప్రియవయస్యుఁడు ప్రయోగించిన జృంభకాస్త్రము వలన సైన్య మంతయు స్తంభించియున్నది.

రాముఁడు—(విస్మయఖేదములతోఁ బరిశీలించి, తనలోఁ దాను) ఆహా! యీ పిల్లవాని ప్రభావ మిట్టిదా? (పైకి) వత్సా!

అస్త్రముపసంహరింపుము. వత్సా! చంద్రకేతూ! నిశ్చేష్టులై యున్న సైనికుల నోదార్పుము.

(లవుఁడు ధ్యానము చేయును)

చంద్రకేతుఁడు—తమ సెలవు ప్రకారము చేసెదను.

(అని వెళ్లును)

లవుఁడు—నాయనగారూ! అస్త్రము శాంత మైనది.

రాముఁడు—సరహస్యప్రయోగోపసంహారములగు జృంభకాస్త్రములు వత్సకుఁగూడ నభ్యస్తము లైనవి, సంతోషము.

క. జగదుపకారంబునకై
యగణితతప మాచరించి యాత్మమహిమనాఁ
దగునట్టి వీనిఁ గాంచిరి
దుగిణుఁడు మొదలైనయట్టి తొల్లిటి పెద్దల్. ౧౫

మహానుభావుఁడైన భృశాశ్వుఁ డీయస్త్రమంత్రోపనిషత్తును వేయిసంవత్సరములకుఁ బైఁగా శుశ్రూష యొనర్చిన కౌశికున కుపదేశించెను. ఆ మహాత్ముఁడు నా కుపదేశించెను. ఈ యస్త్రముల గురుపూర్వానుక్రమ మిది. అబ్బాయీ! మీ సంప్రదాయ మెవరినుండి?

లవుఁడు—మా యిరువురకు నస్త్రములు తమంతటఁ దామే వచ్చినవి.

రాముఁడు—(ఆలోచించి) ఇందసంభవ మేమున్నది? గొప్ప పుణ్యమువలనఁ గలిగిన మహిమ యేదో యుండవచ్చును. ఇరువురకు నని ద్వివచనమును బ్రయోగించితి వేల?

లవుఁడు—మేము కవలము.

రాముఁడు—అట్లయిన పెండవవాఁ డెక్కడ?

(తెరచాటున) దాండాయన,

గీ. రాజసేనతో లవునకుఁ బ్రబల యుద్ధ
మగుచునున్నదియె సఖుఁడ యేమనని యెదే?
మైన రాజశబ్ద మిపుడ యడఁగుఁబుడను
క్షత్రశస్త్రాగ్ని యిప్పుడే శాంతినొందు. ౧౬

రాముఁడు—

గీ. గాఢసవనలనీరద గర్జితమునఁ
గడిమివృక్షంబు ననలెత్తు కరణినాదు
మేను రవముచేతన పుల్కలూనఁజేయు?
నింద్రమణిమేచకచ్ఛవి యీతఁ డెవఁడొ; ౧౭

లవుఁడు—ఈతఁడు నా యన్నగారు. కుశుఁడను పేరివాఁడు. భరతాశ్రమము నుండి తిరిగి వచ్చినాఁడు.

రాముఁడు—(సకౌతుకముగా) వత్సా! అట్లయిన నాతని పిలువుము.

లవుఁడు—తమ సెలవుప్రకారము చేయుదును. (అని వెళ్ళెను)

(కుశుఁడు ప్రవేశించును)

కుశుఁడు—(సక్రోధముగా ధీరుఁడై నిలిచి ధనుష్టంకారము చేయుచు)

చ. మనువు మొదల్ సతంబు శత
మన్యు భయంబు నడంపఁజాలుచున్
వినయవిహీనులన్ దునుమ
విక్రమ మూనెడు భానువంశ్యులన్
జెనకఁగఁ గంటి నేని శర
నిర్భరవహ్నిశిఖాచయోల్లసత్
ఘనగుణవన్నదీయపటు
కార్ముక మెంతయు ధన్య మౌఁగదా! ౧౭

(అని యిటునటు దిరుగును)

రాముఁడు——ఏమీ, యీ రాచబిడ్డని పౌరుషాతిరేకము!

గీ. సృష్టి త్రిభువనసత్వంబుఁ దృణము సేయు
నడక ధీరోద్ధతిని నేల నణఁగఁద్రొక్కుఁ
గొండుకయ్యును మేటియౌ కొండఁబోలు
దర్పమో కాక శౌర్యమో తలఁప నితఁడు? ౧౮

లవుఁడు——(దగ్గఱకు వచ్చి) ఆర్యునకు జయమగునుగాక.

కుశుఁడు——ఔనుగాని, ఆయుష్మంతుఁడా, యుద్ధము యుద్ధమను నీ వార్త యెట్టిది?

లవుఁడు——అది యేదో కొంచె మైనది లెండు. మీరు దృప్త భావము విడిచి సవినయముగా వర్తింపవలయును.

కుశుఁడు——ఏల?

లవుఁడు—రామాయణకథానాయకుఁడును బ్రహ్మకోశరక్షకుఁడు నగు రఘునందనుఁ డిదె యిచ్చట నున్నాఁడు గావున.

కుశుఁడు—ఈ మహాత్ముఁ డాశంసనీయపుణ్యదర్శనుఁడు. ఈయనయొద్దకేరీతిగా వెళ్లవలయు నని యోజించు చున్నాఁడను.

లవుఁడు—తండ్రియొద్దకు వెళ్లునట్లే వెళ్లవలయును.

కుశుఁడు—అది యేల ?

లవుఁడు—అత్యుదాత్తుఁడును, సుజనుఁడు నాత్రిశేయుఁడు నగు చంద్రకేతుఁడు నన్ను బ్రియవయస్యునిగా భావించు చున్నాఁడు. ఆసంబంధముచేత నీరాజర్షి మనకును ధర్మముచేఁ దండ్రియే యగును.

కుశుఁడు—ఈ సందర్భమున రాజన్యునియెడల వినయము చూపినను దప్పుగాదు. (ఇద్దఱు నడతురు)

లవుఁడు—వివిధలోకోత్తరసుచరితాతిశయసూచకము లగు రూపప్రభావగాంభీర్యము లొప్పెడు నీ మహాపురుషు నన్న గారు చూతురుగాక !

కుశుఁడు—(పరికించి)

గీ. ఔర యీ సుప్రసన్నరూపాతిశయము
బళిర యీపావన మహానుభావమహిమ
ఆదికవిచంద్రు వాగ్దేవి స్వానురూప
పాత్రమందున వినియోగపడియెఁగదర. ౨౦

నాయనగారూ ప్రాచేతసాంతేవాసి యగు కుశుఁ డభి
వాదము చేయుచున్నాఁడు.

రాముఁడు—రమ్ము రమ్ము చిరంజీవి!

గీ. అమృతమయమైన జీమూత మట్లు మిగుల
స్నిగ్ధ మైనట్టి నీమేను జేరఁదిగిచి
కౌఁగిలింపఁగ నుత్కంఠ గలిగెనాకు
రమ్ము వత్స నీ విట వేగ రమ్ము రమ్ము. ౨౧

(కౌఁగిలించుకొని తనలోఁ దాను) ఈతఁ డెవరి పిల్లవాఁడో, కాని—

ఉ. ఆరయ నాశరీరమున
నంతట నూరిన స్నేహసారమో
భూరిముదంబునం గరఁగి
పోయిన డెందము మాఱుగూపో, యా
కారముగన్న చేతనవి
కాసమొ వీనిఁ గవుంగిలింపఁగా
నార సుధారసంబు మెయి
యంతటఁ జల్లిన చంద మయ్యెడిన్! ౨౨

లవుఁడు—సూర్యుఁ డాకాశముమీఁదికి వచ్చియున్నవాఁడు, నాయనగారు ముహూర్తకాలము సాలవృక్షచ్ఛాయ యందు విశ్రమింతురుగాక.

రాముఁడు—వత్సా! నీ యిష్టము వచ్చినట్లే చేసెదను.

(నడచివెళ్ళి యథోచితముగాఁ గూర్చుండెను)

(తనలోఁ దాను)

గీ. వినయభావంబు మెండుగా వెలసియున్న
నాసనస్థితిగమనంబు లాదియైన
సర్వభావముల్ సామ్రాజ్యశంసకంబు
లగుచుఁ దనరు నీ యిరువుర కరయ నారా! ౧౩

గీ. విరియుతమ్ములకు మరందబిందు లట్లు
జాతిమణులకు రుచిరాంశుజాల మట్లు
కాంతు లీనెడు వీరల కాయములకు
నైజశోభావిలాసముల్ తేజ మొసఁగు. ౧౪

రఘుకుల కౌమారచిహ్నము లనేకములు వీరియం దగ
పడుచున్నవి.

గీ. మేను పారావతగ్రీవ మేచకంబు
మూఁపులన్నో యూఁబోతు మూఁపురములు
సుప్రసన్నమా సింహమ్ముచూపు చూపు
స్వనము మంగళమురజనిస్స్వననిభంబు. ౧౫

(చక్కఁగాఁబరిశీలించి) వీరి యాకృతి మావంశమువారి
యాకృతిని బోలినదిమాత్రమే కాదు.

చ. అరయఁగ నీ శిశుద్వయము
నందు విదేహసుతాను రూపమై
పరఁగెడు చొప్పుఁగూడఁ గను
పట్టుచు నున్నది యిద్దె యిప్పుడే

విరిసినయట్టి క్రొత్త యర
  విందముపోలిక నెంతయు స్తనో
హారమగు ధారుణీతనయ
  యాస్యము వెండియుఁ గంటి నిచ్చటన్. ౧౬

గీ. పండువెన్నెల నిగ్గుపల్వరుస యదియ
యదియ పెదవులకూరుపు నవియ చెవులు
నీలలోహితవర్ణముల్ నెఱియుఁ గనుల
నైనఁ బరికింపఁగా వానియందు మదియ. ౧౭

(ఆలోచించి) ఇది వాల్మీకి నివాసమగు నరణ్యము. దేవిని విడిచిపెట్టినది యిక్కడనేకదా! వీరలరూపము వయస్సు నీ విధముగా నున్నవి. అస్త్రములు వీరికి స్వతః ప్రకాశము లఁట! చిత్రప్రదర్శనసమయమున "నీ కడుపులోనున్న శిశువుల కీ యస్త్రము లభ్యస్తమగు" నని నేను దేవితో నన్నమాట యీసందర్భమునఁ దలఁపునకు వచ్చుచున్నది. పూర్వులకునైత మస్త్రములు సంప్రదాయరహితముగా వచ్చియున్నవని వినియుండలేదు. అహో! విస్మయములో మునిఁగి తేలుచున్న నా హృదయమునందలి సుఖదుఃఖాతిశయము విప్రలంభమువలె నున్నది. వీరు కవలఁట! ఆనాఁడు చూడఁగా దేవిగర్భమం దిరువురు శిశువులున్న చిహ్నములు కనఁబడినవి. (కన్నీరు క్రమ్మ)

గీ. చనవుమీఱంగఁ ద్రొల్లి నేఁ జపలనయన
కడుపు చేతితో నల్లనఁ దడవిచూడ
గర్భ మిరుమేను గానుంట గానవచ్చెఁ
బ్రియయుఁ గాంచెను గొన్నాళ్లపిదప దాని. ౨౮

(దుఃఖించి) వీరినే యడిగెద నేదో యుపాయముచేత.

లవుఁడు—నాయనగారూ! ఇదియేమి,

గీ. బాష్పవర్షంబు తఱచుఁ బైఁబర్వ్వకతన
భువనమంగళ మైన మీ ముఖము తనరు
ఘన హిమాసారపాతంబు కతనఁ జెన్ను
తఱిగియుండియుఁ జెలువొందు తమ్మి పగిది. ౨౯

కుశుఁడు —అబ్బాయీ,

ఉ. జాయను బాసినట్టి రఘు
సత్తము చిత్తము కుందకుందునే
ప్రేయసి నష్టమైన భువి
పెద్దయరణ్యము వారికార్తి య
త్యాయత మైన దీవిరహ
మా తుదలేనిది యయ్యొ నీవు రా
మాయణ మేమియుం జదువ
నట్టుల నిట్టులు పల్కెదేటికిన్? 30

రాముఁడు—(తనలోఁ దాను) వీరి సంభాషణము తటస్థముగా నున్నది. ఇంక వీరిని బ్రశ్నింపనక్కఱలేదు. ముగ్ధహృద

యమా, నీ కీయకారణవృథామనోరథ మెట్లు కలిగెను? హృదయదారకమగు నా దుఃఖమును జూచి శిశువులు కూడ జాలిపడుచున్నారు. కాని, కథ తప్పించెదను. (పైకి) వత్సలార! రామాయణము రామాయణ మనుచున్నారు, మీరు. అది మహానుభావుఁడైన వాల్మీకి సరస్వతీనిష్యంద రూపమైన సూర్యవంశప్రశస్తి. అది కొంచెము మీరు చదివిన వినవలయునని కుతూహలపడుచున్నాఁడను.

కుశుఁడు—మేము గ్రంథ మంతయు నావృత్తిచేసినారము. బాలచరితమునందలి రెండు శ్లోకములు మాత్రము స్మృతి కిప్పుడు వచ్చియున్నవి.

రాముఁడు—ఆశ్లోకములు చదువుఁడు.

కుశుఁడు—

శ్లో. ప్రియాతు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి
గుణై రూపగుణైశ్చాపి ప్రీతి ర్భూయో వ్యవర్ధత.
తథైవ రామః సీతాయాః ప్రాణేభ్యోపి ప్రియోభవత్
హృదయం త్వేవ జానాతి ప్రీతియోగం పరస్పరమ్.

రాముఁడు—హృదయమర్మోద్ఘాతములయిన యీ పలుకులు వినఁజాలకున్నాఁడను. హా, దేవి! నీ సంసారవృత్తాంతము లెందునఁ బొందకుండ భ్రాంతిరూపము లయి స్మృతి మాత్రావశిష్టము లైనవిగదా!

చ. అరమరలేనియట్టి ప్రణ
యంబునఁ గల్గు సుఖానుభూతి ని
ర్భరమగు కౌతుకంబు సుఖ
భావము దుఃఖము నెల్లవేళలం
దిరువుర కొక్కరూపగు న
హీనపుఁ గూరిమి నివ్వియన్నియుం
బరువిడి నాఁడె పోయె మఱి
పాపపుఁబ్రాణము పాయకుండెడిన్. 31

హా కష్టము!
క. ఏకాలంబున బహు శో
భాకారత నొప్పెనఁగేఁ బ్రియాగుణజాలం
బేకాలము కడు దుస్సర
మాకాలమె మదికిఁదెచ్చి రకటా వీరల్! 32

గీ. అప్పు డేణాక్షి చనుమొగ్గ లలఁతులయ్యెఁ
బెరిఁగి యల్లన నొకరీతి విస్తరించె
వయసువలపులఁ బెరిఁగెడు వలపుతేఁడు
చిత్తమున రేఁగె నొడలను జిఱుతయయ్యె. 33

లవుఁడు—ఇది చిత్రకూటమార్గమందు మందాకినీవిహారము సలుపు నవసరమున సీతాదేవి నుద్దేశించి రఘుపతియన్న మాట—

శ్లో. త్వదర్థ మివ విన్యస్తః శిలాపట్టోయమాయతః
యస్యాయమభితః పుష్పైః ప్రవృష్ట ఇవ కేసరః.

రాముఁడు—(లజ్జ, చిఱునవ్వు, స్నేహము, కరుణయుఁ దోఁప) శిశువులు మిక్కిలి ముగ్ధులుగదా! అందులో నారణ్యకులు, మఱియును. హా దేవి! ఆసమయమందలి విస్రంభ్యాతిప్రసంగములు నీకు జ్ఞప్తిలో నున్నవా?

చ. కరము శ్రమాంబుబిందువులు
గ్రమ్మఁగ మందసమీరసంగతిం
గురులు లలాటముం బొదువఁ
గుంకుమపంకకలంకహీనతన్
సురుచిరమైన చెక్కుఁగవ
సొంపును వీనులయొప్పు నొప్ప నా
భరణవిహీనమయ్యుఁ గడు
భాసిలు నీమొగముం దలంచెదన్. ౩౮

(మ్రాన్పడినట్లుండి దీనముగా) అయ్యో, లేదు—

గీ. దవ్వులం దున్న బంధులఁ దలఁచి తలఁచి
చూచినట్టులు భావించి సొగయవచ్చుఁ
ప్రేయసి గతింపఁ బాడఱు పృథివియెల్లఁ
గుమ్మున నుడికినట్లగు నెమ్మనంబు. ౩౯

(తెరచాటున)

గీ. జనకుఁడు వసిష్ఠవల్మీకసంభవులును
రాణులు నరుంధతియుఁగూడి రాఁగ వేఁగ

వచ్చి రిదె బక్క మేనులు వడఁకుచుండ
శిశువుల కలహవాక్యముల్ చెవులసోఁక. 3౬

రాముఁడు—ఏమీ, పూజ్యురాలయిన యరుంధతియు, వసిష్ఠుఁడును, అమ్మలు, జనకుఁడునుగూడ నిచ్చటనేయున్నారా! వారల నే నెట్లుచూతును! (దీనతతోఁ జూచి) పితృసమానుఁడైన జనకుఁడుగూడ నిటకు వచ్చియున్నాఁడని వినుటచేత మందభాగ్యుఁడనయిన నాకుఁ బిడుగుపడిన ట్లున్నది.

చ. మునులనుజూచి హర్షమును
బొందఁగ నాఁటి వివాహవేళ నా
జనకుఁడు నీతఁడుం గలిసి
సంతసమొప్పఁగ నుంట గన్నయా
కనులనె యిప్పు డిట్లతనిఁ
గాంచఁగఁగల్గిన పాపినైన నా
తను విడె ప్రేలకున్నయది
తథ్యము చాలును రాముఁ డెంతకున్. 3౭

(తెరచాటున) అయ్యో యెంతకష్టము.

గీ. చేరి యనుభావమాత్రావశిష్టుఁడైన
రాముఁ దమయంత గుఱుతింపరాక యుండి
తొలుత జనకుండు కనిపట్టి తెలిపినంత
మూర్ఛనొందిరి తల్లులు మోడులట్లు. 3౮

రాముఁడు—

గీ. జనకరఘువంశములు రెంటికిని నఖండ
మంగళం బన నొప్పు నమ్మగువపట్లఁ
గరుణవాసిన పాపిష్ఠనరునియందుఁ
గరుణచూపుట వ్యర్థంబు గాదె మీకు? ౩౮

వారిని సంభావించెదను. (అని లేచును)

కుశలవులు—నాయనగారూ! ఇటు ఇటు.

(దైన్యముతో నడచి యందఱును వెళ్లిరి.)

షష్ఠాంకము సమాప్తము.

శ్రీరస్తు.

# ఉత్తరరామచరితము

## సప్తమాంకము

(లక్ష్మణుఁడు ప్రవేశించును)

లక్ష్మణుఁడు—మహానుభావుఁడైన వాల్మీకి తన ప్రభావము చేత బ్రహ్మక్షత్రాదిసమస్తపౌరజానపదులను, అస్మదాదులను, దేవాసురతిర్యగాదిసర్వచరాచరభూతసమూహమును నొక్కచోఁ గూర్చినాఁడు. అన్నగారు, "వత్సా! లక్ష్మణా! వాల్మీకిమహర్షి తాను రచించిన కృతి యప్సరసలు నాటకముగా నాడుదురు గావునఁ జూచుటకు రమ్మని మనలఁ బిలిచెను. నీవు వెళ్లి గంగాతీరమందు నాట్యరంగములో సామాజికుల నందఱఁ గూర్చుండఁబెట్టుటకై తగిన యేర్పాటులు చేయు"మని యాజ్ఞాపించిరి. ఆ ప్రకారము నేను మర్త్యామర్త్య భూతగ్రామము గూర్చుండుటకై తగిన స్థానము లేర్పఱిచి వచ్చితిని. ఇదిగో—

గీ. అలఘు రాజాశ్రమనివాసుఁ డయ్యుఁ గష్ట
మైన మునివృత్తిఁ బూనిన యన్నగారు

ఘనుఁడు వాల్మీకి యందునఁ గలుగు గౌర
వంబుచేతను దా నిట వచ్చె నిదిగో. ౧

(అప్పుడు రాముఁడు ప్రవేశించెను.)

రాముఁడు—వత్సా, సామాజికుల నందఱఁ గూర్చుండఁబెట్టితివా ?

లక్ష్మణుఁడు—చిత్తము.

రాముఁడు—ఈ పిల్లల నిద్దఱను జంద్రకేతుతో సమముగాఁ గూర్చుండబెట్టవలయును.

లక్ష్మణుఁడు—మీకు వారియం దంత ప్రీతి యుండుటచే నట్లే చేసితిని. ఇదిగో రాజాసనము పఱవఁబడియున్నది. అందుఁ దాము కూర్చుండవలయును.

రాముఁడు—(కూర్చుండి) ఆరంభము చేయుఁడు.

సూత్రధారుఁడు—(ప్రవేశించి) "మేమార్ష చక్షుస్సుచేఁ గనుపట్టి పావనవచనామృత మయినట్టియుఁ గరుణాద్భుత రసమయ మయినట్టియు నొక కావ్యము రచించితిమి. దానియందు గౌరవముగలవా రయి సావధానముగా వినవలయు"నని మహానుభావుఁ డయిన వాల్మీకిమహర్షి స్థావరజంగమాత్మక జగత్తున కాజ్ఞాపించుచున్నాఁడు.

రాముండు—దీని తాత్పర్య మిది. మహర్షులకు ధర్మములు ప్రత్యక్షములు. కావున వారి మాటలు దోషాతీతములు, సత్యములును. అవి యెప్పుడును దప్పునవి సంశయింప రాదు.

(తెరచాటున) హా ! ఆర్యపుత్ర ! కుమారలక్ష్మణ, యీ యరణ్యమందు శరణలేక యేకాకినయి ప్రసవవేదనపడుచున్న నన్నుఁ గ్రూరమృగములు తినఁ జూచుచున్నవి. మందభాగ్యనయిన నే నిప్పు డీభాగీరథిలోఁ బడియెదను.

లక్ష్మణుఁడు—కటకటా ! ఏదో విపరీతము కానున్నది.

సూత్రధారుఁడు—

గీ. దేవి విశ్వంభరాత్మజ భూవిభుండు
పెద్ద యడవిలోఁ దన్నట్లు విడిచిపెట్ట
బ్రసవకాలంబు తన కంతఁ బ్రాప్తమగుడు
గంగలోపలఁ బడవైచెఁ గాయ మకట ! ౨

(అని వెళ్లిపోయెను)

రాముఁడు—(తొందరగా) దేవీ, దేవీ, లక్ష్మణునినైనఁ జూడుము.

లక్ష్మణుఁడు—ఆర్య, యిది నాటకము.

రాముఁడు—హా ! దేవి, దండకారణ్యవాసప్రియసఖి. రామునివలన నీకుఁ గలిగిన ఫల మిదిగదా !

లక్ష్మణుఁడు—ఆర్యా ! స్తిమితపడి చూడవలయును. ఇది యార్షప్రబంధము.

రాముఁడు—ఇదిగో, వజ్రమయహృదయుఁడనై సిద్ధముగా నున్నవాఁడను.

(చెలియొక పిల్లను, ఒడిలోఁ బెట్టుకొని తనను బట్టుకొన్న గంగావిశ్వంభర లచే నవలంబితయై మూర్ఛపోయిన సీత ప్రవేశించెను.)

రాముఁడు—అబ్బాయీ, దారియుఁ దెన్నును దెలియని చీఁకటిలోఁ బడుచున్నట్లున్నది, నేను; నన్నుఁ బట్టుకొమ్ము.

దేవులు—

గీ. ఊఱడిల్లుము వైదేహి యూఱడిల్లు
దైవకృప నీకుఁ గళ్యాణ మావహిల్లె
నలఘు రఘువంశ ధూర్వహు లైనయట్టి
కవలకొడుకుల నీటిలోఁ గంటి విపుడు. 3

సీత—(మూర్ఛ తేఱి) దైవానుగ్రహమువలన నిద్దఱు మగపిల్లలఁ గంటిని. హా! ఆర్యపుత్త్ర! (అని తిరుగఁ మూర్ఛపోయెను.)

లక్ష్మణుఁడు—(పాదములపైఁ బడి) ఆర్య, దైవకృపచే మన మదృష్టవంతుల మైనారము. రఘువంశమునకుఁ గళ్యాణాంకురము కలిగినది. (చక్కఁగఁ జూచి) అయ్యో! ఏమీ, యేడ్చి యేడ్చి యన్నగారు మూర్ఛనొందిరే! (అని వీచును)

దేవులు—వత్సా! ఊఱడిల్లుము.

సీత—(మూర్ఛ తేఱి) అమ్మా! మీ రెవ్వరు?

పృథివి—ఈమె నీ యత్తింటి కులదేవత భాగీరథి.

సీత—అమ్మా నీకు నమస్కారము.

భాగీరథి—నీ చారిత్త్రమునకుఁ దగిన శుభములఁ బొందుము.

లక్ష్మణుఁడు—అనుగ్రహింపఁబడినవార మైతిమి.

భాగీరథి—ఈమె నీ తల్లి విశ్వంభర.

సీత—ఓ తల్లీ, ఇట్టి దశలో నీకంటఁ బడవలసివచ్చినదిప్పుడు.

పృథివి—వత్సా! సీతా! ఇటు రమ్ము. (ఒకరినొక రాలింగనము చేసికొని యిరువురు మూర్ఛిల్లిరి.)

లక్ష్మణుఁడు—(హర్షముతో) దైవానుగ్రహమువలన వదినెగారు పృథ్వీభగీరథులచే ననుగ్రహింపఁబడినది.

రాముఁడు—ఇది మఱింత దుఃఖకరముగా నున్నది.

భాగీరథి—అపత్యస్నేహముచే విశ్వంభర దుఃఖము పాలయినది. ఈ యపత్యస్నేహాత్మకమోహగ్రంధి చేత నాప్రపంచమంతకు సాధారణమే గదా! సఖీ భూతధాత్రి! వత్సవైదేహి, ఊఱడిల్లుఁడు.

పృథివి—(మూర్ఛ తేఱి) దేవీ! సీతను గని యెట్లూఱడిల్లి యుండఁగలను?

గీ. దనుజగృహవాస మోర్చినదాన నెట్లొ
దయితుఁ డుజ్జగించుట యెట్లు సయిఁపవచ్చు?

గంగ—

పూర్వకర్మముల్ ఫలియింపఁ బూనుకొన్న
వలదటంచు వారింప నెవ్వారితరము? ౮

పృథివి—దేవీ, భాగీరథి, ఇదియంతయు మీ రామభద్రునకు యుక్తమే—

క. బాలుండై చేపట్టిన
బాలకరంబును జనకుని బావకు నన్నున్
శీలము వంశమునన్నిటిఁ
దేలికగాఁ జూచి యట్లుధిక్కృతిసేసెన్. ౫

సీత—హా, ఆర్యపుత్ర! తలంతువా?

పృథివి—నీ కార్యపుత్రుఁ డెవఁడు?

సీత—(కన్నీరొలుక లజ్జతో) ఔను. అమ్మా నీవనినట్లే.

రాముఁడు—తల్లీ, పృథివీ. ఇట్టివాఁడను నేను.

గంగ—భగవతీ, వసుంధరా, నీవు సంసారాత్మక ప్రపంచమునకు శరీరమువంటిదానవు. ఎఱుఁగనటు లల్లునిపై నిట్లేల యలిగెదవు?

గీ. అలమె నపయశం బుర్విలో నగ్నిశుద్ధి
లంకయందాట నమ్మ రీవంకజనులు
ప్రజలఁ దనుపుట యిక్ష్వాకువంశధనము
ఇట్టి యిక్కట్టులో వత్స యేమి సేయు? ౬

లక్ష్మణుఁడు—దేవత లవ్యాహతాంతఃప్రకాశులుగదా!

గంగ—నీ కిదేయంజలిచేసెదఁ బ్రసన్నవుకమ్ము.

రాముడు—తల్లీ, భాగీరథీ, నీవు మొదటినుండియు భగీరథు వంశమం దనుగ్రహము చూపుచునేయున్నదానవు.

పృథివి—నీయెడల నే నెప్పుడును బ్రసన్ననే, కాని స్నేహసంవేగ మాపాతదుస్సహముగదా! రామభద్రునకు సీత యందుగల స్నేహము నే నెఱుఁగనిదానను గాను.

గీ. మెండువగపున డెందంబు మండుచుండ
దైవగతిచేత వత్సను దాను వీడి
యురుసుధైర్యంబు మహిమచే నవనిజనుల
పున్నెములచేతను బ్రదికియున్నవాఁడు. ౭

రాముఁడు—పిల్లలయందుఁ బెద్దల కెప్పుడును దయయే యుండునుగదా!

సీత—(ఏడ్చుచు నంజలిచేసి) తల్లీ, నన్నుఁ దీసికొనిపోయి నీలో విలయముం బొందింపుము.

గంగ—అవి యేటిమాటలు. నీవు వర్ధిల్లుదువుగాక!

పృథివి—వత్సా, నీకొడుకుల నీవు చూచికొనవలయును.

సీత—అనాథనైన నాకీ పిల్లలేల?

రాముఁడు—హృదయమా నీవు వజ్రయమవే.

గంగ—సనాథవైన నీ వనాథ వగు టెట్లు?

సీత—అభాగ్యురాలనయిన నాకుఁ సనాథత్వమన నెట్టిది?

దేవులు—

గీ. వత్స నీసాహచర్యంబువలన మాప
విత్రతయుఁగూడ హెచ్చయ్యె విశ్వభువన
మంగళంబును లోకసమ్మాన్యవు నయి
నిను నిటులు నీవు నిందించుకొనియె దేల? ౮

లక్ష్మణుఁడు—ఆర్య, వినుఁడు.

రాముఁడు—లోకము వినునుగాక!

(తెరచాటునఁ గలకలము)

రాముఁడు—ఇదియేదో యద్భుతము !

సీత—ఇదియేమి ! అంతరిక్షమందు మంటలుఁ గలకలముఁ బుట్టినవి.

దేవులు—తెలిసినది. భృశాశ్వుఁడు, కౌశికుఁడు, రాముఁడు నని గురుక్రమముగల జృంభకాస్త్రము లివి.

(తెరచాటున)

గీ. వందనం బిదె వైదేహి వందనంబు
చిత్రపట మీవు నాఁడు దర్శించినపుడ
రాఘవేంద్రుండు మమ్ము వారలకు నొసఁగెఁ
గాన నీదుసుతులె మాకు గతిగదమ్మ ! ౯

సీత—ఆర్యపుత్ర ! నీయనుగ్రహ మిప్పటికిని బ్రకటిత మగుచున్నది !

లక్ష్మణుఁడు—"ఇవితప్పక నీసంతానము నాశ్రయించియుండు" నని యన్నగారు చెప్పియేయున్నారు.

దేవులు—

గీ. ప్రణతియిదె మీకుఁ బరమాస్త్రగణములార !
ఘనులమైతిమి మీయనుగ్రహముచేతఁ
దలఁచినప్పుడు వత్సలఁ గలయవలయు
భద్ర మగుఁగాక మీకు జృంభకములార ! ౧౦

రాముఁడు—

గీ. విస్మయానందభావ ముల్విస్తరిల్లి
పెనఁగి క్షోభంబుగావింపఁ బెచ్చుపెరిఁగి
కరుణ కల్లోలజాలంబుఁ గలఁగఁబఱచ
హృదయ మేనిది యెద్దియో యెఱుఁగఁజాల. ౧౧

దేవులు—సంతోషింపుము, వత్సా! సంతోషింపుము—నీ పుత్రులు రామభద్రతుల్యులై రిపుడు.

సీత—పూజ్యులారా! వీరికి క్షత్రియోచిత సంస్కారము చేయు వారెవరు?

రాముఁడు—

క. ఘనుఁడు వసిష్ఠుఁడు గురువౌ
ననఁగఁ జెలఁగునర్కవంశమందున జన్మిం
చిన బాలురకును సంస్కృతి
యొనరించెడువాఁడు లేఁడయొక్కఁడు నకటా! ౧౨

గంగ—భద్రా! నీకీ చింతయేల? వీరు పాలు విడిచిపెట్టినపిదప మహానుభావుఁడయిన వాల్మీకి కొప్పగించెదను.

గీ. అంగిరసుఁడును నలవసిష్ఠాఖ్య మునియు
జనకరఘువంశములకు నాచార్యులైన
పగిది వాల్మీకి యీరెండు వంశములకు
నిప్పు డొకఁడ యాచార్యుఁడై యొప్పుఁగాక! ౧౩

రాముఁడు—అమ్మా! బాగుగానే యోచించినదానవు.

లక్ష్మణుఁడు—ఆర్యా! నిజము మనవిచేసెదను. అనేక హేతువులం బట్టి చూడఁగా నీపిల్ల లిద్దఱును కుశలవు లయిన ట్లూహించుచున్నాఁడను.

గీ. పరమమాని యైనవాల్మీకిశిష్యు లై
పదియు రెండు నేళ్ల వయసు గలిగి
యాత్తసిద్ధములగు నస్త్రముల్గలవీరి
కార్యపోల్కి యున్న దరయఁగాను. ౧౮

రాముఁడు—కావుననే నామనస్సు కడుఁ జంచలమై నాకే మియుఁ దోఁపకున్నది.

పృథివి—వత్సా! వచ్చి రసాతలమును బవిత్రముచేయుము.

రాముఁడు—ప్రియురాలా! లోకాంతరము చేరెదవా?

సీత—జీవలోకమువలని యీపరిభవము సహింపఁజాలను. అమ్మా, నన్ను నీయందు విలయముఁ బొందింపుము.

లక్ష్మణుఁడు—దీని కుత్తర మేమిచ్చునో!

పృథివి—నామాటవిని పాలు విడుచువఱకు నీకొడుకులం బెంపుము. పిమ్మట నీయిష్ట ప్రకారము చేసెదను.

గంగ—అలాగుననే చేయవలయును.

(గంగా విశ్వంభరలును సీతయు వెళ్లిరి.)

రాముఁడు—ఏమీ, అలాగుననే యైనదా! హా! చారిత్ర దేవతా! లోకాంతరమం దుండి పోయితివా! (అని మూర్ఛితుఁ డయ్యెను.)

లక్ష్మణుఁడు—మహానుభావుఁడవయిన వాల్మీకీ, రక్షింపుము, రక్షింపుము. నీ కావ్యార్థమిదియేనా ?

(తెరచాటున)

రంగము చాలింపుఁ డింతటితో. ఓమర్త్యామర్త్యులార ! స్థావరజంగమములార ! వాల్మీకిమహర్షి చే సమకూర్పఁబడినట్టియుఁ బవిత్రము నాశ్చర్యము నయినట్టియు విషయమును జూడుఁడు.

లక్ష్మణుఁడు—

గీ. కలఁగఁబాఱ మథించిన కరణి గంగ
యలమె దేవర్షినికరంబు లాకసంబు
వసుధ గంగయు వెంట రా వచ్చె నార్య
జలము వెల్వడి మిగుల నాశ్చర్యగతిని. ౧౫

(తెరచాటున)

గీ. తల్లి యోయరుంధతి జగద్వంద్యురాల
జాహ్నవీధాత్రులము మేము జనకజాత
సీత నీ కోడలిని బుణ్యశీల నిదిగో
యొప్పగింతుము నీ వొప్పఁజెప్పికొమ్ము. ౧౬

లక్ష్మణుఁడు—అహో ! ఆశ్చర్య మాశ్చర్యము. ఆర్యా చూడుము. అయ్యో, అన్నగారింకను మూర్ఛ తేఱలేదు.

(అరుంధతియు సీతయుఁ బ్రవేశించిరి.

అరుంధతి—

గీ. వత్స ! వైదేహి ! బిడియంబు వదలిపెట్టి
జాగు సేయక నీవిటు వేగవచ్చి
చల్లనైనట్టి నీకర స్పర్శమునను
బాలు రాముని బ్రదికింపవలయుఁజుమ్మి. ౧౭

సీత—(తొందరగావెళ్ళి స్పృశించి) ఆర్యపుత్ర ! ఊఁఅడిల్లుఁ దూఁఅడిల్లుఁడు.

రాముఁడు— (మూర్ఛ తేఱి యానందముతో) ఓహో యేమియిది! (చూచిహర్షాద్భుత రసములతోఁప) ఏమీ, యీమె నా దేవి జానకియా ? (సిగ్గుపడి) ఏమీ, యీమె యార్య యరుంధతియా? వీరందఱు ఋశ్యశృంగాదులగు పెద్దలా ?

అరుంధతి—వత్సా ! యీమె రఘుకుల దేవతయగు భాగీరథి, సుప్రసన్నురాలు.

(తెరచాటున)

జగత్పతీ, రామభద్ర, ‹‹అరుంధతివలెనే సీతకు నీవెప్పుడును క్షేమము నాలోచించెడు దానవుకమ్ము. తల్లీ !›› యని చిత్రదర్శనకాలమందు నీవన్నమాట తలఁపునకుఁ దెచ్చుకొమ్ము. నే నిప్పుడు ఋణవిముక్తనయితిని.

అరుంధతి—ఈమె నీ యత్తగారు పూజ్యురాలగు వసుంధర:

(తెరచాటున)

పిల్లను విడిచిపెట్టు సమయమున "భగవతి, వసుంధరా శ్లాఘ్యయగు నీ కూఁతురు జానకిని గనిపట్టు"మని నీ వంటివి. ఆప్రకారము చేసినదాన నయితినిగదా!

రాముఁడు—పూజ్యురాలా! కృతాపరాధుఁడయ్యును నీ యనుకంపకుఁ బాత్రుఁడయిన రాముఁడు నమస్కరించుచున్నాఁడు.

అరుంధతి—ఓహో! పౌరజానపదులారా! ఇప్పుడే గంగా వసుంధరలు ప్రశంసించి యరుంధతినైన నాకర్పించినట్టి యీమె యింతకుఁ బూర్వ మగ్నిదేవునిచేఁ బుణ్యచారిత్రయని నిర్ణయింపఁబడినది. బ్రహ్మాదిదేవతలపొగడ్త నొందినది. దేవయజనసంభవ. సావిత్రకులము కోడలు. అట్టి యీ జానకిని మీరు పవిత్రురాలుగా గ్రహింపవలయును. ఏమందురు?

లక్ష్మణుఁడు—ఆర్యా, అరుంధతిచే నీ విధముగా నిర్భర్త్సితులయిన జనులందఱు, భూతగ్రామమంతయు వదినెగారికి నమస్కరించుచున్నారు. ఇదిగో లోకపాలకులును, సప్తర్షులును పుష్పవృష్టిఁ గురిపించుచున్నారు.

అరుంధతి—జగత్పతివైన రామభద్ర!

గీ. సాంగమంగళి జాంబూనదాకృతికిని
మూల మైనట్టి ప్రియురాలి ముద్దరాలి

ధర్మ మెప్పుడుఁ దప్పని ధన్యురాలి
ధర్మ పద్ధతి నేలు మో ధరణినాథ. ౧౮

సీత—(తనలోఁదాను) ఆర్యపుత్రుఁడు సీత దుఃఖమును మాన్పఁ దలంచెడునా?

రాముఁడు—తమ సెలవు ప్రకారమే.

లక్ష్మణుఁడు—కృతార్థుఁడనైతిని!

సీత—నేను మరల జీవించిన దాననైతిని!

లక్ష్మణుఁడు—వదినగారు! నిర్లజ్జుఁడైన లక్ష్మణుఁ డిదె నమస్కరించుచున్నాఁడు.

సీత—ఇట్టివాఁడవయి చిరకాలము జీవింపుము.

అరుంధతి—మహాత్మా వాల్మీకీ, సీతాగర్భ సంభవులగు కుశలవులను దెచ్చి రాముని కొప్పగింపు మిప్పుడు. (అని వెళ్ళెను.)

రామలక్ష్మణులు—దైవానుగ్రహమువలన ననుకొన్నట్లే యయినది.

సీత—ఆపిల్లలెక్కడ?

(వాల్మీకియుఁ గుశలవులును బ్రవేశించిరి.)

వాల్మీకి—వత్సలారా! ఈయన మీతండ్రి రఘుపతి. ఈతఁడు మీ పినతండ్రి లక్ష్మణుఁడు. ఈమె మీతల్లి సీత. ఈ రాజర్షి మీ మాతామహుఁడైన జనకుఁడు.

సీత—(హర్ష కరుణాద్భుత రసము లుప్పొంగఁ జూచి) ఏమీ, నాయన గారా?

వత్సలు—హా తండ్రీ, హా తల్లీ, హా మాతామహా!

రామలక్ష్మణులు—(సంతోషముతోఁ గౌఁగిలించుకొని) వత్సలారా! పుణ్యవశమున మీరు లభించితిరి.

సీత—నాయనా కుశ, నాయనా లవ, మీ రిటువచ్చి నన్నుఁ జాలసేపు కౌఁగిలింపుఁడు. నేను మీ తల్లిని లోకాంత రమునుండి వచ్చినదానను.

కుశలవులు—(అప్రకారము కావించి) ధన్యుల మైతిమి.

సీత—పూజ్యుఁడవయిన మహర్షీ, నీకిదె ప్రణామము.

వాల్మీకి—వత్సా, యిట్లు నే చిరకాలముండుము.

(తెరచాటున)

లవణుని నిర్మూలించి మధురేశ్వరుఁ డిదె వచ్చినాఁడు.

లక్ష్మణుఁడు—శుభములలోనే శుభములు వచ్చునుగదా.

రాముఁడు—ఇదియంతయు ననుభవించుచున్నను నమ్మఁజాలకున్నాఁడను. అభ్యుదయముల స్వభావము కాఁబోలు నిది.

వాల్మీకి—రామభద్రా! నీకు మిక్కిలి ప్రియమైన దేదియో తెలుపుము. కావించెదను.

రాముఁడు—ఇంతకంటెఁ బ్రియతరమయిన దేమున్నది! అయినను నిట్లగుఁగాక!

మ. వరవాగ్బ్రహ్మవిదుండునుం బరిణత
ప్రజ్ఞుండు నౌ సత్కవి
శ్వరుకావ్యం బిది పాపము ల్దునుముతన్
భద్రంబులం గూర్చుతం
బరఁగున్ గంగయుఁ మాతయు న్బలెఁగడున్
భవ్యంబు రమ్యంబునై
వఱలు న్నాటకరూపమై రస విదుల్
ప్రాజ్ఞు ల్ప్రయోగింపఁగాన్. ౧౯

ఇది శ్రీమత్కౌశికగోత్రపవిత్ర జయంతివంశ
రత్నాకరసుధాకర రామయనామధేయ
ప్రణీతాంధ్రోత్తరరామచరితనాటకము
సంపూర్ణము.

# సవరణ పట్టిక.

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 12 | జానకుఁబలె | జానకుబలె |
| 6 | 3 | ఏమునుఁ | ఏమును |
| | 20 | భద్రునిఁ | భద్రుని |
| 8 | 19 | చక్కఁగా | చక్కగా |
| 11 | 15 | తలపు | తలఁపు |
| 12 | 8 | స్నిగ్ద | స్నిగ్ధ |
| | 10 | అదిగోఁజూడు | అదిగోచూడు |
| 13 | 13 | పరమసుఖాస్తి | పరమసుఖాప్తి |
| | 28 | ఎట్లు | ఎట్లు ? |
| 14 | 16 | ఆడుచుండగా | ఆడుచుండఁగా |
| 18 | 3 | పఠము | పటము |
| 22 | 20 | ప్రీతికి | ప్రీతిని |
| 23 | 16 | రామారాజు | రామరాజు |
| 33 | 1 | భయఁపడి | భయపడి |
| 38 | 5 | నిర్ఘారము | నిర్ఘారవము |
| 42 | 9 | నిల్పు | నిల్వ |
| 51 | 2 | ఔత్సుచ్ఛక్యము | ఔత్సుక్యము |
| 52 | 10 | సర్వమును | స్వరమును |
| 58 | 14 | జటాయు | జటాయూ |
| 61 | 1 | మరేమున్నది | మతేమున్నది |

| పొరట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 64 | 3 | నిమ్యందినియునైన | నిమ్యందియగునట్టి |
| 68 | 7 | మిూకఁది | మిూకది |
| 69 | 7 | కొరవి | కొఱవి |
| 70 | 3 | ఆపుటకు | ఆఁపుటకు |
| 71 | 3 | వేపుచున్న | వేఁపుచున్న |
| 72 | 11 | మేనున | మేనను |
| 73 | 8 | తొలగి | తొలఁగి |
| 77 | 12 | అరుగఁనేరడు | అరుగనేరఁడు |
| 81 | 3 | సలుఁపబడు | సలువఁబడు |
| 84 | 6 | ఉలము | ఉల్లము |
| 85 | 17 | బోల్పెసలారెడు | బొల్పెసలారెడు |
| | 17 | నాటి | నాఁటి |
| 87 | 19 | మడుగులు—పెరుగు | మడుఁగులు—పెరుఁగు |
| 93 | 20 | ఎవ్వడో | ఎవ్వఁడో |
| 94 | 2 | కూకటి | కూఁకటి |
| | 8 | ఎవ్వడో | ఎవ్వఁడో |
| | 12 | గరులు | గఱులు |
| 95 | 21 | రః ప్రణామములు | శిరః ప్రణామములు |
| 103 | 14 | సస్పృహాముగా దనలో దాను | సస్పృహాముగాఁ దనలోఁ దాను |

112 వ పొరటలో 3 వ పంక్తి క్రింద చంద్రకేతువు :—
దానికి సందేహమేమి ?

| | | | |
|---|---|---|---|
| 114 | 16 | ననుబట్టి | నునుఁబట్టు |
| 117 | 15 | ఆహిత | అహిత |

| పొరట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 120 | 20 | భృగకులుఁడు | భృగుకులుఁడు |
| 121 | 21 | నపుడున్ | నప్పుడున్ |
| 124 | 6 | అమరతరుణ | అమరతరుతరుణ |
| 125 | 13 | జావిన | జాలిన |
| 126 | 8 | నిండి | నిమిడి |
| 128 | 14 | గనన | గనిన |
| 131 | 21 | వలవఁ | వలనఁ |
| 136 | 21 | యిప్పుడే | యప్పుడే |
| 138 | 7 | వరంబు | వర్షంబు |
| 139 | 13 | పితృతా | పితృకృతా |
| 140 | 6 | నవ్వి | యివ్వి |
| 141 | 3 | విస్రంభ్యా | విస్రంభా |
| 145 | 2 | నిదిగో | నిదిగా |
| 146 | 2 | శరణ | శరణము |
|  | 8 | పెట్ట | పెట్టఁ |